ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 117 పేజీలు: 16 వెల: 6.50

మమత ఎమ్మెల్యేలు, ఎంపీలు
**బిజెపి వైపు చూపు!**

5లో

2028 నాటికి చంద్రునిపైకి నాసా వ్యోమగాములు



బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడు వేడుకల్లో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, మాజీ స్పీకర్ యనమల, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు

## తెలుగువారి ఆత్మవిశ్వాసం

# పసుపు పండుగ

- దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ టిడిపికే
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం
- మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం
- భావితరాల కోసం పనిచేయడమే టిడిపి లక్ష్యం: మహానాడు ప్రారంభ ప్రసంగంలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించామన్నారు. మహానాడును మహిళలకు అంకితం చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నామన్నారు. సోషల్ సైకోల తాటతీసి మహిళల గౌరవాన్ని కాపాడతాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహానాడు అంటే కార్యకర్తల పండుగ అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. రెండు రోజుల పాటు హైబ్రీడ్ పద్దతిలో జరిగే మహానాడు2026 బుధవారం ప్రారంభం అయింది. టిడిపి కార్యాలయం వద్ద తెలుగుదేశం జెండావిష్కరించిన టిడిపి అధినేత చంద్రబాబు, పార్టీ కేంద్ర కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు,.ఎన్టీఆర్ విగ్రహానికి పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు.నివాళులర్పించారు. మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అమరవీరులకు టిడిపి అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు అంజలి ఘటించారు.చంద్రబాబు జ్యోతి ప్రజ్వలనతో పార్టీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ప్రారంభమైంది. కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ వర్చువల్ వల్ల వాహనాల జోష్ తగ్గిందే కానీ మీలో జోష్ తగ్గలేదు. క్లస్టర్ల నుంచి లక్షలాది మంది పాల్గొన్నారు. మారింది మీటింగ్ విధానమే, మహానాడు విధానాలు కాదు. మహానాడు అన్ని అంశాలపై చర్చించుకుందాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను పరిచయం చేసింది టిడిపి అని వెల్లడించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్తానం అన్నీ అద్భుతాలేనని చంద్రబాబు అన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం అని, పసుపు జెండా చూస్తే ధైర్యం, నమ్మకం, భరోసా కలుగుతుందన్నారు. తెలుగుదేశంపై ప్రజల >>2



బుధవారం మహానాడు ప్రారంభ సమావేశంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

# మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం

## ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మన విధానం: మంత్రి లోకేష్

**విజయవాడ,మే 27,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీలో ఇకపై మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హైబ్రీడ్ విధానంలో జరుగుతున్న తొలి టిడిపి మహానాడులో కీలకంగా అంశాలపై మాట్లాడారు.పార్లమెంట్‌లో బిల్లు పాసైనా, కాకపోయినా పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని లోకేష్ వెల్లడించారు. బిగ్ అనౌన్స్‌మెంట్ అని ఉదయం పెట్టిన పోస్టుకు అనుగుణంగా తన ప్రసంగంలో మహిళలకు రిజర్వేషన్ అంశాన్ని నారా లోకేష్ ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్సీ పోకడలను ఎత్తి చూపారు. గొడ్డలి పార్టీ అంటే వైఎస్సార్సీకి కోపం వచ్చిందన్నారు. మాది గూగుల్ మీది గొడ్డలి, మాది ఫైటర్ జెట్ మీది ఫ్యాక్షన్, మాది కియా అయితే మీది కిడ్నాప్ బోత్ ఆర్ నాట్ సేమ్ అంటూ మంత్రి లోకేష్ వైఎస్సార్సీకి చురకలంటించారు. రాష్ట్రానికి పెట్టుబడిదారులు క్యూ కడుతున్నారంటే సిబిఎన్ వల్లేనని >>2

### 'ఇది మహిళా మహానాడు'

విద్య, ఉద్యోగం, ఆర్థికంగా మహిళలకు చేయూత ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామని సిఎం చంద్రబాబు మహానాడులో పేర్కొన్నారు. విద్య, ఉద్యోగం, ఆర్థికంగా మహిళలకు చేయూత ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. దీపం 2.0 ద్వారా యేడాదికి మూడు ఉచిత సిలెండర్లు ఇస్తున్నాం అన్నారు.గత ఏడాది లక్ష మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్‌లుగా తయారు చేశాం అన్నారు. మరో 5 లక్షల మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా మార్చేలా కార్యాచరణ చేపట్టాంఅన్నారు. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం. మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర. అందుకే ఈ మహా >>2



## 'సర్' చట్టబద్ధమే

### ఎన్నికల్లో పాల్గొనేందుకే జాబితాల సవరణ

### పౌరసత్వం రద్దుచేసే హక్కు ఇసికి లేదు..

### సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మే 27:** ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను సుప్రీంకోర్టు సమర్థించింది. ఇదే విచారణలో పౌరసత్వంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. న్యాయస్థానం ఓటరు >>2



రాజమండ్రి వద్ద గోదావరి కాల్వల పరిస్థితిని పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

# నదుల కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

## రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

### డి.సిఎం పవన్ ఆదేశాల మేరకు నిర్ణయం

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వచ్చే ఏడాది జూన్ నెలలో మొదలయ్యే గోదావరి పుష్కరాల నేపథ్యంలో గోదావరితోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదులలో కాలుష్య నివారణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నదుల్లోని కాలుష్య సమస్యలను గుర్తించి, వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టడం కోసం అత్యున్నత స్థాయి ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ జిఒ జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధ్యక్షతన రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. రాజమహేంద్రవరంలో రెండు రోజులపాటు పర్యటించిన పవన్ కల్యాణ్ స్వయంగా పడవపై ప్రయాణించి నల్లా ఛానల్, ఆంధ్ర పేపర్ మిల్స్ పరిశ్రమల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలు, నగర మురుగునీరు నేరుగా పవిత్రమైన గోదావరి నదిలో కలవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులు తాము మురుగు నీటిలో స్నానం చేస్తున్నామనే భావనతో వెళ్లకూడదు. ప్రతి ఒక్కరికీ పవిత్రమైన, స్వచ్ఛమైన గోదావరి జలాల్లో స్నానం చేస్తున్నామనే ఆధ్యాత్మిక అనుభూతి కలగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి నదిని కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ నదిలోకి కలిసే మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టడంతోపాటు, శాశ్వత పర్యావరణ రక్షణ చర్యలను పర్యవేక్షి ంచనుంది.

**కమిటీ స్వరూపం**

ఈ ప్రత్యేక కమిటీకి పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. పురపాలక పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ (సిడిఎంఎ), పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్, పరిశ్రమల శాఖ కమిషనర్, వ్యవసాయ శాఖ కమిషనర్, మత్స్య శాఖ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సిఇఒ, దేవాదాయ శాఖ కమిషనర్, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్ ఇన్ చీఫ్, క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్స్ మిషన్ డైరెక్టర్, గోదావరి పరివాహక ప్రాంత జిల్లాలైన తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. ఈ ప్రత్యేక కమిటీ ప్రతి15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా సమావేశం అవుతుంది. గోదావరితో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నదుల్లోకి కాలుష్యం ఎక్కడెక్కడ నుంచి చేరుతుందో >>2



## నేడు సిద్ధరామయ్య రాజీనామా!

### కర్ణాటకలో నాయకత్వ మార్పునకు సిద్ధం

### ఇక డికె శివకుమార్‌కు పగ్గాలు

**న్యూఢిల్లీ, మే 27:** దక్షిణాదిలో కీలకమైన కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలు ఫలించాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామాకు ఒప్పించారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ, కెసి వేణుగోపాల్, రణదీప్ సూర్జేవాలలతో జరిగిన సుదీర్ఘ తర్జనబర్జనల అనంతరం వేరొకరికి అవకాశం ఇవ్వాలని సూచించారు. అయితే తన వర్గంలోని వారికి డిప్యూటి సిఎంలు ఉండాలని సిద్ధరామయ్య పట్టుబట్టారు. రాజ్యసభ ఎంపి పదవితోపాటు రాజ్యసభా పక్షనేతగా కూడా అవకాశం ఉంటుందన్న సంకేతాలు ఇవ్వడంతో సిద్ధరామయ్య మెత్తబడినట్లు తెలుస్తోంది. గురువారం రాష్ట్రగవర్నర్‌ను కలిసి రాజీనామా >>2

## నాటు పడవ బోల్తా: నలుగురు గల్లంతు



ఘటన వివరాలను సేకరిస్తున్న పోలీసులు

**బిట్రగుంట (నెల్లూరు), మే 27, ప్రభాతవార్త :** బోగోలు మండలం తాటి చెట్ల పాలెం సముద్ర తీరాన బుధవారం వేకువ జామున తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మండలం లోని జువ్వలదిన్నె అలిచర్ల బంగారుపాలెం గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు నాటు పడవ సహాయంతో కూర కోసం సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లారు. అయితే ఒక్కసారిగా పెనుగాలులు వీచడంతో నాటు పడవ బోల్తా పడి నలుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వీరిలో తుపిలి బాలమురళి(55), కొమరి గోవిందు(44)లు మృతదేహాలు పాతపాలెం వద్ద లభ్యమయ్యాయి. మరో ఇద్దరి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు దీంతో ఒక్కసారిగా తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో విషాదం చోటుచేసుకుంది బంధువుల అర్తనాదాలు సముద్ర తీరాన ఘోషించాయి.. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న బిట్రగుంట ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాలను వెలికి తీసి శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగ్గు మాటి వెంకట్ కృష్ణారెడ్డి మహానాడు కార్యక్రమంలో ఉన్నప్పటికీ వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేసి మృతి చెందిన మత్స్య కారుడి కుటుంబానికి తక్షణ సహాయంగా ఐదు లక్షల రూపాయలు మంజూరు చేశారు. మిగిలిన వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# అంతరాయం లేని కరెంటు

### ప్రత్యేక సమన్వయ చర్యలు తీసుకొంటున్నాం: మంత్రి గొట్టిపాటి



**విజయవాడ,మే27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ అంతరాయాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక వేడి, అకాల గాలివానలతో ఫీడర్లు తెగిపోయి విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్న పరిస్థితిపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ బుధవారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధిక ఉష్ణోగ్రతలు, గాలివానల ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షి స్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అధిక వేడి, ఈదురు గాలులు, భారీ వర్షాల కారణంగా ట్రాన్స్‌మిషన్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ., విద్యుత్ అంతరాయాలపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందుకు గానూ.. మీడియా, బల్క్ మెసేజ్ వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. కాల్ సెంటర్లు విద్యుత్ శాఖకు, వినియోగదారులకు సమన్వయ వ్యవస్థగా పని చేయాలన్నారు. 24 గంటలు పనిచేసే 1912 కాల్ సెంటర్లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, క్షేత్రస్థాయి సిబ్బంది మధ్య 1912 కాల్ సెంటర్లు సమన్వయ వేదికలుగా పని చేయాలని ఆయన తెలిపారు.

రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ల పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సబ్ స్టేషన్లు, ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచుతూ అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. దీని వలన రాబోయే పదేళ్ల వరకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ట్రాన్స్ మిషన్ నష్టాలను తగ్గించవచ్చన్నారు. దీనితో పాటు దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పేర్కొన్నారు.



దాడుల్లో దెబ్బతిన్న ఇడి కారు



మాజీ సిఎం విజయన్

## కేరళం మాజీ సిఎం విజయన్ నివాసంలో ఇడి సోదాలు

### మనీ లాండరింగ్ కేసులో 12 చోట్ల తనిఖీలు జరిపిన అధికారులు

### అడ్డుకొన్న సిపిఎం కార్యకర్తలు, దాడుల్లో ఇడి కారు ధ్వంసం

**తిరువనంతపురం, మే 27:** మనీలాండరింగ్ కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం ఏకకాలంలో దాడులుచేసారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 కీలకప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరుగుతుండడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలంరేగింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు ఉదయాన్నే ఈ మెరుపు సోదాలు చేపడుతున్నారు. ప్రస్తుత ప్రతిపక్షనేతగా ఉన్న విజయన్‌కు చెందిన తిరువనంతపురం >>2

28-05pg2exHMNWJQE.qxd:28-05pg2exHMNWJQE.qxd 1/1/02 6:50 AM Page 1





బుధవారం మహానాడును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు



మహానాడులో తండ్రి చంద్రబాబుకు పాదాభివందనం చేస్తున్న మంత్రి లోకేష్



మహానాడులో మహిళానేతలతో సిఎం చంద్రబాబు

# పసుపు పండుగ

>> అభిమానం, ఆదరణ శాశ్వతమన్నారు. నిరంతరం ప్రజాస్వామ్యం కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. అరెస్టులు, వేధింపులు ఎన్ని జరిగినా ప్రజా పోరాటాలు ఆపలేదని, చంపేస్తామని బెదిరించినా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలిపెట్టిన వీరులున్న పార్టీ టీడీపీ అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి కార్యకర్తల బలిదానాలు పార్టీ ఎన్నటికీ మర్చిపోదన్నారు.

**మన బలం బలగం కేడర్. ఏదైనా పార్టీ ఫస్ట్ కేడరే ముందు**

దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ మనకు ఉందని చంద్రబాబు అన్నారు.మన బలం బలగం కేడర్. ఏదైనా పార్టీ ఫస్ట్ కేడరే ముందు అన్నారు.పార్టీ సామాన్య కార్యకర్తలు అద్భుతాలు చేస్తారన్నారు.వారికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు.మండల స్థాయి నేతలకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు.టీడీపీ కేడర్ క్రమశిక్షణతో కన్పిస్తుందని వివరించారు. విశాఖలో రైల్వే జోన్ కోసం 52 ఎకరాల భూమిని కూడా గత ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాకే విశాఖ రైల్వే జోన్ సాధించాం ,వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను తిరిగి నిలబెట్టాం అన్నారు. వైసీపీది ఓ బ్లఫ్ బ్యాచ్. ఫేక్ న్యూస్ బ్యాచ్ అన్నారు. వాళ్లు గుంతలు పెట్టి పోయిన రోడ్లను మరమ్మత్తులు చేయటంతో పాటు కొత్త రోడ్లను నిర్మిస్తున్నాం అన్నారు. గత పాలకులు రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేశారు. రూ.1.35 లక్షల కోట్ల మేర డిస్కమ్‌లను అప్పుల్లో ముంచారు.విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం...మళ్లీ చెప్తున్నాం. తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.గత పాలకులు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలి వెళ్తే దానిని తొలగించాం అన్నారురెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. రికార్డులు సరిచేయడానికి 3 ఏళ్లు పట్టింది అన్నారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. రికార్డులు ట్యాంపర్ చేయకుండా చర్యలు చేపట్టాం అన్నారు. నాలా యాక్టును కూడా రద్దు చేశాం. రాజముద్రతో ఇప్పుడు పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాం అన్నారు.పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో గ్యాస్, ఇంధన కొరత వచ్చింది. ఆక్వా ధరలు పడిపోయాయి అన్నారు.ఈ సంక్షోభాన్ని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం అన్నారు.మహానాడు ఓ పసుపు పండుగ, ప్రజలకు, కార్యకర్తలకు భరోసాఇచ్చే ఓవేదిక అన్నారు.గొడ్డలి పార్టీ డైవర్ట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎన్ని కుయుక్తులు పన్నినా టిడిపిని అడ్డుకోలేరు అన్నారు.పేదలకు కావాల్సింది సంక్షేమం...గొడ్డలివేట్లుకాదు. యువతకు కావాల్సింది ఉద్యోగాలు గొడ్డలి పోట్లు కాదు.అన్నారు. రక్తాభిషేకాలు చేసే వారు స్వర్ణాంధ్ర చరిత్రను లిఖించలేరు. అందుకే గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారటం వారి విధానం.ఐటీ నుంచి క్వాంటం దిశగా ఎదగటం మన విధానం బోత్ ఆర్ నాట్ సేమ్ అన్నారు.

**నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ**

నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ అంటూ ఇక్కడ చదువుకున్న, శిక్షణ పొందిన నాయకులే అన్ని చోట్లా రాణిస్తున్నారన్నారు.సోషల్ రీ ఇంజనీరింగ్ చేయటమే పార్టీ విధానం. అందరికీ అవకాశాలు కల్పించటమే పార్టీ లక్ష్యం. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశాం.ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ కోసం కూడా ఆదుకునేలా పార్టీ చర్యలు తీసుకుంటుంది. మై హెల్త్ యాప్ ద్వారా కార్యకర్తలు,వారి కుటుంబం ఆరోగ్యం కాపాడే బాధ్యత పార్టీ తీసుకుంటోంది. ఎథికల్ ఎకనామిక్ ఎంపవర్‌మెంట్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం .పార్టీ అధినేతగా నా పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తల ఎంపవర్ మెంట్ కోసం నిరంతరం పనిచేస్తాం. స్థానిక ఎన్నికల కోసం సిద్ధం కావాలని అందరికీ పిలుపుఇస్తున్నా. ఏ ఎన్నికలైనా మనకు గెలుపే ప్రధానం.గెలుపే ధ్యేయంగా నేతలు, కార్యకర్తలు పనిచేయాలి, ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ముందుకు సాగాలి. మనం చేసిన పని ప్రజలకు తెలియచేస్తూ వారిని ఆకట్టుకోవాలి. ఓటు నమోదు చేయించే కార్యక్రమంలో పాల్గొనాలి. స్పెషల్ రివిజన్‌లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో లీడర్లు, కేడర్ జాగ్రత్తగా ఉండాలి.మిత్ర పక్షాలతో సఖ్యతతో సమన్వయంతో ముందుకు వెళ్దాం అన్నారు.2024 ఎన్నికల్లో సాధించిన విజయం మళ్లీ రిపీట్ అయ్యేలా అందరం మమేకం అవుదాం అన్నాంఎవరూ ఇగోలకు వెళ్లొద్దని హితవు పలుకుతున్నాను. ప్రతీ నేతా జనంతో కార్యకర్తలతో మమేకం కావాలి. హెల్తీ వెల్తీ, హ్యాపీ ఏపీ మన లక్ష్యం. మహానాడు సాక్షిగా తెలుగు జాతి కోసం పునరంకితం అవుదామని అందరికీ పిలుపునిస్తున్నానువచ్చిన అవకాశాలను నిలబెట్టుకోవాలని అందరికీ తెలియచేస్తున్నానని అన్నారు.

పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ మినరల్స్ , 5వ తరం ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజక్టు కూడా రాష్ట్రానికి వస్తోంది.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాంజ.కేవలం 36 రోజుల్లోనే ఫైటర్ జెట్ యుద్ధ విమాన తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం.ఆ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోనే తిరుపతిలో బుల్లెట్ మోటారు సైకిల్ ప్రాజెక్టు వచ్చింది.282 ప్రాజెక్టులను ప్రారంభించుకునే తేదీని కూడా ముందే ఫిక్స్ చేశాం.ఇది ఇన్ స్పైరింగ్ టైమ్స్ అని జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ వర్గానికి పిలుపునిస్తున్నాను. యువతకు ఉద్యోగాలు ఉపాధి లాంటి అంశాల్లో వారి కంటే ముందే ఆలోచన చేసి అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం.తెలుగుదేశం పార్టీ టెక్నాలజీని వినియోగించి ఇప్పుడు వర్చువల్ గా మహానాడు సమావేశాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు.

## స్త్రీలకు ఆత్మస్థైర్యం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం

### మహానాడులో టిడిపి మహిళా నేతలు

**విజయవాడ,మే27,ప్రభాతవార్తప్రతినిధి:**మహిళలను గౌరవించడం,అన్నింట అవకాశం కల్పించడం ద్వారా స్త్రీలకు ఆత్మస్థైర్యం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని మహిళ నేతలు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో మహిళా సాధికారతపై మహిళ నేతలు మాట్లాడుతూ మహిళ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి, కుటుంబానికి ధైర్యం, సమాజానికి స్ఫూర్తి అని నమ్మింది మన తెలుగుదేశం పార్టీనేనని గుర్తు చేశారు.మహిళ బలపడితే కుటుంబం బలపడుతుంది: భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహిళా సాధికారతకు నారీ శక్తి వందన్ అధినియం (చట్టసభల్లో 33 మహిళా రిజర్వేషన్) ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మహిళ నేతలు అభిప్రాయపడ్డారు. ఇది కేవలం సంఖ్యాపరమైన మార్పు కోసం తెచ్చింది కాదు, దేశ విధానాల్లో మహిళల స్వరం బలంగా వినిపించేందుకు రాజకీయ నిర్ణయాల్లో వారికి సమాన భాగస్వామ్యం కల్పించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణ అని గుర్తు చేశారు. స్త్రీశక్తి థీమ్‌తో ఈ మహానాడు కార్యక్రమం మహిళల ఆత్మగౌరవం, సాధికారత, భద్రత కోసం తెలుగుదేశం పార్టీ తీసుకుంటున్న సంకల్పానికి ప్రతీకగా నిలవనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ మహానాడు కార్యకర్తల ఉత్సాహంతో, తెలుగుదేశం కుటుంబం శక్తితో విజయవంతం కానుంది. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా సమాజానికి శక్తిగా గుర్తించిన ఏకైక పార్టీ తెలుగు దేశమని టిడిపి మహిళా నేతలందరూ అభిప్రాయపడ్డారు. మహిళల ఉన్నత విద్య కోసం అన్న ఎన్టీఆర్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, ఆడబిడ్డలకు చదువు ఒక అవకాశం మాత్రమే కాదు, హక్కు అని చాటి చెప్పారని వెల్లడించారు. 1986లో ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి, అమ్మాయి అంటే భారం కాదు కుటుంబ వారసత్వం అని నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు. స్త్రీ అంటే కేవలం కుటుంబ బాధ్యతలు మోసే వ్యక్తి కాదు. కుటుంబానికి ధైర్యం, సమాజాన్ని ముందుకు నడిపించే శక్తి. మహిళా సాధికారతకు నిజమైన అర్థం చెప్పిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసి మహిళల ఉన్నత విద్యకు బాటలు వేసిన ఘనత ఎన్టీఆర్‌దని మహిళా నేతలందరూ చాటిచెప్పారు. కార్యకర్తే అధినేత అనే తీర్మానాన్ని మంత్రి సవిత మహానాడులో ప్రవేశపెట్టారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగం అన్నారు.టెక్నాలజీని ఉపయోగించి మన పార్టీలో నాయకత్వాన్ని మరింత పటిష్టంగా నిర్మించిన ఘనత మన యువ నాయకులు నారా లోకేష్‌దని వెల్లడించారు. మహిళా సాధికారత కోసం మహిళలను అన్ని విధాలా లోకేష్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ను 2029 ఎన్నికల్లో ఇవ్వనున్నట్లు ప్రకటించిన యువనేతకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు చెప్పారు. కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశం పార్టీ నినాదమని వ్యాఖ్యానించారు. కార్యకర్తలకు ప్రమాద బీమా, కష్టాల్లో ఉన్న కార్యకర్తల పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న ఘనత మన తెలుగుదేశం పార్టీ సొంతమన్నారు.

## 'ఇది మహిళా మహానాడు'

>> నాడును ఆడబిడ్డలకు అంకితం చేసేలా మహిళా మహానాడుగా ప్రకటిస్తున్నాం అన్నారు.ఏ పాలసీ చేసినా అది యువత కోసమే చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పాలసీతో యువతకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుత మన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాష్ట్రమంతటా పర్యటించి యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందించి సహకారం అందిస్తాం.ఇప్పటి వరకూ చేసిన పాలసీలతో అవకాశాలు వచ్చి జీవన ప్రమాణాలు పెరిగాయి. ఎఐ, క్వాంటం, స్పేస్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ ఇలా ఏ అంశమైనా ఎపి దానికి చిరునామాగా ఉంటుంది.23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.అన్నారు. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వస్తాయి. 282 ప్రాజెక్టుల ద్వారా 11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి ద్వారా ఆమోదం తెలిపామన్నారు.

## సీట్లు కేటాయిస్తాం

>> లోకేష్ స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు నేను సిద్ధం, మీరు సిద్ధమా? అని వైఎస్సార్సీ నేతలకు సవాల్ విసిరారు. తెలుగువారి ఆత్మగౌరవం, పౌరుషం మన ఎన్టీఆర్, స్త్రీశక్తిని ముందుగా గుర్తించింది ఆయనేనని లోకేష్ తెలిపారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మూడక్షరాల పేరే అదే సిబిఎన్, చంద్రబాబు లోపల 25 ఏళ్ల కుర్రాళ్లు ముగ్గురు ఉన్నారు. ఆయన స్పీడ్‌ను మేము అందుకోలేకపోతున్నాం. గతంలో కియా తీసుకొచ్చారు ఇప్పుడు ఫైటర్ జెట్స్ తీసుకొచ్చారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడమే లక్ష్యంగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు అని మంత్రి లోకేష్ వివరించారు. భవిష్యత్తును ముందుగానే చూసే విజనరీ మన లీడర్ సిబిఎన్. స్త్రీశక్తిని మహా శక్తిగా మార్చింది, మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, డ్వాక్రా ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్రం ఇచ్చింది, తన తల్లి పడిన కష్టం మరే తల్లి పడకూడదని దీపం పథకం ప్రవేశపెట్టింది, మహిళలను బస్ కండక్టర్స్ చేసింది మన సిబిఎన్. దేశంలోనే మొదటి మహిళా స్పీకర్‌గా ప్రతిభా భారతిని నియమించింది మన సిబిఎన్. ఎవరైనా మహిళల జోలికి వస్తే అదే వారికి లాస్ట్ డేట్ అని చెప్పిన దమ్మున్న నాయకుడు మన సిబిఎన్ అని లోకేశ్ ఉద్ఘాటించారు.

"నిజం గడప దాటే లోగాని అబద్ధం ప్రపంచం చుట్టి వస్తుంది. బాబాయిని చంపి కత్తి బాబుగారి చేతిలో పెట్టారు. వైసీపీ ఫేక్ ప్రాపగాండాను గట్టిగా తిప్పికొట్టాలి. ఇప్పుడు రోజుకో కుట్రతో వస్తున్నారు. సైకో... నీది టెన్త్ క్లాస్ పేపర్ కొట్టేసిన హిస్టరీ ... నాది స్టాన్‌ఫోర్డ్ హిస్టరీ. టీచర్లను లిక్కర్ షాప్ ముందు నిలబెట్టిన హిస్టరీ నీది... టీచర్లను ట్రైనింగ్ కోసం సింగపూర్ పంపిన హిస్టరీ నాది. 5 సంవత్సరాల్లో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని హిస్టరీ నీది ... 16,347 టీచర్ పోస్టులు ఒక్కసారిగా భర్తీ చేసిన హిస్టరీ నాది. జాబ్ క్యాలెండర్ అని సాక్షి క్యాలెండర్ చేతిలో పెట్టిన హిస్టరీ నీది ... 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన హిస్టరీ నాది" అని జగన్ ను ఉద్దేశించి లోకేశ్ ఎద్దేవా చేశారు.ఇక నుంచి మనం గేర్ మార్చాలని, మిషన్ మోడ్‌లో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి ఎన్నికలోనూ మనమే గెలవాలి, అదే మన గోల్ అని చెప్పారు. "ప్రజల్లోకి వెళదాం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయి. అహంకారం వద్దు. అహంకారం చూపిన వారికి 151 కాస్తా 11 అవడం చూశాం. ప్రజలకు సేవ చేయడం మన ధ్యేయం. మనం అనుకున్నది సాధించాం" అని లోకేష్ పేర్కొన్నారు. సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు ముఖ్యం. ఒకే ప్రభుత్వం ఉండటం వల్లే గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయి. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మన బలం. మనకు నమో ఉన్నారు. నమో అంటే నాయుడుమోడీ. వీరిద్దరితో కలిసి పవనన్న కాంబోతో పోలవరం, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు, అమరావతి, కర్నూల్ హైకోర్టు బెంచ్ సాధించామన్నారు.మహానాడులో ప్రసంగించడానికి ముందు టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, తన తండ్రి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు పాదాభివందనం చేసి,ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

## టాస్క్‌ఫోర్స్

>> క్షేత్రస్థాయిలో గుర్తిస్తుంది. గుర్తించిన సమస్యలకు కాలుష్య నియంత్రణ మండలి సూచనల ప్రకారం నివారణ చర్యలను తీసుకుంటూ పనుల ప్రగతిని పర్యవేక్షిస్తుంది. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు స్వచ్ఛమైన నదీ జలాలను అందించడమే లక్ష్యంగా ఈ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుంది.

### వారం - వర్జ్యం

28-05-2026, అధికజ్యేష్ఠ గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
ద్వాదశి ఉ.7.58
చిత్త ఉ.8.09
వర్జ్యం : మ.2.20-సా.4.06
దు.ఉ.9.55-ఉ.10.47,2)మ.3.07-మ.3.59
శుభసమయం : ఉ.8.00-8.30
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** అధికారులతో, సహోద్యోగులతో ఇష్టం లేకపోయినా స్నేహభావముతో మెలగుతారు. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృషభం:** భూమి, వాహన, యంత్ర, గృహ సంబంధమైన కొనుగోలు ఒప్పందములు సానుకూలపడతాయి. బంధువుల కలయిక.

**మిథునం:** అధికారికముగా, సంపూర్ణముగా ప్రారంభించి, విజయపథములో నడిపించు యత్నములు కొద్దిగా వేచి ఉండాలి.

**కర్కాటకం:** సహోద్యోగులు, ఇతర సిబ్బందికి మీ మనస్తత్వము అర్థము గాక ప్రస్తుతము మిమ్ములను అంటిపెట్టుకునే ఉంటాయి.

**సింహం:** ఓ చోట వడ్డీ రాని స్థితిలో వేరొక చోట వడ్డీలను చెల్లిస్తూ ధనమును తెచ్చుకొని అసంతృప్తికి గురిఅవుతారు.

**కన్య :**మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండటం మంచిది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**తుల:** ఉన్నతాధికారుల నుండి అవసరమైన సహాయం అందకపోవచ్చును. ఆత్మీయులతో పుణ్యక్షేత్ర సందర్శనము చేసుకుంటారు.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులకు కావలసిన వాహన సౌకర్యము లభించక ఇబ్బందిని పడవలసి వస్తుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** విద్యా సంబంధిత విషయము లకును, ఉద్యోగ దరఖాస్తులను చేయు ప్రయత్నములకు మంచి ఫలితములు వస్తాయి.

**మకరం:** అంతము లేని ఆలోచనలతో మీ మనస్సు ఆందోళనలకు గురికావచ్చును. ధైర్యముగా ముందుకు వెళ్ళండి.

**కుంభం:** దూరప్రాంతముల నుండి వచ్చే వార్తల వలన మీ కార్యక్రమములు సానుకూలపడతాయి. వస్త్రలాభం కలదు.

**మీనం:** దైవానుగ్రహము లభించుట వలన మీరు ఏ కార్యక్రమములను చేపట్టినా ఎట్టి ఆటంకాలు లేకుండా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## నేడు సిద్ధరామయ్య రాజీనామా!

>> చేస్తారని ఆయన వర్గీయులే చెపుతున్నారు. అలాగే తన కేబినెట్ మంత్రులతో చివరిసారిగా ఉదయం జరిగే బ్రేక్‌ఫాస్ట్ ఈవెంట్‌లో కూడా పాల్గొంటారని తెలుస్తోంది. ఇక సిఎం పదవికి చూస్తే డిప్యూటి సిఎం డికె శివకుమార్‌తోపాటు కాంగ్రెస్ సీనియర్‌నేత దళిత ఎమ్మెల్యే జి పరమేశ్వర కూడా ఆశిస్తున్నారు. హైకమాండ్ సమీకరణాలను బట్టిచూస్తే 90శాతం శివకుమార్‌నే వరిస్తుందని ఇప్పటికే ఖరారయిందని తెలుస్తోంది. మే 30వ తేదీ శనివారం నాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉప ముఖ్య మంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఒబిసి వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామాపత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివ కుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమంచేస్తారు. గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్తారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగే బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది.

శివకుమార్ సీఎంకావడంతోపాటు అదే సమయంలో మంత్రివర్గంలో కూడా భారీ మార్పులు, చేర్పులు జరగబోతున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం తన నిర్ణయాలనుకూడా రాష్ట్రనేతలకు తెలియజేసింది. గురువారం, మే 28న సిద్ధరామయ్య రాజీనామా చేస్తారు. మే 30న డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. సీఎంగా డీకేతోపాటు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. ఇదే సమయంలో ముగ్గురిని డిప్యూటీ సిఎంలుగా తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించిందని రాష్ట్రనేతలకు సంకేతాలందాయి. ఒక ఎస్సీ అభ్యర్థి, ఒక ఓబీసీ అభ్యర్థి, ఒక మహిళకు డిప్యూటీ సీఎం పదవులు ఇస్తారు. ఒక మైనారిటీకి కూడా డీసీఎంగా అవకాశం కల్పించే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పదవుల విషయంలో ప్రస్తుతం కొందరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. జి.పరమేశ్వర లేదా ప్రియాంక్ ఖర్గే (ఎస్సీ), యతీంద్ర సిద్ధరామయ్య (ఓబీసీ), ఎంబీ పాటిల్ లేదా ఈశ్వర్ ఖండ్రే (లింగాయత్), కేజీ జార్జ్ లేదా యూటీ ఖాదర్ లేదా జమీర్ అహ్మద్ ఖాన్ (మైనారిటీ) పేర్లను అధిష్టానం పరిశీలిస్తోంది. సిద్ధరామయ్య తనయుడికి డీసీఎం పదవి లేదా మంత్రివర్గంలో చోటు కల్పిస్తామన్న హైకమాండ్ హామీతో సిద్ధరామయ్య తనపట్టును సడలించినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఇప్పటికే సిద్ధరామయ్య గురువారం గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. ఆయనను కలిసి తన రాజీనామా సమర్పిస్తారు. శనివారం కర్ణాటకలో డీకే ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అయితేనాయకత్వ మార్పిడిపైనా, సీఎం అభ్యర్థిఎవరన్న అంశంపైనా కాంగ్రెస్ హైకమాండ్‌మాత్రం అధికారిక ప్రకటన ఏదీ విడుదలచేయలేదు.

## విజయన్ నివాసంలో ఇడి సోదాలు

>> లోని అద్దె ఇల్లు, కన్నూరులోని సొంత నివాసంలో సోదాలు జరుగుతున్నాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఇవే కాకుండా సిఎంఆర్ఎల్ ఎండీ శశిధరన్ ఇల్లు, మాజీ మంత్రి మహమ్మద్ రియాజ్ నివాసాల్లోనూ విచారణ సాగుతోంది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అనే ప్రైవేట్ సంస్థ నుంచి విజయన్ కుమార్తె వీణా విజయన్ అక్రమంగా డబ్బులు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమెకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ఐటీ సంస్థ ఎలాంటి సేవలు అందించకపోయినా రూ.1.72 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఈ నిధుల బదిలీపైనే ఇప్పుడు ఇడి లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణను నిలిపివేయాలని కోరుతూ సిఎంఆర్ఎల్ యాజమాన్యం కేరళ హైకోర్టును ఆశ్రయించింది. అయితే హైకోర్టు సింగిల్ బెంచ్ ఆ పిటిషన్లను తోసిపుచ్చింది. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమయం కావాలన్న కంపెనీ విజ్ఞప్తినీ న్యాయస్థానం తిరస్కరించడంతో ఇడి అధికారులు రంగంలోకి దిగారు.

**విజయన్ ఇంటివద్ద ఇడిపై సిపిఎం కేడర్ ప్రతిఘటన..!**

తిరువనంతపురంలో ఉన్న విజయన్ అద్దె ఇంటి ముందు ఇవాళ భారీ ఎత్తున సిపిఎం కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. బేకరీ జంక్షన్ వద్ద ఉన్న ఆ ఇంటిముందు ..ఇడి వాహనాన్ని సిపిఎం కార్యకర్తలు ధ్వంసంచేశారు. హెల్మెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, రాళ్లతో అటాక్‌చేశారు. అక్కడ మోహరించిన సిబ్బందిపై దాడి చేశారు. ఇడి సోదాలు కొనసాగిస్తున్న సమయంలో ఈ తతంగం జరిగింది. తనిఖీలు జరుగుతున్న సమయంలో ఉదయం నుంచి విజయన్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు విజయన్ ఇంటికి దూసుకొచ్చారు. ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంటి ఆవరణలో రక్షణగా ఉన్న బలగాలపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. సీనియర్ సిపిఎం నేతలు వారిని అదుపులోకి తెచ్చారు.



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన తమిళనాడు సిఎం విజయ్

## ప్రధాని మోడీని కలిసిన సిఎం విజయ్

**న్యూఢిల్లీ,మే 27:** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసుకున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. చోళుల కాలం నాటి రాగి శాసనాలకు పోలెండ్ నుంచి భారతదేశానికి రప్పించినందుకు మోడీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక ప్రకటించిన మేకేదాతు డ్యామ్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలపై దాని ప్రభావాన్ని విజయ్ ప్రధాని దృష్టికి వెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందుగా రాష్ట్ర గీతం పాడేందుకు అనుమతించాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం విజయ్ నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సిఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం.

## 'సర్' చట్టబద్ధమే

>> జాబితా నుంచి ఒక వ్యక్తి పేరును తొలగించినంత మాత్రాన అతని పౌరసత్వం రద్దయినట్లు కాదని స్పష్టంచేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీచేసింది. ఓటరు జాబితా సవరణ కేవలం ఎన్నికల్లో పాల్గొనేందుకు మాత్రమే పరిమితమని పేర్కొన్నది. సాధారణ సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందన్న కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది.విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం1950 ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించేందుకు ఇసికి అధికారాలు ఉన్నాయని పేర్కొంది. ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ప్రస్తుత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. అంతేకాకుండా ఆర్టికల్ 324 కింద రాజ్యాంగ ఆదేశానికి జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలను అతిక్రమించి వ్యవహరించిందని చెప్పలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేకానీ ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఇసికి లేదని తెలిపింది. పౌరసత్వంపై అనుమానంతో ఓటరు జాబితాలో పేరు చేర్చాలా వద్దా అని నిర్ణయించే అధికారం మాత్రమే ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టంచేసింది. ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి పేర్లను మాత్రం కేంద్ర హోంశాఖకు పంపాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ వివరాలను నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తెరపడింది. కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలను అందుకున్న తర్వాత పౌరసత్వ చట్టం 1955 ప్రకారం ఆయా వ్యక్తుల పౌరసత్వ క్లెయిములపై విచారణ జరపాలని కోర్టు సూచించింది. తదుపరి అసెంబ్లీ లేదా స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ఈ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఒకవేళ విచారణలో వారు భారత పౌరులని తేలితే వెంటనే వారి పేర్లను మళ్లీ ఓటరు జాబితాలో పునరుద్ధరించాలని మార్గదర్శకాలు జారీ చేసింది.



# మహిళాశక్తి మహానాడు విజయవంతం

**• తిరుపతిలో మహానాడులో పుష్పావతియాదవ్**

**తిరుపతి, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయంగానేగాక అన్ని రంగాల్లోనూ తెలుగు దేశం పార్టీ మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుచేయడంపై మహిళాశక్తి మహానాడు విజయవంతమైనట్లేనని రాష్ట్ర కార్యదర్శి వి.పుష్పావతి యాదవ్ అన్నారు. మహానాడు వర్చువల్‌లో భాగంగా తిరుపతిలోని 11వ క్లస్టర్‌లో ఇన్‌ఛార్జి పుష్పావతి యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త నిరంతరం శ్రమించాలని ఆమె పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ పేదల పక్షానే నిలబడుతుందని స్పష్టం చేశారు. పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని గడపగడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందన్నారు. ముఖ్యంగా నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, నారా లోకేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గంతో పార్టీ మరింత ముందుకు వెళ్లాలని, భవిష్యత్తులో నూతన విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి పుష్పవతి యాదవ్, పనబాకలక్ష్మి, సుగుణమ్మ, పర్యవేక్షకురాలు పర్వీన్ తాజ్, సంతోష్ కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ సందీప్, విశ్వనాథం, ధర్మా రెడ్డి, మురుగ, రాధిక, బాలాజీ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి మహానాడును వీక్షించారు.

# పార్టీ సంస్థాగత నిర్మాణం అవసరం

**• పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్**

**సచివాలయం, మే 27 ప్రభాతవార్త:** తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. అయితే ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ఐటి, ఉన్నత విద్యారంగాల అభివృద్ధి ద్వారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన నాయకుడు చంద్రబాబు నాయుడు మాత్రమే అని షరీఫ్ తెలిపారు. బుధవారం మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో పై విధంగా తెలిపారు. "సమాజమే దేవాలయం- ప్రజలే దేవుళ్ళు అనే సిద్ధాంతంతో ప్రజల మధ్య పనిచేస్తున్న నాయకుడు నారా లోకేష్. కార్యకర్తలే పార్టీకి అధినేత అనే భావనను ఆచరణలో చూపిస్తూ, ప్రతి కార్యకర్తకు గౌరవం ఇచ్చే పార్టీ తెలుగుదేశం పార్టీ. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించే ప్రజాస్వామ్య వ్యవస్థ టిడిపిలోనే ఉంది. 1985లోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కంప్యూటరీకరణ చేసి సాంకేతికతను రాజకీయ వ్యవస్థలో ప్రవేశపెట్టిన దూరదృష్టి నాయకులు చంద్రబాబు నాయుడు. దేశంలోని ఏ ఇతర ప్రాంతీయ పార్టీకి లేనంత భారీ సభ్యత్వ బలం తెలుగుదేశం పార్టీకి ఉంది. విద్యావంతులు,నిపుణులు, సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారికి రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించిన పార్టీ మన తెలుగుదేశం పార్టీ. నాడు ఎన్టీఆర్ వేసిన బలమైన పునాదులపై, నేడు చంద్రబాబు నాయుడు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత ఆధునికంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్నారు. పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయాన్ని పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీ, రాష్ట్ర కమిటీలో అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించిన నాయకుడు చంద్రబాబు నాయుడు" అని షరీఫ్ కొనియాడారు.



టిడిపి మహానాడు సందర్భంగా మహిళా నేతలతో మంత్రి లోకేష్

# గొడ్డలి పార్టీకి టిడిపి ఎదురొడ్డి నిలిచింది

**• టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి**

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో టిడిపి అజేయమైన శక్తిగా నిలిచిందని ఆ పార్టీ ాతీయ ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి స్పష్టం చేసారు. మహానాడులో ఆమె కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఆమె మాట్లాడుతూ కూటమిగా ఎన్నికలకు వెళ్లి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం అన్నారు. అణిచివేసే ప్రయత్నం చేస్తే తెలుగుదేశం పార్టీలో యోధులు పుట్టుకొస్తారని గొడ్డలి పార్టీకి అర్థమై ఉంటుందన్నారు. ఎపిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాడదామన్నారు. అండమాన్‌లో టిడిపి జెండా రెపరెపలాడుతోంద న్నారు. జాతీయ భావాలతో తెలుగుదేశం పార్టీ వ్యవహరించిందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం2.0 పథకాలు సక్సెస్ అయ్యాయన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమానికి కూటమి కృషి చేస్తోందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి లోనూ కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఉద్యోగాల కల్పనకు నారా లోకేష్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నా మన్నారు. భారీ ఎత్తున పెట్టుబడులు వస్తున్నా యన్నారు. గొడ్డలి పార్టీకి లోకేష్ తన పాద యాత్రలో ట్రైలర్ చూపించారు... ఆ తర్వాత ఎన్నికల్లో ప్రజలు సినిమా చూపించారన్నారు. ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తిప్పికొట్టాలన్నారు. రాజకీయ ప్రత్యర్థి జిత్తుల మారి నక్క.. కార్యకర్తల డేగ కన్నుతో నిఘా పెట్టాలి, నిత్యం అప్రమత్తంగా ఉండాలని బైరెడ్డి శబరి సూచించారు.



మహానాడు వేదికపై టిడిపి అధినేత చంద్రబాబుతో మంత్రులు లోకేష్, నిమ్మల, అచ్చెన్నాయుడు, కాల్వ

# తెలుగు తమ్ముళ్లలో నూతన జోష్

**• జై టిడిపి నినాదాలతో హోరెత్తిన సింహపురి**

**నెల్లూరు, మే 27, ప్రభాతవార్త-వైద్యం:** చరిత్రలో నిలిచిపోయేలా నెల్లూరులో మహానాడు నిర్వహించాలని భావించామని, పశ్చిమాసిలో యుద్ధం వల్ల ఇంధన పొదుపులో భాగంగా ప్రధాని మోడీ పిలుపుతో టీడీపీ అధినేత చంద్రబాబు నెల్లూరులో నిర్వహించాల్సిన మహానాడును రద్దు చేశారని మంత్రి నారాయణ పేర్కొన్నారు. వర్చువల్ మహానాడు నిర్వహించాలని అసాధారణ నిర్ణయం తీసుకున్నాం న్నారు. రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 1875 క్లస్టర్లలో నిర్వహించిన హైబ్రిడ్ మహానాడుకు విశేష స్పందన వచ్చిందన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశంతో నెల్లూరులోని 14 క్లస్టర్లలో వర్చువల్ మహానాడును పండుగలా నిర్వహించారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అబ్జర్వర్ గురవా రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి,



ముఖ్య అతిధులుగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మహానాడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహానాడులో చర్చించాల్సిన అంశాలపై క్లస్టర్ పరిధిలోని నేతలు, కార్యకర్తలకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేశారు. పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపారు.



# 'ఆత్మకూరు' పసుపు మయం

**• మంత్రి "ఆనం" సారధ్యంలో కదంతొక్కిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

**ఆత్మకూరు (నెల్లూరు), మే 27 ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజక వర్గంలో అన్ని క్లస్టర్ శ్రేణులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మహానాడు వేడుకలు బుధవారం ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఘనంగా ప్రారంభించారు. మొదటగా ఆనం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి మహానాడు వేదికకు చేరుకొని పార్టీ శ్రేణులతో కలసి తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టిఆర్ విగ్రహానికి నెల్లూరు ఎంపి వేమిరెడ్డి, ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ 45సంవత్సరాల క్రితం సినీ రంగంలో మకుటంలేని మహారాజుగా చెలామణి అవుతున్న నందమూరి తారక రామారావు మన రాష్ట్రంలో ఉన్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా తెలుగుదేశంపార్టీని స్థాపించి అశేష ప్రజాధరణతో 9నెలలకే అధికారం చేపట్టారన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకోసం చంద్రబాబు బాధ్యతలు చేపట్టారన్నారు. ఆయన పార్టీని సమర్ధవంతంగా నిర్వహిస్తూనే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేడు విభజన ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ప్రజలకు సమర్థ పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కొనసాగిస్తున్నారన్నారు. తెలుగుదేశం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌బాబు పార్టీ పటిష్టతకు, కార్యకర్తల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకు మహానాడు మంచి వేదిక అని పేర్కొన్నారు. రాష్ట్ర సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం చేస్తున్న కృషిని, తెలుగుదేశంలో ఎన్టిఆర్ ఏర్పాటు చేసినఅంశాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం కైవల్యారెడ్డి, తాళ్ళూరి గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి, ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, కంచర్ల మాధవి, కటారి రమణయ్య, తుమ్మల చంద్రారెడ్డి, తోడేటి వెంకటయ్య, కేతా విజయభాస్కర్‌రెడ్డి, సుంకర పెంచలచౌదరి, కేతా వేణుగోపాల్‌రెడ్డి, పులిమి శైలజారెడ్డి, దావా పెంచలరావు, రెండు క్లస్టర్లలోని మండల, పట్టణ, గ్రామ, క్లస్టర్, యూనిట్ స్థాయి టిడిపి ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## నిండిన కంపార్టుమెంట్లు... కొండంతా జనం

**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు ముగుస్తుండటంతో తమ మొక్కులు తీర్చుకునేందుకు పిల్లలతో కలిసి పెద్ద ఎత్తున తిరుమలకు భక్తులు చేరుకుంటున్నారు. వేసవి సెలవులతో సాధారణ రోజుల్లోనూ తిరుమలకొండ భక్తులతో కిటకిటలాడుతోంది. బుధవారం ఉదయానికి తిరుమలలో భక్తుల రద్దీ మునుపెన్నడూ లేనివిధంగా కొనసాగుతోంది. శ్రీవారి దర్శనార్థందేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఏడుకొండలు జనసందోహంగా మారాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ కాంప్లెక్స్ వెలుపల కిలోమీటర్ల మేర క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఎలాంటి దర్శనం టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం (శీఘ్రదర్శనం కానిది) లభించడానికి సుమారు 24 గంటల సమయం పడుతోంది. ఓవైపు ఎండలు, మరోవైపు చిరుజల్లులు కురుస్తుండటంతో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా టిటిడి అధికారులు సేవలందిస్తున్నారు. చూసుకుంటున్నారు. అధికారులు నిరంతరాయంగా మంచి నీరు, పాలు, మజ్జిగ, అన్నప్రసాదాల పంపిణీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి వరకు స్వామివారిని 89,403 మంది భక్తులు దర్శించుకోగా, హుండీ కానుకల ద్వారా 4 కోట్ల రూపాయలు ఆదాయం లభించింది. భక్తుల రద్దీ రానున్న శుక్ర, శని, ఆదివారాల్లో మరింత పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు మరిన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

# గరుడునిపై గోవిందరాజులు

**• ఉదయం మోహినీ రూపంలో మురిపం**

**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి స్వామివారు ఎంతో ఇష్టమైన ప్రియభక్తుడు గరుడ్మంతునిపై విహరించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత స్వామి వారిని గరుడవాహనంపై వేంచేపుచేశారు. అక్కడ ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి కర్పూరహారతులిచ్చి గరుడ వాహనాన్ని మాఢవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా గోవిందనామస్మరణలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం గోవిందరాజ స్వామి పల్లకిపై మోహినీ అవతారంలో విహ రించి భక్తులను కటాక్షి ంచారు. చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకీ ఉత్సవం భక్తి పారవశ్యంతో సాగింది. గోవింద నామస్మరణలతో మారుమోగిన మాడవీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడి డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఎఇఒ ఏబీ నారాయణ చౌదరి, ఏవిఎస్ఒ ఆర్. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి ముందుకు వస్తున్నారు ఇందులో భాగంగా బుధవారం ఉదయం మైసూరుకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు రూ.1.10 కోట్లు విలువైన ఐదు బంగారు పతకాలను విరాళంగా అందించారు. అలాగే తమిళనాడు చెన్నైకు చెందిన గోపాలకృష్ణ, పురుషోత్తం దాతలు వేంకటేశ్వర స్వామికి సుమారు నాలుగున్నర కేజీల బరువు గల వెండి నక్షత్ర హారతులను విరాళంగా అందించారు. ఆలయంలోపల రంగ నాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు నక్షత్ర హారతులు అందజేశారు.

# గోవిందరాజస్వామికి శ్రీవారి అమూల్య నగల కానుక



**• రూ.71 లక్షల దివ్యాభరణాలు అందజేత**

**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి జరిగిన గరుడసేవ మహోత్సవం అపూర్వ ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. ఈ గరుడసేవకు తిరుమల వేంకటేశ్వరస్వామి తరఫున తన అన్నగారైన గోవిందరాజస్వామికి సుమారు 71 లక్షల రూపాయలు విలువైన నాలుగు దివ్య ఆభరణాలను టిటిడి భక్తి పూర్వకంగా సమర్పించింది. ఈ దివ్య కానుకల్లో సాధారణ రాళ్ల కలిగిన బంగారు గుండు పతకం, ఒక జత సాధారణ రాళ్ల గల బంగారు పతకాలు, బంగారు కాసుల మాల ఉన్నాయి. ఈ అమూల్య ఆభరణాలతో అలంకరింపబడిన గోవిందరాజస్వామి గరుడ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. తిరుపతిలోని గోవిందరాజుని ఆలయానికి ఎదురు ఆంజనేయస్వామి ఆలయం నుండి శ్రీవారి ఆభరణాలను తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేదఘోషలు, గోవింద నామస్మరణల మధ్య వేడుకగా ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చారు. అంతకుముందు తిరుమల నుండి అలిపిరి, కోమలమ్మ సత్రం మీదుగా బంగారు నగలు ఊరేగింపుగా ఎదురు ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం గోవిందరాజస్వామి ఆలయానికి తీసుకువచ్చి ఆలయ అధికారులకు అప్పగించారు. ఇదే సందర్భంగా స్వామివారికి నూతన ఆభరణాలు అలంకరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఎఇఒ ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్ పాల్గొన్నారు.


VMRDA విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ
పత్రికా ప్రకటన
ఆన్లైన్ నెం.11021/73/2026 (3255081),26-05-2026
ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునదేమనగా ది ల్యాండ్ డెవలపర్స్ మిస్సెర్స్ మ్యాప్ ఎవెన్యూస్ ఎల్.ఎల్.పి. ప్రాతినిధ్యం వహించినటి నిర్దేశిత భాగస్వాములు 1) అదబాల మనోహన్, 2) అదబాల పవన్ అవదేశ్ మరియు ది ల్యాండ్ ఓనర్స్ 1) బి.సత్యనారాయణ, 2) బి.గోపాలకృష్ణ, 3) బి.నాగరత్నం, 4) బి.వెంకట రామలక్ష్మి, 5) పి.సత్యనారాయణ, 6) పి.ముత్యం, 7) పి.నాగేశ్వరరావు, 8) పి.అప్పారావు గండిగుండం గ్రామం, ఆనందపురం మండలం, విశాఖపట్నం జిల్లా నందలి సర్వే సంఖ్యలు 236/1p; 237/1p & 237/2p లలో ఎకరములు 8.1279 సెంట్లు గల లేఅవుట్ అనుమతి నిమిత్తం దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఫైల్ ఆన్లైన్ నెం.1167/0036/LP/VMRDA/2026 నందు పరిశీలన నిమిత్తమైయున్నది. కావున పైన తెలిపిన లేఅవుట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగి యున్న యెడల ఈ ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.యం.ఆర్.డి.ఎ. కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియచేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి, సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.
Sd/- Metropolitan Commissioner, VMRDA



GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No: 22/2026-2027/SE(WS)/EE-II(WS) Dt: 26-05-2026
Number of works = 1 Value of work Rs.62.81 Lakhs
Downloading starting Date: 27-05-2026, Tender Closing Date: 10-06-2026.
Further Details at http://tender.apeprocurement.gov.in
O/o EE(WS) Cell No.9912255228
Sd/- Commissioner, GVMC



రెసిడ్యుయల్ షేర్ హోల్డర్ల యొక్క దృష్టి కొరకు ఎగ్జిట్ ఆఫర్
స్కూటర్స్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ) కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్: L25111UP1972GOI003599
రిజిస్టర్డ్ ఆఫీస్: 3/481, 1వ అంతస్తు, వికల్ప్ ఖండ్, గోమ్తీ నగర్,
లక్నో, ఉత్తరప్రదేశ్, ఇండియా-226010, టెలిఫోన్ నం.0522-3119593
వెబ్‌సైట్: www.scootersindialimited.com, ఇ-మెయిల్ ఐడి: csscootersindia@gmail.com


# అనూహ్య రద్దీ వేళ... తెరపైకి వైకుంఠమ్-3 క్యూకాంప్లెక్స్

**ఆర్‌బి సెంటర్ ప్రాంతంలో నూతన భవనం నిర్మాణం**

**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ రెట్టింపవుతున్న నేపథ్యంలో ఆలయం వెలుపల నాలుగైదు కిలోమీటర్ల వరకు లైన్లు వ్యాపిస్తున్నాయి. అక్కడ సదుపాయాలు కల్పిస్తున్నా వానకు, ఎండకు పూర్తిస్థాయిలో రక్షణ లేకపోతోంది. అదేగాక వెలుపల క్యూలైన్లు శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, పాపవినాశనమ్ మార్గంలోని గోగర్భమ్ డ్యామ్ వరకు ఉన్న ప్రాంతాలు అటవీప్రాంతానికి సమీపంలోనే ఉన్నాయి. ఇక్కడ భక్తులకు తగిన భద్రత కల్పించలేకపోతున్నామనేది టిటిడి అధికారుల ఆలోచన. ఈ నేపథ్యంలో తిరుమలలో వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ నిర్మాణం అవసరాన్ని గత ఏడాది ప్రస్తుత టిటిడి బోర్డు ప్రతిపాదించింది. అప్పటి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ కూడా కొత్త ప్రతిపాదనలను బోర్డు ముందుంచారు. అప్పట్లోనే ఆదిశగా కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే అందుకు సరైన స్థలం ఎంపిక, నారాయణగిరి ఉద్యానవనాలకు సమీపంలోనే మూడో క్యూకాంప్లెక్స్ ఉండాలనేది నిర్ణయించారు. మళ్ళీ ఆ ఊసేలేకపోయింది. తాజాగా గత నెలరోజులుగా విపరీతంగా భక్తుల రద్దీపెరగడంతో ప్రత్యామ్నాయ మూడో క్యూకాంప్లెక్స్ అవసరాన్ని ప్రస్తుతం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి గుర్తించారు. ఇప్పటికే వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ ప్రవేశాలు పూర్తిగా ఆర్జితసేవల భక్తులు, విఐపి బ్రేక్ దర్శనాలు, ఇతరత్రా సేవల భక్తులకు కంపార్టుమెంట్లు వినియోగిస్తున్నారు. సాధారణ సర్వదర్శనం భక్తులకు సుదూర క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి, నిరీక్షించి చివరకు వైకుంఠమ్2 క్యూకాంప్లెక్స్ చేరుకోవాల్సి వస్తోంది. దీనంతటినీ పరిగణనలోనికి తీసుకుని తాజాగా వైకుంఠమ్ 3 క్యూకాంప్లెక్స్ అవసరం ఉందని స్పష్టమైన నిర్ణయానికి వచ్చారు. తిరుమలలో ఉన్న వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కో కంపార్టుమెంట్‌లో 350మంది నుండి 400మంది వరకు భక్తులు కూర్చోబెట్టినా 25వేల మందికి మించి భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన సామాన్యభక్తులు ఏటిసి, నారాయణగిరి ఉద్యానవనాల వరకు విస్తరించిన క్యూలైన్లలో నుండి ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంది. 40వేలమంది భక్తులు దాటితే ఇక క్యూలైన్లు చాంతాండంత దూరం వ్యాపిస్తాయి. దీన్ని కొంతవరకు నియంత్రించేందుకు వైకుంఠమ్ 3 అవసరం ఉందని గుర్తించారు. ఈ క్యూకాంప్లెక్స్‌ను తిరుమలలో ఆలయం సమీపంలోనే ఉన్న ఆర్‌బి సెంటర్‌లో నివాసముంటున్న స్థానికులను ఖాళీ చేయించి అక్కడ కొత్త కాంప్లెక్స్ నిర్మించాలనేది టిటిడి అధికారుల ఆలోచన. అయితే స్థానికంగా ఉంటున్న వారిని తిరుపతికి తరలించి ప్రత్యామ్నాయం చూపాలని కూడా టిటిడి నిర్ణయం. కానీ ఆర్‌బి సెంటర్‌లో ఉంటున్న నివాసిస్థులు మాత్రం తమకు బాలాజీనగర్ లోనే ఇళ్ళు కేటాయించాలని సూచిస్తున్నారు. దీనిపై ఇప్పటికే తర్జనభర్జనలు జరుగుతున్నాయి. అయితే ఆర్‌బి సెంటర్ గాకుండా మరోచోట 3వ క్యూకాంప్లెక్స్ నిర్మించినా భక్తులకు ఆలయంలోనికి చేరుకోవడం దూరం భారమవుతుంది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ సాధారణ రోజుల్లోనూ 90వేల మందికి తగ్గడం లేదు. దర్శనాలు సరాసరి 70వేల మంది వరకు చేయిస్తున్నారు. ఉన్న వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు 40వేల మందికి మాత్రమే సరిపోతోంది. అదనంగా మూడో కాంప్లెక్స్ నిర్మిస్తే మరో 20వేల మంది వరకు భక్తులను అక్కడ ఉంచేందుకు సులభమవుతుంది. మరీ మన టిటిడి అధికారులు రానున్న టిటిడి బోర్డు సమావేశంలో మరోసారి చర్చించి ప్రతిపాదనలు అమలుచేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. తిరుమలలో ఉన్న 7,700 వసతి గదులు కూడా సరిపోవడం లేదు. పైగా ఐదు యాత్రికుల వసతి సముదాయాల్లోనూ 20వేల మంది వరకు సామాన్యభక్తులకు వసతి కల్పిస్తోంది. మరీ అదనపు మూడో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ నిర్మాణానికి రానున్న బ్రహ్మోత్సవాల్లో శంకుస్థాపన చేయించాలనేది కూడా అదికారుల ఆలోచన. సామాన్యభక్తులకు చాంతాడంత క్యూలైన్ల కష్టాలు తప్పడం లేదు. వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టు మెంట్లు నిండితే ఎక్కడ నుండి భక్తులను వెలుపల క్యూలైన్లలో అనుమతిస్తారనేది ఇప్పటికీ కూడా సామాన్య భక్తులకు అయోమయమే. భక్తుడు సంతోషంగా స్వామివారి దర్శనం చేసుకుని తిరుగుప్రయాణ మవ్వాలని అటు సిఎం చంద్రబాబు ఇటు టిటిడి బోర్డు పెద్దలు అనుకుంటున్నా ఆచరణలో మాత్రం అమలు చేయడంలో విఫలమవుతున్నారు. ఎంతమందికి దర్శనాలు చేయించామనే గణాంకాలు తప్ప ఎంత త్వరగా క్యూలైన్లలో అనుమతించి, ఎంత దగ్గరగా అనుమతించామనేది మాత్రం మచ్చుకైనా అధికారుల్లో ఆలోచన లేకపోతోంది.

28-5Pg7exHMNWJQE.qxd:28-5Pg7exHMNWJQE.qxd 1/1/02 6:54 AM Page 1



# టిడిపి కార్యకర్తలే రథ సారథులు

- వారి అభీష్టం మేరకు ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులకు టిక్కెట్లు • కార్యకర్తల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం • రూ.5 లక్షలతో బీమా రక్షణ
- టిడిపి పొలిటికల్ యూనివర్సిటీ • సామాన్య కార్యకర్తలకు రాజకీయ ఉద్దండులుగా తర్ఫీదు • మహానాడులో మంత్రి సవిత
- పార్టీకి మంత్రి సవిత రూ.50లక్షల విరాళం • మంత్రి సవిత ప్రసంగంపై సిఎం చంద్రబాబు అభినందనలు

**సచివాలయం, మే 27 ప్రభాతవార్త:** టిడిపిలో కార్యకర్తలే రథ సారథులని, వారి అభీష్టం మేరకే ఎంపి,ఎమ్మెల్యేల అభ్యర్థులను ఖరారు చేస్తారని మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సుశిక్షితుడైన క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా టిడిపి అధిష్టానం తీర్చిదిద్దితే గొడ్డలి పార్టీ తమ పార్టీ కార్యకర్తలను సంఘ విద్రోహ శక్తులుగా తయారుచేస్తుందంటూ వైసిపిపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ హైబ్రిడ్ మహానాడు సందర్భంగా కార్యకర్తే అధినేత అంశంపై తీర్మానం సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలుగుజాతి అభ్యున్నతికి, యువత, కార్మిక, కర్షకుల కోసం అన్న ఎన్టీఆర్ టిడిపిని స్థాపించి, 9నెలల్లోనే అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ఆనాటి అగ్ర వర్ణాల దురహంకారాన్ని నిలదీస్తు, అణగారిన వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు మాత్రమే కాదని, బడుగు, బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చిన మంత్రాక్షరాలని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం 1947లో వస్తే, రెండు తెలుగు రాష్ట్రాలకు అన్న ఎన్టీఆర్ రాకతో సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్, సిఎం చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ భుజానకెత్తుకుని పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకెళుతున్నారన్నారు.

**క్యాడర్ నిర్ణయమే ఫైనల్:** కార్యకర్త అధినేత అని నిరూపించిన పార్టీ తెలుగుదేశమని మంత్రి సవిత స్పష్టంచేశారు. తెలుగుదేశం పార్టీని నడిపేది కార్యకర్తలేనని, ఐవిఆర్ సర్వేలో వారు మెచ్చిన నాయకులకే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా అవకాశం లభిస్తుందని తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకే సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషిచేసిన కార్యకర్తలకు మాత్రమే రాబోయే ఎన్నికల్లోనైనా ప్రాధాన్యం ఇస్తామని ఇప్పటి మంత్రి నారా లోకేష్ తేల్చి చెప్పారని మంత్రి సవిత తెలిపారు.



మహానాడులో చంద్రబాబుతో పాల్గొన్న బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

**టిడిపి పొలిటికల్ యూనివర్సిటీ:** తెలుగుదేశం పార్టీ ఓ పొలిటికల్ యూనివర్సిటీ అని, పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎంతోమందిని రాష్ట్ర మంత్రులుగా, కేంద్ర మంత్రులుగా ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, జిల్లా పరిషత్ చైర్మన్‌లుగా తీర్చిదిద్దందన్నారు. విజయనగరం జిల్లా గజపతి నగరానికి చెందిన ఒక సామాన్య కార్యకర్త అయిన శ్రీదేవికి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా అవకాశం కల్పించిందన్నారు. మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు లాంటి కార్యకర్తలెందరికో రాజకీయ ప్రాధాన్యమిచ్చాంన్నారు. కార్యకర్తలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ట్రిపుల్ ఈ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషిచేసే కార్యకర్తలకు ప్రమాదం జరిగితే, ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఉండేలా రూ.5లక్షల ప్రమాద బీమాను పార్టీ పరంగా అందిస్తుందన్నారు. మహిళా సాధికారతకు మొట్టమొదటిసారి ప్రాధాన్యమిచ్చిన పార్టీ టిడిపియేనన్నారు. మహిళలకు ఆస్తుల్లో వాటా కల్పించడంతో పాటు మహిళా యూనివర్సిటీని అన్న ఎన్టీఆర్ స్థాపించారన్నారు. సిఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అని అన్నారు. దీపం పథకాలు, స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి పథకాలకు శ్రీకారం చుట్టి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మంత్రి లోకేష్ సైతం మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**మంత్రి సవితకు చంద్రబాబు అభినందనలు:** కార్యకర్తే అధినేత తీర్మానం సందర్భంగా మంత్రి సవిత ప్రసంగం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న హైబ్రిడ్ మహానాడు కార్యక్రమానికి హాజరైన కార్యకర్తల్లో జోష్ నింపింది. టిడిపిలో కార్యకర్తల అభ్యున్నతి, వారికిచ్చే ప్రాధాన్యంతో పాటు వైసిపిలో కార్యకర్తలను ఎలా వాడుకుంటుంది మంత్రి సవిత వివరించిన తీరుపై సభలో హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ప్రసంగం పూర్తికాగానే మంత్రి సవితను పిలిచి సిఎం చంద్రబాబు నాయుడు తన పక్కనే కూర్చుండబెట్టుకొని అభినందించారు.

**పార్టీకి మంత్రి సవిత రూ.50 లక్షల విరాళం:** పార్టీ అభివృద్ధికి మహానాడు వేదికగా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు విరాళాలు ప్రకటించారు. మంత్రి సవిత రూ.50 లక్షల విరాళం అందజేసినట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు.



## చింతకాయల విజయ్‌కు రాజ్యసభలో స్థానం కల్పించాలి

- మాకవరపాలెం టిడిపి మినీ మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

**అనకాపల్లి (మాకవరపాలెం), మే 27 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మాకవరపాలెంలో ఘనంగా మినీ మహానాడు నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు ఆర్.వై.పాత్రుడు ఆధ్వర్యంలో దివంగత నేత టిడిపి వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యకర్తలు నాయకులు సమక్షంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. మాకవరపాలెంలో పండగ వాతావరణం కనిపించింది, భారీ పెక్సీలతో ఆ ప్రాంతమంతా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. థియేటర్ లోపల భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి అమరావతిలో పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించే మహానాడును మండల టిడిపి నాయకులు సీనియర్ కార్యకర్తలు మహిళలు నేరుగా వీక్షించే విధంగా భారీ స్క్రీన్ ఏర్పాటుతో మహానాడులో నేరుగా పాల్గొనే అనుభూతి కలిగిందంటూ కార్యకర్తలు మరింత ఆనందం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ముఖ్యంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనయుడు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్‌కు రాజ్యసభకు అవకాశం కల్పించాలంటూ మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు మినీ మహానాడులో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా కరతాళ ధ్వనులతో ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా అల్లు రామునాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అయ్యన్న కుటుంబమంతా 44 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించింది అన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చింతకాయల విజయ్ 2009వ సంవత్సరం నుంచి పార్టీ అభివృద్ధి కోసం అనునిత్యం శక్తి వంచన లేకకుండా పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు ఉందన్నారు. అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థిగా మూడుసార్లు ప్రయత్నం చేసి వివిధ కారణాల వలన పార్టీ ఆదేశాల మేరకు నిబద్ధత కలిగిన కార్యకర్తలుగా విజయ్ చేసిన కృషిని పార్టీ అధిష్టానం గుర్తించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న చింతకాయల విజయ్ కి రాజ్యసభలో అవకాశం కల్పించాలని మాకవరపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో అభ్యర్థిస్తున్నట్లు, పార్టీ అధిష్టానం గుర్తించాలని నాయుడు కోరారు.

మహానాడు తొలి రోజు కార్యక్రమంలో మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు రుత్తల రమణమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్, పాపయ్యపాలెం మాజీ ఎంపీటీసీ వబ్బలరెడ్డి సుబ్బలక్ష్మి, తామరం సీనియర్ టిడిపి నాయకురాలు పెద్దమ్మలు తదితరులను పర్యవేక్షకుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. టిడిపి సీనియర్ నాయకులు వబ్బలరెడ్డి వెంకటరమణ నిర్వహణలో పిఏసిఎస్ అధ్యక్షులు శ్రీరంరెడ్డి వెంకట చినబాబు, పోతల రాంబాబు,అల్లు రామునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యర్రంశెట్టి వెంకటరమణ, సభలో వివిధ అంశాలపై క్షుణ్ణంగా ప్రసంగించారు. కార్యక్రమంలో లాలం రాము, రుత్తల నాని, అడిగర్ల శ్రీనివాసరావు, శ్రీరంరెడ్డి రమణ,రుత్తల నందకిశోర్, మళ్ల జైబాబు, పాసేపు సురేష్, సిద్ధాబత్తుల శీను,రుత్తల వెంకటేశ్వరరావు (జమిందార్) కేతిరెడ్డి చిరంజీవి, సబ్బవరపు వెంకటరమణ, చిరంజీవి రాజు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు మహానాడు అంకితం

- రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలే లక్ష్యం • ఎపి టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు • వర్చువల్ విధానంలో మహానాడు 2026 ప్రారంభం



**గాజువాక, మే 27 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ లీడర్లు, కార్యకర్తల ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు అని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మహానాడు2026 మొదటి రోజు సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా పొదుపు చర్యలు చేపట్టిన నేపథ్యంలో, ఈసారి మహానాడును పూర్తి డిజిటల్ మాధ్యమంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ల నుంచి నేతలు, కార్యకర్తలతో పాటు అండమాన్ నికోబార్, విదేశాల నుంచి కూడా కేడర్ వర్చువల్‌గా హాజరవుతున్నట్లు తెలిపారు. మొన్నటి ఎన్నికల విజయంలో మహిళలదే కీలక పాత్ర అని, అందుకే ఈ మహానాడును ఆడబిడ్డలకు అంకితం చేస్తూ మహిళా మహానాడుగా ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం స్త్రీ శక్తి కింద ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0 ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తోందన్నారు. గత ఏడాది లక్ష మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్‌లుగా తయారు చేశామని, స్వయం ఎపి ద్వారా డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా వేగంగా అనుమతులు ఇస్తున్నామని పల్లా తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎస్ఐపిబి ద్వారా 282 ప్రాజెక్టులకు రూ.11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటికి ప్రారంభోత్సవ తేదీలను కూడా ముందే ఫిక్స్ చేశామన్నారు. ఏఐ, క్వాంటం, సెమీ కండక్టర్స్ రంగాలతో పాటు ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి రానుందని, తిరుపతిలో బుల్లెట్ మోటారు సైకిల్ ప్రాజెక్టు కూడా దీనికి నిదర్శనమన్నారు. పార్టీలో ఎప్పుడూ యువతకు 63 శాతం ప్రాధాన్యత దక్కుతుందని పల్లా గుర్తుచేశారు. నిరుద్యోగుల కోసం మెగా డిఎస్సీ ద్వారా 15,941 పోస్టులు, 5,757 కానిస్టేబుల్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ చేపట్టడమే కాకుండా, 2026 జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎపిని స్వర్ణాంధ్రగా మార్చేందుకు 2047 విజన్ రూపొందించామని, టిడిపి కేవలం వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు.





మహానాడులో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యంపి సానా సతీష్‌బాబు

## పార్టీకి సానా సతీష్ రూ.1.50 కోట్ల విరాళం

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యకర్తల పండుగ మహానాడులో పార్టీకి భారీగా విరాళాలు వస్తున్నాయి. బుధవారం ప్రారంభమైన మహానాడులో రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు పార్టీకి రూ.1.50కోట్ల విరాళం ప్రకటించారు. పార్టీకి విరాళాలు ప్రకటించిన వారి పేర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వేదికపై ప్రకటిస్తూ భారీ విరాళం ఇచ్చిన సానా సతీష్‌ను ప్రశంసించారు. పార్టీని బలోపేతం చేయటానికి పార్టీ నిర్వహణకు, కార్యకర్తల సంక్షేమానికి నిధుల అవసరం ఉందని సియం పేర్కొన్నారు. ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు పార్టీకి విరాళాలు ప్రకటించారు.

**బక్రీద్ శుభాకాంక్షలు:** బక్రీద్ పర్వదినం త్యాగం, భక్తి, మానవతా విలువలకు ప్రతీక అని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మహమద్ ప్రవక్త చూపించిన త్యాగనిరతి, దేవునిపై అచంచల విశ్వాసం, మానవాళికి ఆదర్శంగా పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో పరస్పర గౌరవంతో జీవించాలని బక్రీద్ సందేశం ఇస్తుందన్నారు.

## జూన్ 28న పల్స్ పోలియో

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 ఏళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి. పిల్లల ఆగర్యో రక్షణ కోసం తల్లిదండ్రులు సమీప పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి రెండు చుక్కలు వేయించడం. రెండు చుక్కలు పోలియోకు శాశ్వత ముగింపు అని వైద్యశాఖ అభివర్ణించింది.

## మానసిక ఆరోగ్య కార్యక్రమం సేవలు జిల్లా మొత్తం అందించాలి: ఎన్‌టిఆర్ కలెక్టర్





శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్‌లు అందచేస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త:** మానసిక ఆరోగ్య కార్యక్రమం సేవలను కేవలం జి.కొండూరు, కొండపల్లి మండలాల్లోనే కాకుండా ఎన్‌టిఆర్ జిల్లా మొత్తం విస్తరించాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కోరారు. ఇబ్రహీంపట్నం యండిఓ కార్యాలయంలో బుధవారం నైపుణ్య శిక్షణ పొందిన అభ్యర్ధులకు సర్టిఫికెట్‌లను కలెక్టర్ చేతుల మీదుగా అందచేసారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షత మండలంలో కమ్యూనిటీ మెంటల్ హెల్త్‌కార్యక్రమాలు చేపట్టడం ప్రయోజనకరంగా ఉందన్నారు. మానసిక సమస్యలను మందుల ద్వారానే కాకుండా నైపుణ్యశిక్షణలు త్వరగా కోలుకునే విధంగా దృష్టిమళ్లింపుకు ఉపయోగపడతాయని రైజ్ సెంటర్‌లలో అందించే శిక్షణలు కూడా వినియోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు లబ్దిదారులకు రూ.2.40లక్షల విలువచేసే తోపుడు బండ్లు, టిస్టాల్, కూరగాయల వ్యాపారం, పండ్ల వ్యాపారం, ఫ్యాన్సి వస్తువుల వ్యాపారం, టైలరింగ్ మెటీరియల్ ను అందచేసారు. ఈకార్యక్రమంలో డాక్టర్ బొల్లినేని కీర్తీ, యంపిపి పాలడుగు జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

**జూన్ 5నుండి జిల్లాలో సర్ సన్నద్ధత:** ఎన్‌టిఆర్ జిల్లాలో జూన్ 5వతేదీ నుండి సర్‌పై సన్నద్ధత కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. బుధవారం కంచికచర్లలో కలెక్టర్ పర్యటించి బిఎల్‌ఓలతో మాట్లాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో నందిగా ఆర్డీఓ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐఏకు ఉగ్రవాదుల లింక్ కేసు

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** సంచలనం సృష్టించిన విజయవాడ ఉగ్రవాదుల లింకు కేసును ఎన్ఐఏకు పోలీసు అప్పంగించింది. ఈ కేసులో నిందితు లందరిని కస్టడీకి తీసుకుని విచారించనట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ శేఖర్ బాబు తెలిపారు. ఇప్పటికే టెర్ర లింకల కేసులు 15 మంది అరెస్టు. కేసు టోకేవర్‌కు కోర్టులో అఫడవిట్ దాఖలు ఎన్ఐఎ చేయనున్నది. పోలీసు నిందితులను కస్టడీకి తీసుకుని విచారించినప్పుడు అనేక నిజాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వారిని ఎన్ఐకి అప్పగించాలని పోలీసు నిర్ణయించింది. ఈ కేసులో నిందితులందరిని కస్టడీకి తీసుకుని విచారించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ శేఖర్ బాబు తెలిపారు.

## నేటినుండి ఘాట్‌రోడ్డు మరమ్మత్తు పనులు

- కనకదుర్గానగర్ నుండి మాత్రమే భక్తులకు అనుమతి

**ఇంద్రకీలాద్రి, మే 27 ప్రభాతవార్త:** నేటి నుండి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మరమత్తు పనుల సందర్భంగా పూర్తిగా రాకపోకలు ఆపివేస్తామని దుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులు కనకదుర్గా నగర్ మీదుగా మాత్రమే రావాల్సి వుంటుందని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. భక్తులు కూడా ఆలయ సిబ్బందికి సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకోవాల్సిందిగా కోరుచున్నాము. "కేవలం వృద్ధులకు, వికలాంగులకు, చంటి బిడ్డల తల్లులకు మాత్రమే లిఫ్ట్ వైపు నుండి కొండపైకి ప్రవేశం ఉంటుందని, మహా మండపం మెట్ల మార్గంలో కొండ పైకి చేరేందుకు ఏర్పాటు చేసామని ఇఒ వికె శీనా నాయక్ పేర్కొన్నారు.



**దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఇఒ వి.కె. శీనా నాయక్ అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటము, శేషవస్త్రం అందచేశారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించారు.

## ఉమ్మడి అనంతపురం జిల్లాలో విస్తారంగా వర్షాలు

### ఖరీఫ్ సేద్యం పనులకు అన్నదాతలు సన్నద్ధం

**అనంతపురం, మే 27 ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో విస్తారంగా వర్షాలు పడడంతో అన్నదాతల్లో ఆనందం చిగురిస్తోంది. ఎక్కువ వర్షం పడిన మండలాల్లో వంకలు వాగులలో నీరు పాడడంతో పాటు వర్షంతో పాటు గాలి రావడంతో రోడ్లకు ఇరువైపులా చెట్లు కూలిపోయి వాహనదారులకు ఇబ్బంది అయింది. అనంతపురంలో పలుచోట్ల చెట్లు కూలిపోవడంతో మున్సిపల్ కార్పొరేషన్ వారు చెట్లను తొలగించే పనిలో ఉన్నారు.ఇలాంటి వర్షాలు మరో రెండు రోజులు పడితే వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం భూములను సిద్ధం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు ఆశిస్తున్నాను. ఈ వర్షం వల్ల ఇన్నాళ్లు మండుటెండలతో ఇబ్బంది పడ్డ ప్రజలకు కొంత ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున పడిన వర్షపాత వివరాలు పరిశీలిస్తే.. అనంతపురం జిల్లాలో ఆత్మకూరు 78, ఒక రాయి సముద్రం 65, అనంతపురం అర్బన్ 56, కనేకల్ 52 మిల్లీమీటర్ల వర్షం పడింది. అనంతపురం రూరల్ 48.6, రాయదుర్గం 42.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. రాప్తాడు 38.8, బెలుగుప్ప 33.6, కుందుర్తి, కళ్యాణ్ దుర్గం 22.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా శ్రీ సత్యసాయి జిల్లాలో హిందూపురంలో 54.4, నల్ల చెరువులో 54.2, తలుపుల,నల్లమాడలో 47.4, గాండ్లపెంటలో 46.4, కదిరి, గోరంట్ల లో 45.2, పుట్టపర్తి, కనగానపల్లి లో 42.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. బుక్కపట్నంలో 39.6, సి.కే.పల్లిలో 38.8, తనకల్లు 37.8, కొత్తచెరువులో 32.8, రామగిరి, ధర్మవరం లో 32.4, లేపాక్షిలో 27, అమలాపురంలో 25.8, చిలమత్తూరులో 25.8, ఆమడగుడులో 25.2, పెనుగొండలో 24, సోమిందేపల్లి, నంబూల పూలుకుంట లో 21.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.



### గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కాలుష్య నివారణకు

## రూ.100 కోట్ల నిధులు: మంత్రి దుర్గేష్

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం పర్యటనతో పుష్కర పనుల్లో వేగం పెరిగిందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో కాలుష్య నివారణకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.100 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేయడమే లక్ష్యంగా ఏర్పాట్లకు పవన్ ఆదేశించారన్నారు. పిసిబి మెంబర్ సెక్రటరీగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేశామన్నారు. పిసిబి నోడల్ ఏజెన్సీగా ఉంటూ కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆంధ్ర పేపర్ మిల్లు ద్వారా కాలుష్యం జరిగితే సహించేది లేదని తేల్చి చెప్పారు. పర్యావరణ విధ్వంసం చేసే వారిపై చట్టపరంగా తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. ప్లాస్టిక్, కాలుష్య రహితంగా పుష్కరాల నిర్వహణే లక్ష్యమని మంత్రి దుర్గేష్ వివరించారు. మురుగునీరు నదుల్లోకి వదిలితే ఎంతటి వారైనా జైలుకు పంపుతామన్నారు. నిరక్ష్యంగా వ్యవహరిస్తే పరిశ్రమలపై కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు.

## బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్‌గా ఎపి ఎంపిక

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర పర్యాటకశాఖకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్‌గా ఏపీ ఎంపికైంది. ప్రతిష్ఠాత్మక మెట్రో ఎక్స్‌పెడిషన్- జీటీఎం టూరిజం అవార్డు 2026కు ఎంపికైంది. దీనికి సంబంధించి జూన్ 4న ఈ సందర్భంగా కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో మంత్రి కందుల దుర్గేష్ అవార్డు తీసుకోనున్నారు. దీన్ని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతులమీదుగా మంత్రి కందులదుర్గేష్ అవార్డు తీసుకోనుండటం విశేషం. దేశంలో ఉత్తమ టూరిజం ప్రమోషన్ స్టేట్ గా రాష్ట్రం ఈ ఏడాదికి ఎంపికైంది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలను తెలిపారు. టూరిజం కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని రకాలైన చర్యలను తీసుకుంటుంది.

**ఎపి మద్యం కుంభకోణం కేసు**

## వాసుదేవరెడ్డిని విచారించిన ఇడి

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణం కేసులో ఏ2గా ఉన్న వాసుదేవరెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న ఇడి కార్యాలయంలో అధికారులు ఆయన్ను ప్రశ్నించారు. నాలుగు గంటలకు పైగా విచారణ కొనసాగింది. వైకాపా మద్యం ముఠాతో కలిసి కుట్రకు రూపకల్పన అమలులో ఆయన ప్రధాన పాత్ర పోషించారని ఇప్పటికే సిట్ తేల్చిన విషయం తెలిసిందే. 2019 కంటే ముందువరకూ ఆటోమేటెడ్ విధానంలో ఉన్న మద్యం సరఫరా ఆర్డర్ల జారీ వ్యవస్థను విధ్వంసం చేసి, ఆ స్థానంలో మాన్యువల్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా కుంభకోణానికి దారులు తెరిచారని వెల్లడించింది. అయితే నేటితో వాసుదేవ రెడ్డి విచారణ ముగిసే అవకాశం ఉంది.

## తమిళనాడులో ముగ్గురు అదృశ్యం క్రైం బ్రాంచ్ పోలీసుల గాలింపు



అదృశ్యమైన తల్లి, కుమారుడు, మనుమడు(ఫైల్‌ఫోటో)

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త:** తమిళనాడులో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమారుడు, మనుమడు అదృశ్యమైన ఘటనపై తమిళనాడు క్రైంబ్రాంచ్ పోలీసులు గాలింపు చేపట్టారు. తమిళనాడులోని వెల్లూరు రేంజ్ క్రైంబ్రాంచ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణీపేటజిల్లా, అరక్కోణంరోడ్డు పరిధిలోని సోలింఘర్ గ్రామానికి చెందిన డి.రాజేష్‌కుమార్(39), తనకుమారుడు జస్వంత్ రాజేష్(7), తల్లి డి.లిలత(65)లతో కలిసి 2022 నవంబర్ 11వతేదీ నుండి కనిపించటంలేదని రాజేష్‌కుమార్ భార్య సూర్య(36) వెల్లూరు సిబిసిఐడి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. కుటుంబ కలహాల కారణంగా వీరు అదృశ్యమైనట్లు భావిస్తున్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా భర్త, కుమారుడు, అత్త ఆచూకి తెలియక సూర్య తీవ్ర మనోవేదనకు గురవుతుండగా వీరి ఆచూకి తెలిసిన వారు సిబిసిఐడి సెల్ : 98658 68988లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేసారు.

28-5Pg5 ff.qxd:28-5Pg5 ff.qxd 1/1/02 7:13 AM Page 1






## ఎబోలా వైరస్‌కు వ్యాక్సిన్ తెచ్చామన్న రష్యా!

**మాస్కో, మే 27:** ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎబోలా కొత్త వేరియంట్‌కు రష్యా వ్యాక్సిన్‌ను ఆవిష్కరించింది. కాంగో, ఉగాండా దేశాల్లో బుండిబుగ్యో అనే కొత్త రకం ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో ఈ ప్రాణాంతక వేరియంట్‌కు ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు పొందిన టీకా లేదు. తాజాగా రష్యా తెచ్చిన కొత్త ఆవిష్కరణకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం సెంట్రల్ ఆఫ్రికా దేశాల్లో బుండిబుగ్యో ఎబోలా రకం తీవ్ర కలకలం రేపుతోంది. కాంగోలో దీని తీవ్రత అత్యంత ప్రమాదకర స్థాయికి చేరినట్లు డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది. ఇప్పటికే అక్కడ వందలాది మంది ఈ వైరస్ బారిన పడ్డారు. డజన్ల కొద్దీ మరణాలు సంభవించడంతో అంతటా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఎబోలా వ్యాక్సిన్లు కేవలం 'జైర్' అనే పాత వేరియంట్‌పై మాత్రమే పనిచేస్తుండటంతో ఈ కొత్త ముప్పును అడ్డుకోవడం వైద్య నిపుణులకు సవాలుగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రష్యా ఆరోగ్య శాఖ మంత్రి మిఖాయిల్ మురాష్కో ఈ ప్రకటన చేశారు. తమ దేశ పరిశోధకులు తయారు చేసిన కొత్త టీకా ఈ అరుదైన బుండిబుగ్యో వేరియంట్ నుంచి పూర్తి రక్షణ కల్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీనితో పాటు ఆఫ్రికా దేశాలకు ఎబోలా నిర్ధారణ కిట్లు, అవసరమైన వైద్య సాయాన్ని అందిస్తామని రష్యా రాయబార కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం బ్రిటన్, అమెరికా పరిశోధకులు కూడా ఈ వైరస్‌కు విరుగుడు కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. రష్యా ఆవిష్కరణపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్నప్పటికీ అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు మాత్రం కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించిన క్లినికల్ ట్రయల్స్ డేటాను రష్యా ఇంకా బహిరంగంగా వెల్లడించలేదు. ప్రజల్లోకి ఈ టీకాను విస్తృతంగా తీసుకెళ్లడానికి ముందు మనుషులపై ప్రయోగాలు, శాస్త్రీయ విశ్లేషణలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అనుమతులు తప్పనిసరని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అప్పటివరకు వైరస్ నిర్ధారణ, రోగుల ఐసోలేషన్ వంటి నివారణ చర్యలే ప్రధాన ఆయుధాలని పేర్కొంటున్నారు.

## దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు 31 మంది మృతి



**బీరూట్, మే 27:** శాంతి చర్చలతో త్వరలోనే పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతున్నది. ఓ వైపు శాంతి చర్చలు జరుగుతుండగానే ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతాలపై అమెరికా తీవ్ర దాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. దక్షిణ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మైన్స్ అమర్చుతున్న పడవలపై తాము ఆత్మరక్షణ దాడులు నిర్వహించినట్టు అమెరికా సైన్యం తెలిపింది. తాజాగా ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో పలువురు చిన్నారులతో సహా కనీసం 31 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అర్ధరాత్రి గాజాపై ఇజ్రాయెల్ రెండు చోట్ల వైమానిక దాడులక పాల్పడింది. ఈ దాడుల్లో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా 12 మంది గాపడ్డారు. ఏప్రిల్‌లో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత జరిగిన అతి పెద్ద దాడి ఇదేనని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు తమ సరిహద్దు ప్రాంతాలపై రాకెట్లు ప్రయోగించారని , దానికి ప్రతిస్పందనగానే ఈ దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇజ్రాయెల్ దళాలను తమ యోధులు సమర్ధవంతంగా ఎదుర్కొన్నారని హిజ్బుల్లా తెలిపింది. వైమానిక దాడులు, ఫిరంగి కాల్పుల తర్వాత జౌతర్ అల్‌షర్కియా వైపు దూసుకొస్తున్న ఇజ్రాయెల్ దళాన్ని హిజ్బుల్లా యోధులు వెనక్కి తరిమికొట్టారని ఆ సాయుధ బృందం పేర్కొంది. ఆ పట్టణంలో ఇజ్రాయెల్ దళాలపై జరిగిన వరుస డ్రోన్, రాకెట్ దాడులకు తామే బాధ్యులమని స్పష్టం చేసింది.

# మమత ఎమ్మెల్యేలు, ఎంపిలు బిజెపిలోకి!

## - దాదాపు 70 మంది తమతో టచ్‌లో ఉన్నారంటున్న బిజెపి ఎంపి సౌమిత్రఖాన్



**కోల్‌కత్తా, మే 27:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలకలం రేగుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి చెందిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బీజేపీ కేంద్ర నాయకత్వం పచ్చజెండా ఊపితే వారంతా కాషాయ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీ సౌమిత్రఖాన్ బుధవారం సంచలన ప్రకటన చేశారు. ఒకవేళ వీరందరినీ చేర్చుకోవాలని బీజేపీ నిర్ణయిస్తే తృణమూల్ కాంగ్రెస్ ఒక రాజకీయ శక్తిగా ఉనికినే కోల్పోతుందని ఆయన పేర్కొన్నారు. సౌమిత్రఖాన్ చేసిన ఈ వ్యాఖ్యలను తృణమూల్ సీనియర్ ఎంపీ సౌగతా రాయ్ పూర్తిగా ఖండించారు. ఇదంతా అబద్ధమని, బీజేపీ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని కొట్టిపారేశారు. ఇదే సమయంలో సౌమిత్రఖాన్ టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనను ఒక పాపిగా అభివర్ణిస్తూ, పాపం చేసిన వారు జైలుకు వెళ్లక తప్పదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన ఇంటి ముందు బుల్డోజర్ సిద్ధంగా ఉందని, గతంలో బీజేపీ కార్యకర్తల ఇళ్లను కూల్చివేయించినందుకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఘాటుగా విమర్శించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు మండుతున్నాయి. అవినీతి ఆరోపణలు, అంతర్గత విబేధాల నడుమ బారాసత్ టీఎంసీ ఎంపీ కాకొలి ఘోష్ దస్తీదార్, ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలో జరిగిన ఒక అధికారిక సమీక్షా సమావేశానికి హాజరుకావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవల లోక్‌సభలో టీఎంసీ చీఫ్ విప్ పదవి నుంచి తొలగించబడిన కాకొలి ఘోష్, ఆ తర్వాత బారాసత్ పార్టీ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమెకు వైకేటగిరీ భద్రతను కల్పించడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలకు చెందిన దాదాపు 100 మంది కౌన్సిలర్లు ఇటీవల రాజీనామా చేయడం తృణమూల్ పునాదులను కదిలిస్తోంది. భట్పరా మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రేబా రాహా సహా 35 మంది కౌన్సిలర్లలో 30 మంది వైదొలిగారు. హాలిసహర్‌లో 16 మంది, కాంచ్రాపారలో 14 మంది కౌన్సిలర్లు రాజీనామాలు సమర్పించారు. కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హాకీమ్ కూడా తన పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మున్సిపల్ వ్యవహారాల మంత్రి అగ్నిమిత్ర పాల్ ఇప్పటికే కౌన్సిలర్లు రాని మున్సిపాలిటీలకు అడ్మినిస్ట్రేటర్లను నియమిస్తామని ప్రకటించారు.

దీనికి తోడు మున్సిపల్ నియామకాల అవినీతి కేసులో మాజీ మంత్రి సుజిత్ బోస్ అరెస్ట్ కావడం, పలువురు నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా కొనసాగుతుండటం టీఎంసీని తీవ్ర స్వీయరక్షణలోకి నెట్టేసింది.

## చంద్రుడిపై నాసా శాశ్వత మానవబేస్!

### 2028 నాటికి చంద్రునిపైకి నాసా వ్యోమగాములు!

**టెక్సాస్, మే 27:** చంద్రుడు మీదకు రోవర్లను పంపిన నాసా ఇప్పుడు అక్కడ శాశ్వత మానవ బేస్‌ను ఏర్పాటు చేసే కసరత్తులుప్రారంభించింది. కొత్తగా మూడు మిషన్లు చేపట్టనున్నట్లు నాసా వెల్లడించింది. నాసా అడ్మినిస్ట్రేటర్ జేర్డ్ ఐజాక్‌మాన్ మాట్లాడుతూ పర్మనెంట్ బేస్‌ను చంద్రుడిపై నిర్మించేందుకు సుమారు 20 బిలియన్ల డాలర్లు ఖర్చు అవుతోందన్నారు. లూనార్ రోవర్లు, డ్రోన్లను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. ప్రమాదకరమైన వాతావరణంలో ప్రయోగాలు నిర్వహించే రీతిలో అక్కడ ఏర్పాట్లను కల్పించనున్నారు. చందమామపైకి మళ్లీ అమెరికా వెళ్తోందని, బయట ప్రపంచంలో మానవుడు ఏర్పాటు చేసుకోబోతున్న తొలి మానవ బేస్ ఇదే అన్నారు. 2028 నాటికి చంద్రుడిపై ఆస్ట్రోనాట్లను దింపాలని నాసా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దానికి తగిన ప్రణాళికలతో నాసా ముందుకు వెళ్తున్నది. బ్లూ ఆర్జిన్స్ కు చెందిన బ్లూ మూన్ మార్క్ 1 ఎండ్యూరెన్స్ ల్యాండర్‌ను పంపనున్నారు. మూన్ బేస్1 మిషన్‌లో భాగంగా ఆ ల్యాండర్ చంద్రుడిపై దిగనున్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆ ప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయి. షాకల్టన్ కనెక్టింగ్ రిడ్జ్ ప్రాంతంలో ల్యాండర్‌ను దింపనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆర్టెమిస్2 మిషన్‌లో భాగంగా నలుగురు ఆస్ట్రోనాట్లు చంద్రుడిని చుట్టి వచ్చిన విషయం తెలిసిందే. మూన్ బేస్ 2 మిషన్‌లో సుమారు 1100 పౌండ్ల కార్గోను పంపనున్నారు. ఆస్ట్రోబోటిక్ గ్రిఫిన్ ల్యాండర్ ద్వారా డెలివరీ చేస్తారు. ఇక మూన్ బేస్ 3 మిషన్‌లో భాగంగా లూనార్ వెర్టిక్స్ ను పంపనున్నారు. చంద్రుడిపై ఉన్న గురుత్వాకర్షణ గురించి ఆ మిషన్ స్టడీ చేస్తుంది. ఈ ప్రయోగంలో యురోపియన్, కొరియన్ స్పేస్ ఏజెన్సీ పేలోడ్స్ కూడా వెళ్తాయి. మూడు దశల ప్రోగ్రామ్ ద్వారా రాబోయే మూడేళ్లలో చంద్రుడి ఉపరితలాన్ని నాసా సిద్ధం చేయనున్నది. చంద్రుడి ఉపరితలంపై తిరిగే ఓ వాహనాన్ని కూడా నాసా సిద్ధం చేస్తున్నది. లూనార్ సర్ఫేస్‌పై ఆస్ట్రోనాట్స్ తిరిగే అవకాశాలు ఉంటాయి. మూన్ బేస్ రెండో ఫేజ్‌లో 2029 నుంచి 2032 మధ్య పర్మనెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించనున్నారు. దీనిలో భాగంగా ఓ పవర్ గ్రిడ్‌ను నిర్మిస్తారు. 2032 నుంచి మూడో దశను చేపడతామని నాసా డైరెక్టర్ వెల్లడించారు.

### ఆశారాంబాపూ వెంటనే లొంగిపోవాలని ఆదేశం

## కిందికోర్టు జీవితఖైదు శిక్షను సమర్థించిన హైకోర్టు

**జైపూర్, మే 27:** రాజస్థాన్‌కు చెందిన స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కింది కోర్టు విధించిన జీవిత ఖైదును రాజస్థాన్ హైకోర్టు సమర్థించింది. ఆయన దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుతం మధ్యంతర వైద్య బెయిల్‌పై బయట ఉన్న 86 ఏళ్ల ఆశారాం వెంటనే అధికారుల ఎదుట లొంగిపోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న శిల్పి, శరత్‌చంద్‌లను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ అరుణ్ మోంగా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2013 ఆగస్టులో జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో మైనర్ బాలికపై ఆశారాం లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం జోధ్‌పూర్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు 2018 ఏప్రిల్ 25న ఆశారాంను దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆశారాం హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై 2026 ఫిబ్రవరి 16 నుంచి ఏప్రిల్ 20 వరకు హైకోర్టు రోజువారీ విచారణ జరిపి, తీర్పును రిజర్వ్ చేసి బుధవారం తుది తీర్పును వెల్లడించింది. ప్రాసిక్యూషన్, బాధితురాలి తరఫు న్యాయవాది పి.సి. సోలంకి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. పోక్సో చట్టం ప్రకారం బాధితురాలి వాంగ్మూలమే శిక్ష విధించడానికి సరిపోతుందని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు సాక్షులపై దాడులు, హత్యలు జరిగాయని కూడా వారు కోర్టుకు తెలిపారు. ఆశారాం ఇప్పటికే గుజరాత్‌లోని గాంధీనగర్ ఆశ్రమంలో మరో మహిళపై అత్యాచారం కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఆ కేసులో 2023 జనవరిలో ఆయనకు శిక్ష పడింది.

## ఉగాండా నుంచి వచ్చిన మహిళకు ఎబోలా పరీక్షలు వైరాలజీ పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు ధ్రువీకరణ

**బెంగళూరు, మే 27:** ఆఫ్రికా దేశాల లో వేగంగా వ్యాపిస్తున్న ఎబోలా వైరస్ పై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో కర్ణాటక రాజధాని బెంగళూరులో ఎబోలా కలకలం రేగింది. ఉగాండానుంచి వచ్చిన మహిళలో ఎబోలా వ్యాధి లక్షణాలు కనిపించాయి. దాంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 28 ఏళ్ల ఉగాండా మహిళ ఈ నెల 23న కెంపెగౌడ విమానాశ్రయంలో దిగారు. అయితే ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు అధికారులు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సదరు ఉగాండా మహిళకు కూడా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. దాంతో ఆ మహిళలో ఎబోలా వ్యాధికి సంబంధించి తేలికపాటి లక్షణాలను గుర్తించారు. వెంటనే ముందుజాగ్రత్త చర్యగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. పంపిస్తే ఆమెకు నెగిటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కర్ణాటక ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిత్విక్ రంజన్ పాండే దీనిపై మాట్లాడారు. ప్రస్తుతం ఆ మహిళ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉందన్నారు. ఆమెలో కన్పించిన లక్షణాలు ఎబోలాకు సంబంధించినవేనా అనే విషయంపై స్పష్టత ఇవ్వలేమని చెప్పారు.

## సంక్షిప్తంగా..

### గేమింగ్ టైకూన్ హత్యకేసులో మాజీ సిఇఒకు ఉరిశిక్ష అమలు

**బీజింగ్,మే 27:** గేమింగ్ టైకూన్, బిలియనీర్ లిన్ క్వి హత్య కేసులో మాజీ సీఈవో జూ యావోకు చైనా అధికారులు మరణశిక్ష అమలు చేశారు. లిన్‌కు విషం ఇచ్చి చంపినట్లు జూ యావోపై ఆరోపణలు ఉన్నాయి. 3 బాడీ ప్రాబ్లం అనే సైన్స్ ఫిక్షన్ సిరీస్ విషయంలో ఇద్దరి మధ్య విబేధాలు తలెత్తాయి. అయితే ఆ సమయంలో యోజూ గేమ్స్ వ్యవస్థాపకుడు లిన్‌కు విషం ఇచ్చి యావో హత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

యావోను ఈనెల 21వ తేదీన ఉరి తీసినట్లు చైనా అధికారులు వెల్లడించారు.

లిన్ హత్య కేసు చైనావ్యాప్తంగా పెను సంచలనం రేపింది.

### ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అసోం అసెంబ్లీ ఆమోదం



**గువాహతి, మే 27:** వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ఉమ్మడి పౌరస్మృతి యూసీసి బిల్లును అసోం అసెంబ్లీ ఆమోదించింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య బిల్లు బుధవారం ఆమోదం పొందింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పొలిటికల్ ఎజెండా బిల్లుగా పేర్కొన్నాయి. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ఈ బిల్లును విస్తృత సంప్రదింపుల కోసం ఎంపిక చేసిన కమిటీకి పంపాలని కూడా ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. యూసీసీని అమలు చేస్తున్న మూడో రాష్ట్రంగా అసోం నిలిచింది. ఇప్పటివరకూ ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలు యూసీసీని ఆమోదించి అమలు చేస్తున్నాయి. అసోంలో ఐదు రోజుల ప్రత్యేక అసెంబ్లీని హిమంత బిశ్వ శర్మ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వహిస్తోంది.

### ఎనిమిది గంటలకు పైగా గాల్లోనే ఎయిరిండియా చక్కర్లు

**న్యూఢిల్లీ, మే 27:** 230 మంది ప్రయాణికులతో శాన్‌ఫ్రాన్సిస్కో వెళుతున్న ఎయిరిండియా విమానం, ఎనిమిది గంటలకు పైగా గాలిలో ప్రయాణించిన తర్వాత ఢిల్లీకి తిరిగి వచ్చింది. సాంకేతిక సమస్య కారణంగా ఆ విమానం చైనా గగనతలం నుంచి ఢిల్లీకి తిరిగివచ్చింది. విమాన సంస్థ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 777-300 ఈఆర్ బుధవారం శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరింది.

విమానం చైనా గగనతలంలో ఉండగానే సాంకేతిక లోపం తలెత్తడంతో 8 గంటలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత అక్కడి నుంచి తిరిగి ఢిల్లీకి బయలుదేరింది.

### గుజరాత్‌లో రూ.1000 కోట్లకు పైగా కొకైన్ సీజ్!



**గాంధీనగర్, మే 27:** మాదక ద్రవ్యాల రవాణాపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. తాజాగా గుజరాత్‌లోని కచ్ తీరంలో భారీ మొత్తంలో కొకైన్ దొరికింది. దాని విలువ రూ.1000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. పాకిస్థాన్‌లోని ఖాసిం పోర్టు నుంచి ఒక యూరోపియన్ నౌక కచ్ తీరానికి వచ్చింది. ఈ నౌకలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం, భారత కోస్ట్‌గార్డ్ అధికారులు గమనించారు. నౌకలోంచి కొన్ని సంచులను సముద్రంలోకి విసిరేయడాన్ని గుర్తించారు. దీంతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి ఆ సంచులను స్వాధీనం చేసుకుని పరీక్షించగా అవి కొకైన్ అని తేలింది. దాదాపు 100 కిలోలకు పైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాభరణాలు అదృశ్యం

**తిరువనంతపురం, మే 27:** తిరువనంత పురంలోని ప్రసిద్ధ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేరళ డిజిపి వెల్లడించడంతో ఆలయ భద్రతపై భక్తుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వామి ఆభరణాలు కనిపించకుండా పోయాయని కేరళ హోం శాఖ సెక్రటరీకి డిజిపి సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. డిజిపి నివేదిక ప్రకారం ఆలయం నుంచి సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. వాటిలో వైరమ్ నామంగా పిలువబడే వజ్రాల ఆభరణం కూడా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం వైరమ్ నామాన్ని మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట ఆలయం నుంచి బయటకు తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత దానిని తిరిగి తీసుకురాలేదు.

అదే విధంగా ఆరు నెలల కిందట ఆలయం నుంచి తీసుకెళ్లిన బంగారు దీపం కూడా కనిపించకుండా పోయింది.

### ప్రభుత్వనేతలకు కునుకు లేకుండాచేస్తున్న కాక్రోచ్ జనతాపార్టీ!

**న్యూఢిల్లీ, మే 27:** భారతదేశ రాజకీయ ముఖచిత్రంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అనే ఒక సరికొత్త సోషల్ మీడియా ఉద్యమం ప్రభుత్వ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. బొద్దింక అమెరికా యూనివర్సిటీలో ఉండే ఒక సాధారణ కమ్యూనికేషన్ స్ట్రాటజిస్ట్ అభిజీత్ దిప్కే ప్రారంభించిన ఈ వ్యంగ్య ఉద్యమం ఇటు అధికార శ్రేణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దేశంలోని నిరుద్యోగ యువతను ఉద్దేశించి చేసిన బొద్దింక వ్యాఖ్యలే ఈ తిరుగుబాటుకు కారణమయ్యాయి. తమను హేళన చేసినట్లు భావించిన లక్షలాది మంది నిరుద్యోగ యువత ఈ కాక్రోచ్ జనతా పార్టీ పేరిట నెట్టింట ఒక్కటయ్యారు. విచిత్రమేమిటంటే ఈ సీజేపీకి ఎలాంటి ఆఫీసు, లీడర్, క్యాడర్ లేవు. కేవలం సైబర్ ప్రపంచంలో సాగుతున్న ఈ ఉద్యమాన్ని చూసి కేంద్రం ఎందుకు ఉలిక్కిపడుతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం ప్రకటనల ద్వారా నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, ఆర్థిక వైఫల్యాలను కప్పిపుచ్చి తమకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది.

## చిన్నారులపై ప్రిస్కూళ్లు, డేకేర్‌సెంటర్లలో లైంగిక దాడులు

### దేశవ్యాప్తంగా దర్యాప్తు చేపట్టిన ఫ్రాన్స్ సర్కార్




**ప్యారిస్, మే 27:** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో అత్యంత కలకలం రేపుతున్న చిన్నారుల లైంగిక వేధింపుల కుంభకోణం ఇప్పుడు ఆ దేశాన్ని వణికిస్తోంది. పాఠశాలలు, డేకేర్ సెంటర్లలో చిన్న పిల్లలను పర్యవేక్షించే బాధ్యత కలిగిన సిబ్బంది చిన్నారులపై హింసకు పాల్పడటమే కాకుండా లైంగిక దాడులు, అత్యాచారాలకు ఒడిగట్టారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. రాజధాని నగర వ్యాప్తంగా దాదాపు 84 ప్రిస్కూళ్లు, 20 ప్రైమరీ స్కూళ్లు, 10 డేకేర్ సెంటర్లలో ఈ దర్యాప్తు కొనసాగుతోందని పారిస్ ప్రాసిక్యూటర్ లోర్ బెక్యువా వెల్లడించారు. సుమారు వందమందికిపైగా ఈ బాధితులున్నారు. ఇది కొంతకాలంగా కొనసాగుతున్నట్లు అంచనా. లంచ్ బ్రేక్‌లు, విరామ సమయాలు, పిల్లలు నిద్రపోయే వేళల్లో వారిని చూసుకునే స్కూల్ మానిటర్లే ఈ ఘాతుకాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరు నేషనల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ద్వారా కాకుండా స్థానిక సంస్థల ద్వారా నియమితులైన వారని తెలుస్తోంది. పిల్లలపై అరవడం, జుట్టు పట్టుకుని లాగడం, ఆహారం ఇవ్వకపోవడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదులపై అధికారులు స్పందించడానికి నెలల సమయం పట్టిందని బాధితుల తరఫు న్యాయవాదులు పేర్కొంటున్నారు. ఈ స్కాండల్‌కు సంబంధించిన ఒక ప్రధాన కేసు విచారణ ఈ వారంలో పారిస్ కోర్టులో ప్రారంభం కావడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 36 ఏళ్ల స్కూల్ అసిస్టెంట్ డేవిడ్ 3 నుంచి 5 ఏళ్ల వయసున్న ఐదుగురు ప్రీ స్కూల్ చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు ఇద్దరు మహిళా సహోద్యోగులను వేధించాడనే ఆరోపణలపై కోర్టుకు హాజరయ్యాడు. ఆరోపణలను తిరస్కరిస్తున్నప్పటికీ, చిన్నారులను తన ఒళ్లో కూర్చోబెట్టుకోవడం వంటి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువైతే 10 ఏళ్ల జైలు, 1.50లక్షలయూరోలజరిమానా పడుతుందన్నారు.

## సిబిఎస్ఇ ఫలితాల్లో భారీ అవకతవకలు - జుడీషియల్ విచారణ జరిపించాలి

### - లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ - కోఎంప్ట్‌కు సిబిఎస్ఇ కాంట్రాక్టు ఎందుకిచ్చారని నిలదీత

**న్యూఢిల్లీ, మే 27:** సిబిఎస్ఇ పరీక్షా ఫలితాలు "భారీ అవకతవకల"తో మలినమయ్యాయని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ "మొత్తం కుంభకోణం" వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీసేందుకు స్వతంత్ర న్యాయ విచారణ, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు వివాదాల్లో చిక్కుకున్న కోఎంప్ట్‌కు సిబిఎస్ఇ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చారని గాంధీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోఎంప్ట్ యాజమాన్యానికీ, మోడీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం అసలు ఎలాంటిదని కూడా ఆయన ప్రశ్నించారు. "సిబిఎస్ఇ పరీక్షా ఫలితాలు భారీ అవకతవకలతో మకిలిపడ్డాయి, దీంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు" అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ విషయానికొస్తే? ఎప్పటిలాగే సమాధానాలు లేవు, జవాబుదారీతనం లేదు, సిగ్గు లేదు" అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు దుయ్యబట్టారు. ఈ బాధ్యత అప్పగించిన 'కోఎంప్ట్' సంస్థ, గతంలో 2019లో తెలంగాణలో 'గ్లోబరేనా' పేరుతో పనిచేస్తూ ఇలాంటి దుష్కార్యాలకే పాల్పడిందని రాహుల్ ఆరోపించారు. పేరు మారినా ఉద్దేశం మారలేదు, దాని స్వభావం కూడా మారలేదని ఆయన అన్నారు. దాని చరిత్ర బహిరంగంగానే ఉన్నప్పటికీ, లెక్కచేయకుండా కాంట్రాక్టును అప్పగించారని రాహుల్ ఆరోపించారు. 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అలాంటి సంస్థకు అప్పగించారని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. "ఇది పొరపాటు కాదు ఇది పథకం ప్రకారం చేసిన కుట్ర," అని ఆయన మండిపడ్డారు. సిబిఎస్ఇ కాంట్రాక్టును కోఎంప్ట్‌కు ఎందుకు, ఎవరి ఆదేశాల మేరకు ఇచ్చారు? ఈ కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వడానికి ఏ నిర్దిష్ట నియమ నిబంధనలను ఉల్లంఘించారు? గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు కోఎంప్ట్ గతంలో వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ, ఈ విషయం సిబిఎస్ఇకి ఎలా తెలియకుండా పోయింది? నేపథ్య తనిఖీలు ఎందుకు నిర్వహించలేదు? కోఎంప్ట్ యాజమాన్యానికీ, మోడీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం అసలు స్వరూపం ఏమిటి? అని రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసి, అసలు దోషులను బయటపెట్టడానికి తక్షణమే ఒక స్వతంత్ర న్యాయ విచారణను, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటి) ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నాము" అని కాంగ్రెస్ అధినేత అన్నారు. "సిబిఎస్ఇ పరీక్షలు రాస్తున్న మన జెన్ జెడ్ మిత్రులకు మీ కష్టఫలాలను గానీ, మీ భవిష్యత్తును గానీ ఎవరూ దొంగిలించలేరు.

28-5Pg6exHMNWJQE.qxd:28-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:35 AM Page 1



# 'సర్' సమర్థవంతంగా నిర్వహించాలి

**తిరుపతి, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- 2026 (సర్)కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఖచ్చితత్వంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఓటర్ల నమోదుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉపాధ్యాయ నగర్, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో మంగళం తదితర ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం అమలును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇంటింటి సర్వే విధానాన్ని పరిశీలిస్తూ, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు బూత్ లెవల్ ఆఫీసర్లు, ఇఆర్ఓలు, సూపర్వైజర్లతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ఇంటింటి సర్వేను క్షుణ్ణంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయాలని ఆదేశించారు.


తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

అదేవిధంగా మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు, డూప్లికేట్ నమోదులను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తొలగించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి తప్పులు లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమని, అందువల్ల ప్రతి వివరాన్ని ఖచ్చితత్వంతో నమోదు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఫీల్డ్ స్థాయిలో బిఎల్ఓలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ శారదాదేవి, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తిరుపతి తహసీల్దార్ సురేష్ బాబు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ౖ, అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంకండి

● రెండేళ్ళ వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం అసమర్థ విధానాల పట్ల ప్రజలు విసిగి పోయారు: వైఎస్ జగన్

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రెండేళ్ళ వ్యవధిలోనే కూటమి ప్రభుత్వ అసమర్థ విధానాల పట్ల ప్రజలు విసిగిపోయారని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. కేవలం ప్రచార ఆర్భాటాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని జగన్ అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పూర్తిస్థాయిలో జగన్ దృష్టి సారించారు. ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే క్రమంలో నియోజకవర్గ ఇంఛార్జిలకు ఆయన తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా, ఏ ఒక్క స్థానంలోనైనా ఎన్నిక ఏకగ్రీవమైతే, దానిని పూర్తిగా ఆ ఇంఛార్జి వైఫల్యంగానే పరిగణిస్తానని తేల్చిచెప్పారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తలు, ఇంఛార్జిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ కీలక సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికార పార్టీ కుట్రలను ఎదుర్కొని ప్రతిచోటా వైసిపి జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిచోటా వైసిపి జెండా ఎగరేయాలి. ఎక్కడైనా ఏకగ్రీవం జరిగిందంటే మాత్రం నేను చాలా సీరియస్‌గా తీసుకుంటా. ఇది మళ్లీ మళ్లీ చెబుతున్నా. అలా జరిగితే అది నియోజకవర్గ ఇంఛార్జి ఫెయిల్యూర్‌గానే భావిస్తా" అని జగన్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక, వారికి ఇవ్వాల్సిన భరోసాపై కూడా జగన్ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఎస్సీలు బలంగా ఉన్న గ్రామాల్లో వారి నుంచే అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ, ఇంఛార్జి అండగా ఉన్నారనే ధైర్యాన్ని కల్పించాలని, అలా చేస్తేనే అసెంబ్లీ ఎన్నికల్లో వారు మనకు అండగా నిలుస్తారని వివరించారు.

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి, ఎన్నికల బరిలోకి దింపాలని ఆదేశించారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ నేతలకు సూచించారు. ఇందుకోసం "వెన్నుపోటు రెండేళ్లు" పేరుతో రూపొందించిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఆదేశించారు. ప్రభుత్వ లోపాలపై ఇంటింటా చర్చ జరిగేలా చేయడం ద్వారా ప్రజలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నేతలకు స్పష్టం చేశారు.

# జంతువుల వధ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు

● బక్రీదు సందర్భంగా చట్టాలను పాటించాలి ● జంతు హింసకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు ● మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** బక్రీదు పండుగ సందర్భంగా జంతువుల వధ, రవాణా, సంరక్షణకు సంబంధిం చిన ప్రభుత్వ చట్టాలు, నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించా లని రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖల మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



దేశవ్యాప్తంగా జంతువుల రవాణా, సంరక్షణ, వధకు సంబంధించి ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని, ఇవి జాతీయ స్థాయిలో రూపొందించబడినప్పటికీ, అనుమతులు, నిషేధాలు రాష్ట్రానికొక విధంగా ఉంటాయని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాంసాహార అవసరాల కోసం మేకలు, గొర్రెలు, పందులు, కోళ్లు, బాతులు, చేపలు, పునరుత్పత్తికి వినియోగించని గేదెలను మాత్రమే వధించేందుకు అనుమతి ఉందన్నా రు. అయితే ఆవులు, దూడలు, ఒంటెల వధను రాష్ట్రంలో పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. పశువులను రవాణా చేసే సమయంలో వాటికి ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా జంతు సంరక్షణ చట్టాలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిమితికి మించి వాహనాల్లో పశువు లను తరలించడం, నిషేధిత జంతువులను వధించడం వంటి చర్యలు చట్ట విరుద్ధమని హెచ్చరించారు. ఎవరైనా ఆవులు, దూడలు, ఒంటెలను వధించినా లేదా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేసినా, జంతు హింస నివారణ చట్టం, ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధం, పశుసంర క్షణ చట్టం ప్రకారం కఠిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

బక్రీదు సందర్భంగా క్షేత్రస్థాయిలోని పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలతో సమన్వయం చేసుకుని అనధికార పశువుల వధను అరికట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ చట్టాలు, నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సమీప పోలీస్ అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. జంతు సంరక్షణ, గోవధ నిషేధ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి, చట్టబద్ధంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రజలకు మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

## తిరుపతి ఐఐటిలో జూన్ 6 ఓపెన్ హౌస్

**శ్రీకాళహస్తి, మే 27 ప్రభాతవార్త:** తిరుపతి ఐఐటిలో జూన్ 6న ఓపెన్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. 12 సంవత్సరాలుగా విద్యారంగంలోనూ, సామాజిక రంగంలో తమదైన శైలిలో ముందుకు వెళుతున్న ఐఐటి ఎన్నో ఒప్పందాలను చేసుకుందన్నారు. సత్ఫలితాలు సాధిస్తున్న ఐఐటిలో ఈ ఏడాది కొత్త అడ్మిషన్ల కోసం జూన్ 6 ఓపెన్ హౌస్‌ను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను రెండు విధాలుగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆన్‌లైన్, అలాగే ఓపన్ హౌస్ విధానంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. జెఇఇ అడ్వాన్స్డ్ 2026 పరీక్షల్లో అర్హత సాధించిన వారు ఓపెన్ హౌస్‌లో పాల్గొనవచ్చునని ఇక్కడ సదుపాయాలు, విద్యావిధానం, వాతావరణాన్ని పరిశీలించుకోవచ్చునని డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. తిరుపతి ఐఐటిలో ఒక్క విద్యాపరంగానే కాకుండా సామాజిక, క్రీడా రంగాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా హాజరై ఇకనకడ సదుపాయాలను పరిశీలించవచ్చునన్నారు. దేశంలోని ఐఐటిలతో పోటీ పడుతూ సామాజిక కార్యక్రమాలతో మమేకమౌతున్న అంశాలను ప్రత్యక్షంగా చూసి క్యాంపస్‌ను ఎంపిక చేసుకోవచ్చునని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.

## ఆకివీడు ఆలయ వివాదం విచారణ జులై 13కు వాయిదా

**విజయవాడ, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆకివీడు ఆలయ నిర్మాణంపై సుప్రీంకోర్టులో కమిటీ తరఫు న్యాయవాది సుయోధన్ వాదనలు వినిపించారు. గత వారం విచారణ సందర్భంగా యథాతథ స్థితి కొనసాగించాలని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ఆదేశించింది. దీంతోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. నోటీసులకు ఆలయ కమిటీ కౌంటర్ దాఖలు చేసింది. వేసవి సెలవుల్లో కేసు పూర్తి విచారణ జరపాలని సుయోధన్ కోరారు. సుప్రీంకోర్టు తిరిగి ప్రారంభమయ్యాక విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. ఆ లోపు రాష్ట్ర ప్రభుత్వం సహా ప్రతివాదులంతా కౌంటర్లు దాఖలు చేయాలని సుప్రీం ఆదేశించింది. తదుపరి విచారణను జులై 13కి వాయిదా వేసింది.

## తిరుమల ఘాట్‌లో కూలిన చెట్టు

**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం కొండల్లోని తిరుమల రెండో ఘాట్‌లో బుధవారం ఉదయం ఓ చెట్టు ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ సమయంలో వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఎప్పుడూ కిటకిటలాడే ఈ ఘాట్‌లో అదృష్టవశాత్తు చెట్టుకూలిన సమయంలో వాహనాలు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.ప్రాణనష్టం కూడా జరగలేదు. కూలిపోయిన చెట్టును వెంటనే తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూశారు.



# అనంతలో గంజాయిపై ఉక్కుపాదం

● 7 కిలోల గంజాయి స్వాధీనం ● 14 మంది గంజాయి విక్రేతల ముఠా అరెస్ట్

**అనంతపురం క్రైమ్ మే 27 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా పోలీసులు గంజాయి విక్రేతలపై ఉక్కు పాదం మోపారు ఏకంగా 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 మంది గంజాయి విక్రేతల ముఠాను అరెస్టు చేశారు. వీరిలో ఒక కింగ్ పిన్ సహా ఐదుగురు పాతనేరస్తులు ఉన్నారు. మిగితా 9 మంది గంజాయిని పాకెట్ల రూపంలో స్థానికంగా విక్రయిస్తున్నవారు వున్నారు. తీగలాగితే డొంక కదిలిన వైనంగా గంజాయి టెస్టింగ్ కిట్లు ద్వారా అనంతపురంలో భారీగా టెస్టులు నిర్వహించారు. పలువురికి పాజిటివ్ రావడంతో వారిపై ప్రత్యేక పోలీసు నిఘా విచారణ చేపట్టారు. వీరి విచారణ ఆధారంగానే గంజాయి సేవించే వారిని గుర్తించి కౌన్సెలింగ్ పరివర్తనకు పోలీసుల ప్రయత్నం చేసారు. గంజాయి ఎవరు విక్రయిస్తున్నారు, సరఫరా/అక్రమ రవాణా ఎవరు చేస్తున్నారు? ఎక్కడి నుండి తెస్తున్నారనే కోణంలో ఎస్పీ కనుసన్నలలో లోతైన విచారణ జరిపారు. టెస్టింగ్ కిట్ల ద్వారా నిందితులను వేటాడిన పోలీసులు గంజాయి ముఠా గుట్టురట్టు చేసిన వివరాలు జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడించారు.

**గంజాయి టెస్టింగ్ కిట్లతో కదిలిన డొంక:** జిల్లాలో గంజాయి నిర్మూలనకు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు వినూత్నంగా "గంజాయి టెస్టింగ్ కిట్లను" రంగంలోకి దించారు. నగరంలో పలువురు అనుమానితులకు ఈ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించినట్లు పాజిటివ్ అని తేలింది. దీనిని తీగలాగితే డొంక కదిలిన వైనంగా మార్చుకుంటూ, పాజిటివ్ వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టి పోలీసులు లోతుగా విచారించారు. ఈ విచారణ ఆధారంగానే గంజాయి సేవించే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్‌తో పాటు అసలు గంజాయిని ఎక్కడి నుండి తెస్తున్నారు, ఎవరు సరఫరా చేస్తున్నారనే కోణంలో విచారించి ఈ 14 మంది ముఠా గుట్టురట్టు చేశారు.

## ఆర్‌టిసి బస్సు- జెసిబి ఢీ: 20 మందికి గాయాలు

**కోవూరు (నెల్లూరు), మే 27, ప్రభాతవార్త:** కోవూరు మండలం పడుగుపాడు సమీపంలోని టాటా షోరూమ్ వద్ద బుధవారం మధ్యాహ్నం తృటిలో తప్పింది. పడుగుపాడు ప్రాంతంలో రోడ్డు పనులు చేస్తున్న జేసీబీని కావలి నుంచి నెల్లూరు వైపు వస్తున్న నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి వేగంగా జేసీబీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ కె. బాల వెంకయ్య క్యాబిన్‌లోనే ఇరుక్కుని తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు ఎట్టకేలకు శ్రమించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్ ద్వారా నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై ముత్యాలరావులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన 12 మందిని రెంబు అంబులెన్స్‌ల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో 6మంది ఆటోలో చికిత్స నిమిత్తం కోవూరుకు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. కావలి నుంచి నెల్లూరుకు వస్తున్న ఈ బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ నిద్రమత్తుకు గురికావడంతో బస్సును అదుపు చేయలేక రోడ్డు పనులు చేస్తున్న జేసీబీని ఢీకొట్టడం జరిగింది. ఈ ప్రమాదం కారణంగా మినీ జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు వేగంగా రావడం దానిని అదుపు చేయలేకపోవడంతో రోడ్డు పనులు చేస్తున్న జేసీబీని ఢీకొట్టడం జరిగిందని, దీంతో బస్సు డ్రైవర్‌కు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు

● శాస్త్రీయ విద్యా విధానం లక్ష్యంగా పిడిఎస్‌యు పోరాటం: రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్

**తిరుపతి, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా శాస్త్రీయ విద్యా విధానం, సమసమాజ స్థాపనే లక్ష్యంగా పిడిఎస్‌యు పనిచేస్తుందని, దీనికి ఆకర్షితులై వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు ఇందులో చేరడం జరుగుతోందని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ చెప్పారు. బుధవారం తిరుపతి నారాయణపురంలోని ఐఎఫ్టియు కార్యాలయంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎస్.జాకీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయికుమార్, నరసింహులు, రెడ్డి రామ్, శ్రీరామ్, వెంకట తేజాలు పిడిఎస్‌యులో చేరారు. వీరికి పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు కె. భాస్కర్ విద్యార్థి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వంగా విద్యా వ్యవస్థను మంత్రి లోకేష్ భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. యువగళంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన ఒక హామీని కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవడానికి బదులు నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘం నేతలు నేడు పిడిఎస్‌యులో చేరడం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఆయన అన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్ జాకీర్, ప్రధాన కార్యదర్శి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖలో అవినీతి అక్రమాలు పెరిగిపోతున్నాయని ఏ శాఖలో అవినీతి జరిగినా ప్రశ్నించే డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ విద్యారంగ వ్యవస్థలోని ఈ దుష్పరిణామాలను ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు.

# నీటి కుంటలో మునిగి ముగ్గురు పిల్లలు మృతి

**రొద్దం, మే 27 ప్రభాతవార్త:** రొద్దం మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామంలో నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి వివరాలకు వెళ్తే అజయ్ రెడ్డి కల్పన దంపతులకు ఇద్దరు కొడుకులు దరహాసిరెడ్డి (12) హార్షిత్ రెడ్డి (10) ఇద్దరు కొడుకులు శ్రీదేవి కి సృజనా రెడ్డి (11) సం ముగ్గురు కలిసి గ్రామ సమీపంలో వీర చిన్నయ్య స్వామి గుడి దగ్గర నల్ల నేరేడు పండ్లు చెట్టు దగ్గరికి వెళ్లి అక్కడ నేరేడు పండ్లు తిని పక్కనే ఉన్న నీటి కుంటలో సరదాగా నీళ్లలో ఆడుకుందామని పోవడం జరిగింది కుంటలో నీరు ఎక్కువ ఉండడంతో ఒకరి తర్వాత ఒకరు నీళ్లలో మునిగిపోవడం జరిగింది విషయం తెలుసుకొని గ్రామస్తులు తల్లిదండ్రులకు విషయం తెలియజేయడం జరిగింది ఒకే ఇంటిలో ఇద్దరు మరొక కుటుంబంలో ఒకరు ఉన్న కొడుకులను పోగొట్టుకొని ఆ తల్లిదండ్రులు ఆవేదన రోధిస్తుంటే గ్రామం మొత్తం కంటతడి పెట్టింది ఇలాంటి సంఘటనలు ఎక్కడ ఎవరికి రాకూడదని గ్రామస్తులు బంధువులు ఆ తల్లిదండ్రులను ఎంత ఓదార్చిన తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయం తెలిసిన వెంటనే మంత్రి సవిత స్పందిస్తూ చిన్నారుల దుర్మరణం బాధాకరమని బిడ్డలు కోల్పోయిన తల్లిదండ్రుల కడుపుకోత ఎవరు తీర్చలేనిది ఒకే గ్రామంలో ముగ్గురు పిల్లలు చనిపోవడం చాలా దురదృష్టకరమని చనిపోయిన పిల్లల కుటుంబాలకు అండగా ఉంటామని సెలవుల దృష్ట్యా చిన్నారుల కదలికలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని నీరు ఉన్న పరిసర ప్రాంతాలకు పిల్లలను వెళ్లకుండా కట్టడి చేయాలని ఈ కష్టాన్ని నష్టాన్ని ఎవరూ పూడ్చలేనని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

## 'బక్రీద్ పండగ సందర్భంగా ఆవులను కుర్బాని ఇవ్వొద్దు'

**అనంతపురం, మే 27 ప్రభాతవార్త బ్యూరో:** పవిత్ర బక్రీద్ పండగను పురస్కరించుకొని గొర్రెలు, మేకలు, ఒంటెలను కుర్బానీ ఇవ్వవచ్చని, గోవధ వివాదాలను ఫుల్ స్టాప్ పెట్టేందుకు గోవులను కుర్బానీ ఇవ్వవద్దని యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. హిందూ సాంప్రదాయాల్లో పవిత్రంగా భావించి గోపూజ చేస్తున్నందున గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేసింది. బుధవారం అనంతపురంలో విలేకరుల సమావేశంలో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ మత సామరస్యం దేశ సౌభ్రాతృత్వం పరస్పర గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులు ఆవును గోమాతగా, లక్ష్మీ స్వరూపంగా అత్యంత పవిత్రంగా పూజిస్తారు. అలాగే చాలా రాష్ట్రాల్లో గోవధపై చట్టపరమైన నిషేధాలు కూడా ఉన్నాయన్నారు. యునైటెడ్ జాయింట్ ఆక్షన్ కమిటీ చేస్తున్న ప్రతిపాదన ఏమంటే దేశంలో గోవధ వివాదాలకు పూర్తిగా ముగింపు పలకడానికి, భారత ప్రభుత్వం ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తోంది.

ఈ కార్యక్రమంలో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జాఫర్ సాబ్, మాజీ మేయర్ వసీం, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, మైనారిటీ ఎక్స్‌ప్రెస్ ఎడిటర్ బాబాషా, టీడీపీ నాయకులు జేఎం బాషా, వైసీపీ నాయకులు ఇషాక్, గరీబ్ క దర్ద్ జీలాన్, జమైత్ ఇస్లామీ నగర జనరల్ సెక్రటరీ హాజీపీరా, షఫీ, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు హైవే మొబైల్స్ నిరంతర పెట్రోలింగ్

● ఐదు మొబైల్ ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ వాహనాలకు ప్రత్యేక భద్రతా సామగ్రి అందజేత

**తిరుపతి, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం తిరుపతి, తిరుమలకు దేశం నలుమూలల నుండి వచ్చే యాత్రికుల, జిల్లా ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు తిరుపతి జిల్లా పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. తిరుపతికి వచ్చే ప్రధాన జాతీయ మార్గాల్లో ఐదు మొబైల్ ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ వాహనాల సిబ్బందికి సేఫ్టీ రిఫ్లెక్టివ్ జాకెట్లు, ట్రాఫిక్ బాటన్ లైట్లు, సేఫ్టీ ట్రాఫిక్ కోన్స్, రేడియం రిఫ్లెక్టివ్ టేప్ రోల్స్, రాపిడ్ డ్రగ్ టెస్టింగ్ కిట్లతో పాటు వాటర్ బాటిల్స్, సన్ గ్లాసెస్, క్యాప్స్, టార్చ్ లైట్స్ తదితర సామగ్రిని అందజేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే 43 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అందులో 20 ప్రాంతాల్లో ఇప్పటికే స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, రేడియం సూచికలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

రాత్రి వేళల్లో రహదారులపై నిలిపివేసే భారీ వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో హైవే మొబైల్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిలిచిపోయిన వాహనాలను వెంటనే పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాయని వెల్లడించారు. ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రాక్టర్లు, ట్రాలీలు భారీ వాహనాలకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అమర్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు భద్రత గంజాయి నియంత్రణ చర్యల కోసం రూ.15 లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో సుమారు 10వేల గంజాయి టెస్టింగ్ కిట్లను కొనుగోలు చేసి అన్ని పోలీస్ స్టేషన్లకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా పోలీస్, రెవెన్యూ, రవాణా నేషనల్ హైవే అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ముమ్మర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో గుర్తించిన 48 బ్లాక్ స్పాట్లను ఉన్నతాధికారుల బృందం స్వయంగా పరిశీలించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టిందని, మెజారిటీ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని వెల్లడించారు. తిరుపతి పవిత్ర పుణ్యక్షేత్ర ప్రతిష్ఠను కాపాడేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని, ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి, డిఎస్పీ గీతాకుమారి, భక్తవత్సలం, కొండయ్యనాయుడు పాల్గొన్నారు.



## మళ్లీ తెరపైకి కల్తీ నెయ్యి వ్యవహారం

# ఏడుగురిపై ప్రభుత్వం చర్యలు

**తిరుమల, మే 27 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా, వినియోగం చేసిన పాపంలో విచారణ సంస్థలు తమ నివేదికలు అందజేశాయి. 2019-24 మధ్యకాలంలో టిటిడి నిబంధనలకు విరుద్ధంగా నెయ్యి కొనుగోలు చేయడానికి, సరఫరాకు టెండర్లు పిలవడం, అర్హత లేకున్నా ఖరారు చేయడం వంటి లోపాల్లో కొందరు అధికారుల ప్రమేయంపై నివేదికల్లో స్పష్టం చేసాయి. ఇప్పటికే సిట్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇఒ ఎకె సింఘాల్‌ను బదలీ చేసింది. ఇంకా కొందరు అధికారుల పైనా చర్యలు తీసుకుంది. ఇప్పుడు సిట్ నివేదికల ఆధారంగానే మరో ఏడుగురు అధికారుల తప్పిదాలపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. లడ్డూలకు కల్తీ నెయ్యి పంపిన వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వైష్ణవీ డెయిరీతో కుమ్మక్కైన ఏడుగురు కార్మిక శాఖ అధికారులపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. కార్మిక శాఖ ఫ్యాక్టరీస్ బాయిలర్స్ శాఖ నిబంధనలు, రాష్ట్ర పౌరసేవల ప్రవర్తనా నియమాలు 1964, ఎపిసిఎస్ నిబంధనలు 1991 అనుసరించి అభియోగాలు నమోదు చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు అధికారులు తమపై వచ్చిన ఆరోపణలపై పది రోజుల్లోగా లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

నెయ్యి సరఫరాలో అక్రమాలకు పాల్పడిన వైష్ణవీ డెయిరీకి టిటిడి అధికారులతోపాటు ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులు సహకరించినట్టు వెల్లడైంది.

తనిఖీల సమయంలో లోపాలను గుర్తించకుండా ఈ అధికారులు డెయిరీ సంస్థకి సహకరించినట్లు తేలింది. డెయిరీకి సహకరించిన ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది.

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా పని చేసి విశ్రాంతి అయిన కర్రి పరమేశ్వరరావు, విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.సత్యనారాయణ, ప్రస్తుతం ఏలూరులో బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎంవీఎల్ నరసింహరాజు, నెల్లూరులో బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న టి.సుష్మా, తిరుపతిలో బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న పి.రాంబాబు, చిత్తూరు, నెల్లూరులో బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎన్.శివశంకరరెడ్డి, నెల్లూరులోని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పనిచేసి విశ్రాంతి అయిన బి.రమేశ్‌బాబుపై ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. ఈ అభియోగాలకు సంబంధించి పది రోజుల్లోగా లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. దీనిపై మరి వెలువడనున్న సమాచారంపై మరికొంత మందిపై చర్యలకు సిద్ధమవుతోంది.



# చింతకాయల విజయ్‌కు రాజ్యసభలో స్థానం కల్పించాలి

**మాకవరపాలెం టీడీపీ మినీ మహానాడులో ఏకగ్రీవ తీర్మానం**

మాకవరపాలెం మే 27 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మాకవరపాలెంలో ఘనంగా మినీ మహానాడు నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షులు ఆర్.వై.పాత్రుడు ఆధ్వర్యంలో దివంగత నేత టిడిపి వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యకర్తలు నాయకులు సమక్షంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈమేరకు 8వ పేజీలో

# నర్సీపట్నంలో ఘనంగా హైబ్రిడ్ మహానాడు..

**సీనియర్లకు సత్కారం -పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన నాయకులకు తగిన గుర్తింపు : టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్**





8లో

# కార్యకర్తలతో కలిసి మహానాడు వీక్షణ

**వివిధ క్లస్టర్లలో ఏర్పాట్లు పరిశీలించిన గంటా**



8లో



## మహానాడును ఆడబిడ్డలకు

# అంకితం చేస్తున్నాం..

**ఏపీటీడీపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు -వర్చువల్ విధానంలో మహానాడు -2026 ప్రారంభం -రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలే లక్ష్యం**

గాజువాక,మే 27,ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ లీడర్లు, కార్యకర్తల ఐక్యతను చాటుకునే వేదిక మహానాడు అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. మహానాడు–2026 మొదటి రోజు సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా పొదుపు చర్యలు చేపట్టిన నేపథ్యంలో, ఈసారి మహానాడును పూర్తి డిజిటల్ మాధ్యమంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ల నుంచి నేతలు, కార్యకర్తలతో పాటు అండమాన్ నికోబార్, విదేశాల నుంచి కూడా కేడర్ వర్చువల్‌గా హాజరవుతున్నట్లు తెలిపారు. మొన్నటి ఎన్నికల విజయంలో మహిళలదే కీలక పాత్ర అని.. అందుకే ఈ మహానాడును ఆడబిడ్డలకు అంకితం చేస్తూ 'మహిళా మహానాడు'గా ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం 'స్త్రీ శక్తి' కింద ఉచిత బస్సు ప్రయాణం, 'దీపం 2.0' ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తోందన్నారు. గత 8వ పేజీలో

# యువతకు పెద్దపీట వేస్తూ.. భవిష్యత్ రాజకీయాలకు టీడీపీ సిద్ధం

**ప్రజల కోసం పనిచేసే పార్టీగా తెలుగుదేశం చిరస్థాయిగా నిలుస్తుంది : విశాఖ ఎంపీ శ్రీభరత్**







8లో

# విచ్ఛిన్నకర శక్తుల పట్ల కూటమి నాయకులు అప్రమత్తంగా ఉండాలి..

**తప్పుడు ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.. అవసరమైతే అరెస్టులు కూడా ఉంటాయి : ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

విశాఖపట్నం, ప్రభాతవార్త

విశాఖపట్నంలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాలుగు రోజుల పాటు జరగనున్న "మ్యాంగో మేళా" పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మే 28, 2026 గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతున్న మ్యాంగో మేళా ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన–బీజేపీ సంబంధాలపై ఇటీవల ఒక రాజకీయ విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలను తిరిగి వెనక్కి తీసుకున్నారని తెలిపారు. కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు కొంతమంది కావాలనే మైండ్ గేమ్స్ ఆడుతున్నారని ఆరోపించారు. "కూటమిని 8వ పేజీలో




## ఓటర్ల జాబితా నవీకరణకు

# రాజకీయ పార్టీలు సహకరించాలి

**ప్రతి బూత్ పరిధిలో రాజకీయ పార్టీలు బిఎల్ఏను నియమించాలి : కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**



విశాఖపట్నం–ప్రభాతవార్త

స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ వి.అభిషిక్త్ కిషోర్ కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని, అనర్హులులేకుండా చూడాలని ఎన్నికల సంఘం ఖచ్చితమైన, నవీకరింపబడి ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండేందుకు సర్ కార్యక్రమం చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 2002లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగిందని, 23 సంవత్సరాల తరువాత ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎన్నికల సంఘం పట్టిందన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలన్నీ తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. రాజకీయ పార్టీలు ప్రతి బూత్‌కు ఒక బిఎల్ఏను నియమించాలని, ఆ బిఎల్ ఏ బూత్ పరిధిలో ఓటరుగా నమోదయి ఉండాలని లేదా ఆ నియోజకవర్గంలో ఓటర్‌గా నమోదయి ఉండాలని తెలిపారు. బిఎల్ఎలను, బిఎల్ఓను అనుసంధానం చేస్తామని, జూన్ 2వ తేదీలోగా బిఎల్ఎల్‌తో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటికి బిఎల్‌వో వచ్చి ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తారని, దీూా వచ్చినప్పుడు కుటుంబంలో ఎవరూ లేకపోతే మూడుసార్లు ఆ గృహానికి వస్తారని ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బిఎల్ఓలు సమావేశాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గస్థాయిలో సమావేశం జరుగుతున్నట్లు ముందుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిసే విధంగా నోటీసులు ఇవ్వాలని ఈఆర్వోలకు సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు. నియోజకవర్గ ఇ ఆర్వోలు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి లోడగల కృష్ణ, బిజెపి ప్రతినిధి పరశు రామరాజు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సుధాకర్, బీఎస్పీ తరపున శివప్రసాదరావు, సిపిఐ ప్రతినిధి వి కృష్ణారావు, సిపిఎం తరపున జ్యోతిశ్వర రావు, వైయస్సార్సీపి తరపున రవికుమార్ జనసేన తరపున దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## రూ.64 కోట్ల పనోరమ హిల్స్ వీఎల్‌టీ ఎగవేతపై

# జీవీఎంసీకి లోకాయుక్త నోటీసులు!

**జూలై 27న స్వయంగా హాజరు కావాలంటూ జీవీఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు**

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త

మధురవాడలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం పరిధిలో ఉన్న పనోరమ హిల్స్‌కు సంబంధించి రూ.64కోట్ల విలువైన వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) ఎగవేతకు సంబంధించిన బాగోతంపై కదలిక వచ్చింది. ఆ సంస్థ వీఎల్‌టీ ఎగవేతపై జీవీఎంసీకి లోకాయుక్త నోటీసులు జారీ చేసింది. అంతేకాకుండా జూలై 27న స్వయంగా హాజరు కావాలంటూ జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది. రెవెన్యూ అధికారులు మనోరమ హిల్స్ వ్యవహారంలో భారీగా మామూళ్ళు తీసుకుని 8వ పేజీలో

# ఎన్టీఆర్ ఆశయాల సాధనే టీడీపీ లక్ష్యం

**-మహానాడు కార్యక్రమాన్ని వీక్షించిన విశాఖ తూర్పు టీడీపీ నేతలు**

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాప కుడు ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే పార్టీ ప్రధాన లక్ష్యమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మహానాడు సంద ర్భంగా విశాఖ టీడీపీ కార్యాల యంలో విశాఖ తూర్పు నియో జకవర్గానికి చెందిన క్లస్టర్–10 ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్, ప్రధాన కార్యదర్శి లోడగల కృష్ణ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌లో మహానాడు కార్యక్రమాన్ని వీక్షించారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై మహానాడులో నాయకత్వం ఇచ్చిన దిశానిర్దేశం కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చిందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ నక్క కనకరాజు, పైడిరాజు, ఉసిరికాయల డిల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ సైన్స్ లెక్చరర్లగా ముగ్గురుకి పదోన్నతి

**కెజీహెచ్‌లో నియామకం**



9లో

# వార్డుల్లో దాహం కేకలు..

## 'గ్రేటర్' సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో



# కోట్ల దోపిడీ?

**నీటి సరఫరా విభాగంలో అవినీతి ఆరోపణలు..**

**ప్రజలకు మాత్రం నామమాత్ర సేవలు -వారం రోజుల్లో ముగిసే వేసవి క్రీడలకు నీటి సరఫరా పేరిట రూ.75 లక్షల టెండర్లా?**

8లో

## తీవ్ర ఆస్తమా నివారణకు మెడికవర్ బయోలాజిక్స్‌తో నూతన చికిత్స



ఆరిలోవ, మే27, ప్రభాతవార్త

తీవ్ర ఆస్తమాతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు ఇప్పుడు ఆధునిక వైద్య రంగం కొత్త ఆశను అందిస్తోంది. సాధారణ ఇన్హేలర్లు, మందులు తీసుకున్నప్పటికీ తరచుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రాత్రిపూట దగ్గు, అత్యవసర ఆసుపత్రి చికిత్సలు ఎదుర్కొనే రోగుల కొరకు బయోలాజిక్స్ అనే ప్రత్యేక చికిత్స మెడికవర్ ఆసుపత్రి అందిస్తోంది. బయోలాజిక్స్ అనేవి శరీరంలో ఆస్తమా తీవ్రతకు కారణమయ్యే ప్రత్యేక ఇన్‌ఫ్లమేటరీ మార్గాలను లక్ష్యంగా చేసుకుని పనిచేసే ఆధునిక ఇంజెక్షన్ మందులు. ఇవి రోగులలో శ్వాసకోశ వాపును తగ్గించి, ఆస్తమా దాడుల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో సహాయ పడుతున్నాయని మెడివవర్ ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికవర్ పల్మనాలజీ చీఫ్ డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఆస్తమా లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా, నిరంతర దగ్గు, ఊపిరి ఆడకపోవడం, ఛాతిలో బిగుతు వంటి సమస్యలు ఉంటే వెంటనే శ్వాసకోశ నిపుణులను సంప్రదించాలని మెడికవర్ వైద్యులు సూచించారు. తీవ్రమైన ఆస్తమాపై అవగాహన పెంపొందించడం ద్వారా అనేక మంది రోగులకు ఆరోగ్యకరమైన జీవితం అందించవచ్చున్నారు. అస్తమా నివారణ వైద్యంపై తమ క్లినిక్ ద్వారా అందరికీ అవగాహనా తో కూడిన వైద్యం అందిస్తామని పల్మోనాలజీ వైద్యుల బృందం డా. సత్య పద్మజ మంత, డాక్టర్ మోనిషా సిల్లా, డాక్టర్ సుధీర్ టేల్, యూనిట్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ తెలియజేసారు.

## ఐదవ వార్డులో ఘనంగా టీడీపీ మహానాడు వేడుకలు

పిఎం పాలెం, మే 27, ప్రభాతవార్త



తెలుగు దేశం పార్టీ 44వ వసంతాల మహోత్సవ మహానాడు వేడుకలు జీవీఎంసీ 5వ వార్డు పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. మధురవాడ కొమ్మాది జంక్షన్‌లోని సాయి సూర్య ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమం పసుపు పండుగ వాతావరణాన్ని తలపించింది. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ మహానాడు వేడుకలకు జీవీఎంసీ 5వ వార్డు క్లస్టర్-10 ఇంచార్జ్ మొల్లి లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యం వహించారు. కార్యక్రమం ప్రారంభంలో నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో జరుగుతున్న మహానాడుకు పార్టీ కార్యకర్తలు, తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జూమ్‌లో ప్రత్యక్ష ప్రసారమైన మహానాడు కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మొల్లి హేమలతతో పాటు వాండ్రాసి అప్పలరాజు, నాగోతి వెంకట సత్యనారాయణ, ఈగల రవి, నమ్మి శ్రీను, బోయి వెంకటరమణ, రమాదేవి, చలుమూరి భారతి శ్రీనివాస్, నాగోతి అనిత, నమ్మి సూర్య అప్పారావు తదితర నాయకులు, మహిళా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానాడులో మహిళా శక్తికి పెద్దపీట



పిఎం పాలెం, మే 27, ప్రభాతవార్త

తెలుగు దేశం పార్టీ మహానాడులో మహిళలకు రాజకీయంగా 33 శాతం ప్రాధాన్యత కల్పిస్తామని మంత్రి నారా లోకేష్ చేసిన చారిత్రాత్మక ప్రకటనపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు హర్షం వ్యక్తం చేశారు. మధురవాడలోని ఆర్ఆర్ గ్రాండ్‌లో బుధవారం జరిగిన 6వ వార్డు తెదేపా మహానాడు వర్చువల్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా సాధికారతకు, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యానికి తెదేపా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే గంటా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని కొనియాడారు. అమరావతి వేదికగా జరుగుతున్న మహానాడు కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. వార్డు క్లస్టర్ ఇంచార్జ్, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు గరే గురునాథ్, పర్యవేక్షణలో జరిగిన ఈ మహానాడు కార్యక్రమం పార్టీ శ్రేణుల సమైక్యతను చాటుతూ విజయవంతంగా సాగింది. రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనంద్ బాబు, జీవన్ కుమార్, వార్డు కార్యదర్శి లొడగల జానకిరామ్, యువ నాయకులు మన్యల సురేష్, పోతిన రఘు, నాగోతి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

## ఏడవ వార్డులో పండగ వాతావరణంలో మహానాడు

పిఎం పాలెం, మే 27, ప్రభాతవార్త



జీవీఎంసీ ఏడవ వార్డు పరిధిలోని ఉడారోడ్డు రమ్య పేరడైజ్‌లో తెలుగు దేశం పార్టీ వర్చువల్ మహానాడు కార్యక్రమం పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. క్లస్టర్-12 ఇంచార్జ్ పిల్లా వెంకటరావు, మాజీ కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రసారమైన మహానాడు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై వీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు చేసిన ప్రసంగాలను కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పిల్లా వెంకటరావు, పిల్లా మంగమ్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తలతో కలిసి మహానాడు వీక్షణ

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త

నియోజకవర్గంలో వివిధ క్లస్టర్లలో బుధవారం జరిగిన మహానాడు కార్యక్రమాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించారు. భీమిలి సహా తగరపువలస, జీవీఎంసీ 6వ వార్డు తదితర ప్రాంతాల్లో పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మై టీడీపీ యాప్ ద్వారా డిజిటల్ హాజరు వేసుకున్నారు. మహానాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగాలను కార్యకర్తలతో కలిసి వీక్షించారు. పార్టీ నిర్దేశించిన విధంగా కార్యక్రమ నిర్వహణ జరగాలని స్థానిక క్లస్టర్ బాధ్యులకు సూచించారు. మహానాడులో పాల్గొన్న వారికి ఏర్పాటు చేసిన భోజన పదార్థాలను పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే మహానాడుకు హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. టీడీపీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, చురకల రమణ, పొట్నూరు రాము, మాన్యాల సోంబాబు, గరే గుర్నాథ్, పోలిశెట్టి నాగేశ్వరరావు, లొడగల జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహణ

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త




విశాఖ పట్టణం జిల్లా చినగదిలి మండలం పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించేందుకు ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఎంపీయూపీ పాఠశాల లక్ష్మీవానిపాలెం, పరిసర క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీయూపీ స్కూల్ లక్ష్మీవానిపాలెంలో ఏడుగురు విద్యార్థులకు కొత్తగా ప్రవేశాలు కల్పించారు. ఎంఈఓ-2 సీహెచ్ రవీంద్రబాబు, సీఆర్పీ రాంబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖాధికారి కె. విజయభాస్కర్ సూచనల మేరకు జెడ్పీహెచ్ స్కూల్ చంద్రమ్పాలెం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ మెరుగైన సౌకర్యాలు, నైపుణ్యంతో కూడిన బోధన అందుతున్నదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని సూచించారు. తదనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ స్కూల్ చంద్రమ్పాలెం హెచ్ఎం మోదుగు లోకనాథరావు, ఎంపీపీ స్కూల్ లక్ష్మీవానిపాలెం హెచ్ఎం, ఇంగ్లీష్ సబ్జెక్ట్ హెడ్ ఎస్ఆర్ఎన్ రత్నవల్లి, కె. లూథియా, పి. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల్లో దాహం కేకలు..

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

వేసవి తీవ్రతతో నగర ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో "సమ్మర్ యాక్షన్ ప్లాన్" పేరిట కోట్ల రూపాయల ప్రజాధనం దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర పనుల పేరుతో భారీ అంచనాలు సిద్ధం చేసి, ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టి అధికారులు-గుత్తేదారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని పంచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద దాదాపు రూ.8.40 కోట్ల పనులకు ఆమోదం లభించినట్లు సమాచారం. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అనేక వార్డుల్లో నీటి ఎద్దడి తీవ్రంగానే కొనసాగుతోంది. కొండవాలు ప్రాంతాలు, నీటి కొరత ఉన్న కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా కూడా నామమాత్రంగానే జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### జోన్ల వారీగా కోట్ల రూపాయల పనులు

10 జోన్ల పరిధిలో 91 పనులకు రూ.840.16 లక్షల అంచనాలతో ఆమోదం లభించింది. ఇందులో అత్యధికంగా అనకాపల్లి జోన్‌కు రూ.1.58 కోట్లు, తూర్పు జోన్‌కు రూ.1.45 కోట్లు, గాజువాక జోన్‌కు రూ.1.11 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే పనులు ఎక్కడ జరుగుతున్నాయో ప్రజలకు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ కోతల కారణంగా మోటార్లు కాలిపోయాయంటూ అత్యవసర మరమ్మతుల పేరిట లక్షల రూపాయల బిల్లులు తయారు చేసి ప్రజాధనాన్ని దోచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు నిర్వహిస్తున్నారని కూడా విమర్శలు ఉన్నాయి.

### కాలువల పూడికతీతల్లోనూ భారీ అక్రమాలా?

వర్షాకాలానికి ముందు నగరానికి నీటి సరఫరా చేసే కాలువల పూడికతీత పనుల పేరుతో కూడా కోట్ల రూపాయల అంచనాలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఓ రాజకీయ నేతకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్‌కే ఈ పనులు దక్కేలా వ్యవహారం నడుస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "సిల్ట్ తొలగింపు" పేరుతో భారీగా నిధులు మాయం చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### పోస్టింగులకే లక్షల ముడుపులా?

నీటి సరఫరా విభాగంలో పోస్టింగుల కోసం ఏఈ నుంచి ఎస్ఈ స్థాయి వరకు భారీగా ముడుపులు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో పని చేయడానికి ప్రత్యేక ఆసక్తి ఉండటానికి కారణం అవినీతి అవకాశాలేనని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో ఈ విభాగంపై ఏసీబీ దాడులు జరిగినప్పటికీ పరిస్థితి మారలేదన్న విమర్శలు ఉన్నాయి.

### వేసవి క్రీడలకు నీటి సరఫరా పేరిట రూ.75 లక్షల టెండర్లు

ఇక తాజాగా మరో వివాదం తెరపైకి వచ్చింది. మరో వారం రోజుల్లో ముగియనున్న వేసవి క్రీడా శిబిరాలకు నీటి సరఫరా పేరుతో రూ.75 లక్షల అంచనాలతో షార్ట్ టెండర్లు పిలవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ నెల 24న టెండర్ పిలిచి, 26 వరకు మాత్రమే గడువు ఇవ్వడం వెనుక భారీ కమిషన్ వ్యవహారం ఉందని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. 486 ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడా శిబిరాలకు నీరు అందించేందుకు ఈ టెండర్ పిలిచినప్పటికీ, టెండర్ ప్రక్రియ పూర్తయ్యేలోపు శిబిరాలే ముగిసే పరిస్థితి నెలకొంది. కొంతమంది ఎంపిక చేసిన కాంట్రాక్టర్లకే ముందస్తు సమాచారం ఇచ్చి, నామమాత్రంగా కొన్ని రోజులు నీటి సరఫరా చేసి లక్షల రూపాయల బిల్లులు చేసుకునేలా ప్రణాళిక రచించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రజలకు నీళ్లు లేవు.. అవినీతి మాత్రం ఉప్పొంగుతోంది..

దాదాపు 30 లక్షల మందికి తాగునీరు అందించే కీలక విభాగంలో పారదర్శకత లేకపోవడం, ప్రజలకు సరిపడా నీటి సరఫరా అందకపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అవినీతి మరింత పెరిగిందని, ప్రజల ప్రాథమిక అవసరమైన తాగునీటిపైనా అక్రమాలు జరుగుతున్నాయని కాలనీల ప్రజలు మండిపడుతున్నారు.

## రూ.64 కోట్ల పనోరమ హిల్స్ వీఎల్‌టీ ఎగవేతపై..

7వ పేజీ తరువాయి ..

జీవీఎంసీకి దక్కాల్సిన వీఎల్‌టీకి గండి కొట్టారంటూ గతంలో పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఇదిలా ఉంటే దీనిపై స్పందించిన సమాచార హక్కు యాక్టివిస్ట్ రెడ్డి వెంకట్రావు జీవీఎంసీ స్పందనలో అదే నెల 29న ఒక వినతి సమర్పించారు. పనోరమ హిల్స్ వ్యవహారంలో జీవీఎంసీకి దక్కాల్సిన వీఎల్‌టీ వసూలు చేసి, కార్పొరేషన్‌కు జమ చేయాల్సిందేనని వినతిపత్రం అందజేశారు. అయితే వినతిపత్రం స్వీకరించిన అప్పటి అధికారులు, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదికిచ్చామని, వీఎల్‌టీ ఎగవేతకు సహకరించిన రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామంటూ వెంకట్రావుకు లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. అయినప్పటికీ బాధ్యులపై చర్యలు చేపట్టలేదు.

### మరోసారి లోకాయక్తకు..

దీంతో ఆర్టీఏ యాక్టివిస్ట్ రెడ్డి వెంకట్రావు, లోకాయుక్తలో ఈ వ్యవహారంపై పిటిషన్ (కేసు నెంబర్ 3384/2024) వేశారు. ప్రస్తుతం ఇది లోకాయుక్తలో నడుస్తోంది. ఇదిలా ఉంటే పనోరమ హిల్స్ వీఎల్‌టీకి సంబంధించి జీవీఎంసీ అధికారులు లోకాయుక్తకు తప్పుడు సమాచారాన్ని అందజేస్తుండడంతో సరైనసమాచారమివ్వాలంటూ లోకాయుక్త న్యాయమూర్తి జీవీఎంసీ అధికారులకు నాలుగు సార్లు వాయిదాల ద్వారా అవకాశమిచ్చారు. ఇంత జరుగుతున్నా.. ఇప్పటికీ సరైన సమాచారం అందజేయకపోవడంతో జీవీఎంసీ కమిషనర్ ఈ ఏడాది జులై 27న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని లోకాయుక్త న్యాయమూర్తి సమాన్లు జారీ చేశారు. ఈ తరుణంలో ఈ వ్యవహారం జీవీఎంసీ కమిషనర్ దృష్టికి వెళ్లకుండా కింది స్థాయి అధికారులే కమిషనర్ తరఫున లోకాయుక్త కోర్టుకు హాజరు కావాలని నిర్ణయించినట్టు తెలిసింది. దీంతో పనోరమ హిల్స్ వ్యవహారంలో జీవీఎంసీ కమిషనర్ కోర్టుకెళ్తారా, జీవీఎంసీకి వీఎల్‌టీ దక్కకుండా అడ్డుకుని, అవినీతికి పాల్పడిన ఆర్ ఐలు, ఆర్వోలు, జెడ్సీలు, డీసీఆర్, ఏడీసీలపై చర్యలు తీసుకుంటారా అన్నది వేచి చూడాల్సిందే. ఈ వ్యవహారంలో జీవీఎంసీ కమిషనర్ నిజాయితీగా వ్యవహరిస్తే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కు కోట్లాది రూపాయల ఆదాయం చేకూరే అవకాశం ఉందని కొంతమంది అధికారులే భరోసా ఇస్తున్నారు.

## చింతకాయల విజయ్‌కు రాజ్యసభలో స్థానం కల్పించాలి..

7వ పేజీ తరువాయి ..

బుధవారం మండల కేంద్రం మాకవరపాలెం శ్రీకన్య థియేటర్లో టిడిపి మినీ మహానాడు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 27,28 తేదీలలో జరిగే మినీ మహానాడు కార్యక్రమం తొలిరోజు విజయవంతంగా నిర్వహించారు. మినీ మహానాడు ఏర్పాటులో భాగంగా మాకవరపాలెంలో పండగ వాతావరణం కనిపించింది, భారీ ఫెక్సీలతో ఆ ప్రాంతమంతా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. థియేటర్ లోపల భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి అమరావతిలో పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించే మహానాడును మండల టిడిపి నాయకులు సీనియర్ కార్యకర్తలు మహిళలు నేరుగా వీక్షించే విధంగా భారీ స్కిన్ ఏర్పాటుతో మహానాడులో నేరుగా పాల్గొనే అనుభూతి కలిగిందంటూ కార్యకర్తలు మరింత ఆనందం వ్యక్తిపరిచారు. కార్యక్రమంలో ముఖ్యంగా ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనయుడు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కు రాజ్యసభకు అవకాశం కల్పించాలంటూ మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు మినీ మహానాడులో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా కరతాళ ధ్వనులతో ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా అల్లు రామునాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అయ్యన్న కుటుంబమంతా 44 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించింది అన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చింతకాయల విజయ్ 2009వ సంవత్సరం నుంచి పార్టీ అభివృద్ధి కోసం అనునిత్యం శక్తి వంచన లేకకుండా పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు ఉందన్నారు. అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థిగా మూడుసార్లు ప్రయత్నం చేసి వివిధ కారణాల వలన పార్టీ ఆదేశాల మేరకు నిబద్ధత కలిగిన కార్యకర్తలుగా విజయ్ చేసిన కృషిని పార్టీ అధిష్టానం గుర్తించాలన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న చింతకాయల విజయ్‌కి రాజ్యసభలో అవకాశం కల్పించాలని మాకవరపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో అభ్యర్థిస్తున్నట్లు, పార్టీ అధిష్టానం గుర్తించాలని నాయుడు కోరారు. మినీ మహానాడు కార్యక్రమంలో భాగంగా పరిశీలకులుగా అనకాపల్లి జిల్లా టిడిపి కార్యదర్శి లాలం కాశీనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, నర్సీపట్నం మండల టిడిపి మాజీ అధ్యక్షులు స్వామి, మినీ మహానాడు జరుగుతున్న విధానం నేరుగా పరిశీలించారు. మినీ మహానాడు ప్రారంభంలో ముందుగా తెలుగుదేశం పార్టీకి విశేషమైన సేవలు అందించి మృతి చెందిన సీనియర్ కార్యకర్తలకు సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు రుత్తల రమణమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్, పాపయ్యపాలెం మాజీ ఎంపీటీసీ వబ్బలరెడ్డి సుబ్బలక్ష్మి, తామరం సీనియర్ టిడిపి నాయకురాలు పెద్దమ్మలు తదితరులను పర్యవేక్షకుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. అమరావతి నుంచి మహానాడు నిర్వహణ సీనియర్ వక్తుల ప్రసంగాలతో మినీ మహానాడు ప్రాంగణంలో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. సుమారు 800 మంది నాయకులు, కార్యకర్తలు హాజరైన మినీ మహానాడులో వారికి అవసరమైన భోజన ఇతర సౌకర్యాలను మండల కమిటీ నిర్వహించింది. మహానాడు తరహాలో మాకవరపాలెం జరిగిన మినీ మహానాడులో అంశాలు వారిగా అభివృద్ధి కార్యక్రమాలపై పలువురు టిడిపి సీనియర్ నాయకులు ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టిడిపి సీనియర్ నాయకులు వబ్బలరెడ్డి వెంకటరమణ నిర్వహణలో పిఏసిఎస్ అధ్యక్షులు శ్రీరంరెడ్డి వెంకట చినబాబు, పోతల రాంబాబు, అల్లు రామునాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యర్రంశెట్టి వెంకటరమణ, సభలో వివిధ అంశాలపై క్షుణ్ణంగా ప్రసంగించారు. కార్యక్రమంలో లాలం రాము, రుత్తల నాని, అడిగర్ల శ్రీనివాసరావు, శ్రీరంరెడ్డి రమణ, రుత్తల నందకిశోర్, మళ్ల జైబాబు, పాసేపు సురేష్, సిద్ధాబత్తుల శీను, రుత్తల వెంకటేశ్వరరావు (జమిందార్) కేతిరెడ్డి చిరంజీవి, సబ్బవరపు వెంకటరమణ, చిరంజీవి రాజు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా హైబ్రిడ్ మహానాడు..

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త

?నర్సీపట్నంలోని పెద్ద బొడ్డేపల్లి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'హైబ్రిడ్ మహానాడు' కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులకు సముచిత గౌరవం దక్కింది. పార్టీ ఆవిర్భావం నుండి ఎలాంటి అంచనాలు లేకుండా అంకితభావంతో సేవలందించిన నాయకులను ఘనంగా సత్కరించారు. నర్సీపట్నం నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధిలోని క్లస్టర్ 7కు చెందిన ఎనిమిది మంది సీనియర్ నాయకులను టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ చేతుల మీదుగా దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి వారు చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. అనంతరం చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సీనియర్ నాయకులను గౌరవించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. కష్టకాలంలో కూడా పార్టీ జెండాను విడవకుండా మోసిన సీనియర్ల త్యాగాలు యువతరానికి ఆదర్శప్రాయమని, వారి సుదీర్ఘ అనుభవం, సలహాలు పార్టీ భవిష్యత్తుకు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందని ఆయన తెలియజేశారు.

## గాయత్రి విద్యా పరిషత్-బీఎస్ఎన్ఎల్ మధ్య అవగాహన ఒప్పందం



పిఎం పాలెం, మే 27, ప్రభాతవార్త

విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు గాయత్రి విద్యా పరిషత్ (జీవీపీ) సంస్థలు మరియు బీఎస్ఎన్ఎల్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఆధునిక టెలికాం, నెట్‌వర్కింగ్ రంగాల్లో ప్రాయోగిక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ అనుభవం కల్పించనున్నారు. అలాగే సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధన-అభివృద్ధి చర్యలు, ఉద్యోగావకాశాలపై మార్గదర్శకత్వం వంటి అంశాల్లో ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. జీవీపీకి చెందిన సీఎస్ఈ, సీఎస్ఈ (ఏఐ & ఎంఎల్), సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ), ఈసీఈ, ఈఈఈ తదితర విభాగాల బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో హ్యాండ్స్-ఆన్ శిక్షణ ఇవ్వనున్నారు. అదేవిధంగా బీఎస్ఎన్ఎల్‌లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు, టెలికమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహించనున్నారు. ఈ ఒప్పంద పత్రాలపై బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎం. సత్య ప్రసాద్, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ప్రొఫెసర్ పి. సోమరాజు సంతకాలు చేశారు. కార్యక్రమంలో జీవీపీ సంస్థల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## విచ్ఛిన్నకర శక్తుల పట్ల కూటమి నాయకులు..

7వ పేజీ తరువాయి ..

బలహీనపర్చాలని చూస్తున్న విచ్ఛిన్నకర శక్తుల పట్ల నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలు, దుష్ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అరెస్టులు కూడా జరుగుతాయి" అని హెచ్చరించారు. ముసుగు వీరులను ఎవరినీ విడిచిపెట్టబోమని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో సహా ఎవరు తప్పులు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జూన్ 1 నుంచి 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారన్నారు. అలాగే జూన్ 21 యోగా డేను ఘనంగా నిర్వహిస్తామని మాధవ్ తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 2 సంవత్సరాలలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కృషిచేయాలని పార్టీ శ్రేణులకు పీవీయన్ మాధవ్ పిలుపునిచ్చారు.

## యువతకు పెద్దపీట వేస్తూ.. భవిష్యత్ రాజకీయాలకు టీడీపీ సిద్ధం

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగే రాజకీయ పార్టీగా తెలుగు దేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల మన్ననలు పొందుతుందని విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం క్లస్టర్-9 పరిధిలోని 26వ వార్డు రామకృష్ణ నగర్‌లో బుధవారం నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భారతి మాట్లాడుతూ.. మహానేత నందమూరి తారక రామారావు తెలుగు ఆత్మగౌరవం, సమాజ సేవ లక్ష్యాలతో స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రజల ఆశయాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో రాబోయే 40 ఏళ్ల రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు. ప్రత్యేకంగా యువతకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ, భవిష్యత్ రాజకీయాలకు వారిని సిద్ధం చేసే విధంగా పార్టీ నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో యువశక్తి కీలకమని పేర్కొన్న ఆయన, ప్రభుత్వం యువత సామర్థ్యానికి పెద్దపీట వేస్తోందని, ఆ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్, సీనియర్ నేత ముక్కా ముత్యాలనాయుడు, మాజీ కార్పొరేటర్ ముక్కా శ్రావణి, 26వ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడును ఆడబిడ్డలకు..

7వ పేజీ తరువాయి ..

ఏడాది లక్ష మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్‌లుగా తయారు చేశామని, 'స్వయం ఏపీ' ద్వారా డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా వేగంగా అనుమతులు ఇస్తున్నామని పల్లా తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎస్ఐపీబీ ద్వారా 282 ప్రాజెక్టులకు రూ.11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటికి ప్రారంభోత్సవ తేదీలను కూడా ముందే ఫిక్స్ చేశామన్నారు. ఏఐ, క్వాంటం, సెమీ కండక్టర్స్ రంగాలతో పాటు ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు కూడా రాష్ట్రానికి రానుందని, తిరుపతిలో బుల్లెట్ మోటారు సైకిల్ ప్రాజెక్టు కూడా దీనికి నిదర్శనమన్నారు. పార్టీలో ఎప్పుడూ యువతకు 63 శాతం ప్రాధాన్యత దక్కుతుందని పల్లా గుర్తుచేశారు. నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ద్వారా 15,941 పోస్టులు, 5,757 కానిస్టేబుల్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ చేపట్టడమే కాకుండా, '2026 జాబ్ క్యాలెండర్' కూడా విడుదల చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీని స్వర్ణాంధ్రగా మార్చేందుకు '2047 విజన్' రూపొందించామని.. టీడీపీ కేవలం వచ్చే ఎన్నికల కోసం కాకుండా, రాబోయే తరాల భవిష్యత్తు కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## పరిశుభ్రతే ఆరోగ్యానికి మొదటి అడుగు..

**ప్రతి పౌరుడు స్వచ్ఛతకు ప్రాధాన్యతనిచ్చి దేశంలోనే ఉత్తమ పరిశుభ్ర నగరంగా విశాఖను తీర్చిదిద్దండి..మధురవాడ జోన్ వార్డు నెం.7 మార్కెట్ రోడ్డులో స్వచ్ఛ అవగాహన ర్యాలీ నిర్వహణ..పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రజలు భాగస్వాములు కావాలి. - జీవీఎంసీ మధురవాడ జోన్ జోనల్ కమిషనర్ వి.ఇప్పినాయుడు**

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త




పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి పరిశుభ్రమైన పరిసరాల పరిరక్షణకు సహకరించాలని జీవీఎంసీ మధురవాడ జోన్ జోనల్ కమిషనర్ వి. ఇప్పినాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన మధురవాడ జోన్ పరిధిలోని వార్డు నెం.7 మార్కెట్ రోడ్ ప్రాంతంలో "స్వచ్ఛ అవగాహన ర్యాలీ" ను సహాయక వైద్యాధికారి డాక్టర్ ఎల్.రాజా రవికుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వివరిస్తూ విశాఖ నగర ప్రజల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై చైతన్యం కల్పించేందుకు ఈ స్వచ్ఛ అవగాహన ర్యాలీ నిర్వహిం చినట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లో వేయాలని, తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా అందించాలని ప్రజలకు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26లో విశాఖ నగరాన్ని దేశంలోనే ఉత్తమ పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు, స్వచ్ఛతకు ప్రాధాన్యతనిచ్చి ప్రతి పౌరుడు విశాఖ నగర అభివృద్ధికి, సుందరీకరణకు సహకరించాలని కోరారు. ఏఎంఓహెచ్ డా.ఎల్. రాజా రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి కుమార్, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలు మరియు ఇతర జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SIRISOLLA KUSUMA KUMARI W/O SIRISOLLA RAJESH previously called KUNCHA KUSAMAKUMARI R/O 1-107, JAMMADEVIPETA, V.MADUGULA, ANAKAPALLI, now changed my name from KUNCHA KUSAMAKUMARI to SIRISOLLA KUSUMA KUMARI. Henceforth I will be called as SIRISOLLA KUSUMA KUMARI for all purposes.
(Ro.No. 8097)

★ I, MALEPATI GEETA W/o MALEPATI SURESH BABU, R/o Plot No 48,69 Phase-3, B-Block, MSS Balaji Villas, Pasupula, PO: Pasupula, DIST: Kurnool, Andhra Pradesh - 518452, have changed my name and shall hereafter be known as THAMMINENI GEETA.
(Ro.No. 8103)

★ KONA VENKATA LAKSHMI W/O KONA SIMHACHALAM, previously called MOLLI VENKATA LAXMI R/O 19-7-17, MUSALI NAIDU PALEM, BC ROAD, PEDAGANTYADA, VISAKHAPATNAM, now changed my name from MOLLI VENKATA LAXMI to KONA VENKATA LAKSHMI. Henceforth I will be called as KONA VENKATA LAKSHMI for all purposes.
(Ro.No. 8118)

★ I, GOOTY MOHIDDIN SHAIK SHA VALI S/o G MOHIDDIN PEERAN, R/o 8/310-A, Near Buland Mosque Street, Mominabad,Guntakal, PO: Guntakal, DIST: Ananthapuramu, Andhra Pradesh - 515801, declare that the name of mine and my father has been wrongly written as SHAIKSHAVALI G M and G MOHIDEEN PEERAN in my Educational Documents and name of my father has been wrongly written as GOOTY MOHIDDIN PEERA and GOOTY MOHIDDIN PEERAN in my PAN Card No. FQVPS6458G and Voter Card No. RBV0024661, the actual name of mine and my father is GOOTY MOHIDDIN SHAIK SHA VALI and G MOHIDDIN PEERAN.
(Ro.No. 8102)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## హోటల్స్‌లో డొమాస్టిక్ సిలెండర్ వినియోగిస్తే చర్యలు తప్పవు..



మాధవధార, మే 27, ప్రభాతవార్త

హోటల్స్, తోపుడు బల్ల నిర్వాహకులు గృహా అవస రాలకు వినియోగించే డొమాస్టిక్ గ్యాస్ సిలెండర్ వినియోగిస్తే చర్యలు తప్పవని సర్కిల్ వన్ సివిల్ సప్లై ఆర్ఐ బి.సతీష్ అన్నారు. సివిల్ సప్లై సర్కిల్-1 ఏఎస్ఓపి శ్రీహరి ఆదేశాల మేరకు మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో హోటల్స్, టీ స్టాల్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లపై బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అయితే చాలావరకు కమర్షియల్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే మరి కొందరు కట్టెల పొయ్యిపై వంటకాలు చేస్తున్నారన్నారు. నిబంధనలు అతిక్రమించి డొమాస్టిక్ గ్యాస్ సిలెండర్ వినియోగించినట్లు గుర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఆయన వెంట చెకింగ్ ఇన్స్పెక్టర్ డి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఎక్మో విధానంతో ఊపిరితిత్తుల చికిత్సలో సరికొత్త విప్లవం

### చివరిదశ ఊపిరితిత్తుల వైఫల్యానికి అధునాతన వైద్యం అందుబాటులోకి

విశాఖపట్నం, మే 27 ప్రభాతవార్త




తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఊపిరి తిత్తులు పూర్తిగా దెబ్బతిని ప్రాణాపాయ స్థితికి చేరుకునే రోగులను కాపాడటంలో 'ఎక్మో' (జుజమీా) విధానం సంజీవనిలా మారుతోందని హైదరాబాద్ సోమాజిగూడ లోని యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు. బుధవారం విశాఖపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జుజమీా సపోర్ట్‌తో లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానం ద్వారా చివరిదశ ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు ప్రాణరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రోగులకు అంతర్జాతీయ స్థాయి క్రిటికల్ కేర్ వైద్యసదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (Xూణ) లేదా శ్వాసకోశ వైఫల్యం కారణంగా ఊపిరితిత్తులు రక్తానికి ఆక్సిజన్ అందించే సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు 'వెనో-వీనస్ ఎక్మో' లైఫ్ సపోర్ట్ విధానాన్ని వినియోగిస్తామని వివరించారు. ఈ విధానంలో శరీరం వెలుపల ఉండే ప్రత్యేక యంత్రం కృత్రిమ ఊపిరితిత్తుల మాదిరిగా పనిచేసి, ఆక్సిజన్ లేని రక్తాన్ని తీసుకుని దానికి ఆక్సిజన్ అందించి, కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి తిరిగి శరీరంలోకి పంపుతుందని తెలిపారు. ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన రోగులకు దాత దొరికే వరకు ప్రాణాలను నిలబెట్టేందుకు జుజమీా అత్యంత కీలకమని పేర్కొన్నారు. జుజమీా సపోర్ట్‌పై ఉన్న రోగులకు డబుల్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ చేయడం వైద్యశాస్త్రంలో అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, గుండె-ఊపిరితిత్తుల నిపుణులు, అనస్థీషియా వైద్యులు, ఐసీయూ బృందం సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఊపిరితిత్తుల వ్యాధి చివరిదశకు చేరినా ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఆధునాతన వైద్య సదుపాయాల ద్వారా ప్రాణాలు కాపాడడం సాధ్యమవుతోందన్నారు. శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక క్రిటికల్ కేర్ ప్రోటోకాల్స్, రిహాబిలిటేషన్ ద్వారా రోగులను మళ్లీ సాధారణ జీవితానికి తీసుకురావచ్చని వివరించారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ విభాగం ఏజీఎం వెంకటేశ్వరరావు వీరంకి, అసిస్టెంట్ మేనేజర్ వెంకటరమణ రుకనాన తదితరులు పాల్గొన్నారు.

## గాజువాకలో 'మహానాడు - 2026' సంబరాలు

### మహిళలకు పెద్దపీట వేస్తున్న టీడీపీ: మొల్లి పెంటిరాజు



గాజువాక, మే 27,ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక పండుగ 'మహానాడు - 2026' వేడుకలు గాజువాక నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. 75వ వార్డు క్లస్టర్ పరిధిలోని జీవీఎంసీ కళ్యాణ మండపంలో స్థానిక తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్లస్టర్-6 ఇంచార్జి ఉరుకూటి అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి, ఏపీజీబీసీ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, 75వ వార్డు మాజీ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి రమణారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మొల్లి పెంటిరాజు మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో మహిళలకు రాజకీయంగా, సామాజికంగా అగ్రతాంబూలం ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనన్నారు. మహానాడు స్ఫూర్తితో కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 75వ వార్డు అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్యలు పార్టీ శ్రేణులకు స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో పార్టీ ముఖ్య నాయకులు గోక్యాడ ముత్యాలు, వంగలపూడి అప్పలరాజు, మొల్లి రమణ బాబు, నంబరు పైడయ్య, పెద్దడా సోమినాయుడు, ఊరుకూటి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్ళు, అండిబోయిన నూకరాజు, కణితి సన్యాసమ్మ, పెద్దడా సరోజిని మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాజువాకలో 'హైబ్రిడ్' మహానాడు జోష్

గాజువాక, మే 27,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గంలో హైబ్రిడ్ తరహాలో నిర్వహించిన మహానాడు తొలిరోజు వేడుకలు పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. పాత గాజువాక పార్టీ కార్యాలయం వద్ద మహానాడు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీ పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాసరావు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుగుతున్న ఈ హైబ్రిడ్ మహానాడు గిన్నిస్ రికార్డుల్లోకెక్కడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తోందని కొనియాడారు. మే 28న ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పసుపు పండుగలో మాజీ కార్పొరేటర్ రాజాన రామారావు, విల్లా రామ్మోహన్ కుమార్, సాలాపు రామారావు, వెన్నెల ఈశ్వరరావు,పప్పు రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

## జలధార, జలహారతి చెరువుల పనులను పరిశీలించిన డూమా పిడి



పద్మనాభం, మే27,ప్రభాతవార్త

మండలంలో అనంతవరం, శేరీఖండం గ్రామాలలో ఉన్న సన్యాసి చెరువు,అ క్కుమజ్జి చెరువులలో ప్రభుత్వ ఆదేశాక మేరకు జరుగుతున్న జకధార, జలహారతి కార్యక్రమాక ను బుధవారం డూమా పిడి సిహెచ్ నిర్మలాదేవి పరిశీలించారు. ఆ చెరువులలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జలవనరుల అభివృద్ధి, నీటి సంరక్షణ చర్యలపై అధికారులకు పలు సూచినలు ఇచ్చారు. జలధార, జలహారతి పథకం ద్వారా చెరువుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు నెరవేర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి జ్ఞానవేణి, ఎండిఓ నగేష, ఎపిఓ జివిఎస్ గౌరి, అధికారులు ఆంజనేయులు పాల్గొన్నారు.

## బాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కి ఘన స్వాగతం

గాజువాక,మే 27,ప్రభాతవార్త:



బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కి విశాఖపట్నం విమానాశ్రయం లో బాజపా శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బిజేపి జిల్లా అధ్యక్షుడు పరశు రాంరాజు ఆద్వర్యంలో రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో బిజేపి ప్రశిక్షణ తరగతుల్లో పాల్గొని,బెంగుళూరు విమానాశ్రయం నుండి ఇండిగో విమానంలో విశాఖ వచ్చిన ఆయన రోడ్డు మార్గంలో తన నివాసానికి చేరుకున్నారు.

## గాజువాకలో బీజేపీ 'సర్' సమావేశం



గాజువాక, మే 27,ప్రభాతవార్త:

పాతగాజువాక ఎల్.వి.నగర్, పెదగంట్యాడ ముసలినాయుడు పాలెంలో బీజేపీ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) మండల సమన్వయ సమావేశాలు జరిగాయి. దీనంకొండ పావని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) హాజరై, బూత్ లెవల్ ఏజెంట్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ.. జూన్ 2న తహసీల్దార్ కార్యాలయంలో ఏజెంట్లకు శిక్షణ ఉంటుందని, జూన్ 15 నుండి జూలై 14 వరకు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, దొంగ ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో పార్టీ నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, కిలాని ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గణబాబు చొరవతో గుల్లలపాలెం చిరువ్యాపారుల సమస్యకు పరిష్కారం

### ఊపిరి పీల్చుకున్న బాధితులు -జీవనోపాధికి భంగం కలగకుండా చూడాలని జీవీఎంసీ అధికారులకు ఆదేశం



గాజువాక,మే 27,ప్రభాతవార్త

శ్రీహరిపురం గుల్లలపాలెం మహాత్మాగాంధీ వాణిజ్య సముదాయం మార్కెట్ పరిసరాల్లో గత 40 ఏళ్లుగా తోపుడు బండ్లపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల సమస్యకు విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా గణబాబు చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఫుట్‌పాత్, షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని దుకాణాలను తొలగించా లంటూ కొందరు వ్యాపారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, మంగళవారం అధికారులు వాటిని తొలగిం చేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆందోళనకు గురైన చిరువ్యాపారులు ఎమ్మెల్యే గణ బాబును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనిపై ఆయన తక్షణమే స్పందిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. చిరు వ్యాపారుల ఉపాధి దెబ్బతినకుండా, అదే సమయంలో ప్రజా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో మార్కెట్ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టి, ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కాగా, కొందరు దళారులు కావాలనే అక్కసుతో తమను ఇక్కడి నుంచి ఖాళీ చేయించాలని చూశారని, ఎమ్మెల్యే సకాలంలో స్పందించి తమకు న్యాయం చేశారని చిరువ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలి

గాజువాక, మే 27,ప్రభాతవార్త




గాజువాక శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఉత్సాహంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదవడం, రాయడంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు మహేష్ విద్యార్థులకు 'మర్యాద రామన్న' కథను వినిపించి, అందులోని నైతిక విలువలను వివరించారు. గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ ఆధ్వర్యంలో 'పుస్తక దర్శనం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయగీత ఆలాపనతో ఈనాటి కార్యక్రమం ముగిసింది.

## ఆనందపురంలో టీడీపీ వర్చువల్ మహానాడు నిర్వహణ



ఆనందపురం, మే 26, ప్రభాతవార్త:

ఆనందపురం మండలంలో బుధవారం టీడీపీ వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, క్లస్టర్ ఇంచార్జ్ మీసాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముందు స్వర్గీయ ఎన్టీఆర్‌తో పాటు మాజీ మంత్రి అప్పలనరసింహారాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు ర్యాలీగా వెళ్లి ఆనందపురం పూల మార్కెట్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ పార్టీ స్థాపన వెనుక ఉన్న లక్ష్యాలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన అమలు చేసిన పథకాలు, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన విధానం గురించి వివరించారు. టీడీపీ ఆవిర్భావం రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇన్ ఛార్జ్ చిక్కాల విజయబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సోషల్ సైన్స్ లెక్చరర్‌లుగా ముగ్గురుకి పదోన్నతి

### కెజీహెచ్‌లో నియామకం

విశాఖపట్నం, మే 27,ప్రభాతవార్త

వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ముగ్గురు ఉద్యోగులు పదోన్నతి పై సోషల్ సైన్స్ లెక్చరర్‌లుగా కెజీహెచ్ విధులలో చేరారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం వారు కెజీహెచ్ సూపరేంటెండెంట్ డా.ఐ.వాణిని కలసి తమ నియామక ఉత్తర్వులు ను అందజేసిన వెంటనే విధుల్లో చేరారు. గాజువాక ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో మగ ఆరోగ్య విస్తరణ అధికారులుగా పని చేస్తున్న రొంగలి రవిశంకర్ బి. శ్రీనివాసా చార్యులుతో పాటు కెజీహెచ్‌లోనే మహిళా ఆరోగ్య విస్తరణ ఆదికారినిగా పని చేస్తున్న ఎమ్. వెంకట లక్ష్మిలకు సోషల్ సైన్స్ లెక్చరర్‌లుగా ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి మంగళవారం పదోన్నతి కల్పిస్తూ వారిని కెజీహెచ్‌లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.దాంతో వారు అదేరోజు సాయంత్రం కెజీహెచ్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు నగేష్ పట్నాయక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శేషు బాబు ఎన్ఎంఈపీ సబ్ యూనిట్ సిబ్బంది అంతా వీరికి అభినందనలు తెలియజేశారు.

## 13వ వార్డులో ఘనంగా మహానాడు కార్యక్రమం

ఆరిలోవ, మే 27, ప్రభాతవార్త



తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాలు మేరకు స్థానిక 13వ వార్డు ఆరిలోవలో బుధవారం టిడిపి వర్చువల్ మహా నాడు కార్యక్రమాన్ని 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పాత్రకండ ధర్మారావు ఆధ్వర్యంలో క్రిస్టియన్ మైనారిటీ ఏసీ కళ్యాణ మండపంలో ఎల్ఈడి స్క్రీన్లు పెట్టి ఘనంగా నిర్వహించారు. ఈ పర్యవేక్షణలో మహానాడు కార్యక్రమం ఇంచార్జ్ కరణం శివరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సలహాలు, సూచనలు తెలియజేశారు. వార్డు మొత్తం మహానాడు జరిగే ప్రాంగణం పసుపు మయంగా మారి వార్డులో ఉన్నటువంటి ప్రతి గ్రామం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పాల్గొని హైబ్రిడ్ విధానంలో జరిగినటువంటి కార్యక్రమం మొత్తాన్ని సాయంత్రం వరకు తిలకించి తెలుగుదేశం పార్టీ మీద తమకున్న అభిమానాన్ని చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, యల్లమిల్లి సురేష్ తో పాటు అన్ని అనుబంధ సంఘాల కమిటీల ప్రెసిడెంట్లు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు,నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు,అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## అడివివరంలో సందడిగా టీడీపీ మహానాడు

సింహాచలం, మే 27, ప్రభాతవార్త



అడివివరంలో డిజిటల్ మహానాడు సందడిగా ప్రారంభమైంది. ముందుగా ఎన్టీ రామారావు విగ్రహానికి మాజీ కార్పొరేటర్ పి.వి.నరసింహం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మహానాడు కార్యక్రమం లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సందేశాన్ని డిజిటల్ వేదిక ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్ ఇన్చార్జ్ పి.వి. నరసింహం ఆధ్వర్యంలో డిజిటల్ మహానాడు కార్యక్రమాలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, యువత అధ్యక్షులు గుసిడి అవినాష్, రౌతు రాంబాబు, మజ్జి శ్రీనివాస్ రావు, తాళ్ల పూడి నాగరాజు,మహిళా కార్యకర్తలు టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## పద్మనాభం, గెద్దపేట గ్రామాలలో ఉత్సాహంగా ప్రారంభమైన మహానాడు



పద్మనాభం, మే 27, ప్రభాతవార్త

మండలంలో పద్మనాభం, గెద్దపేట గ్రామాల లో రెండు క్లస్టర్లల ప్రతినిధులు కె.రామరాజు, మజ్జి నందీష్‌ల ఆధ్వర్యంలో బుధవారం మహానాడు కార్యక్రమాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ రెండు క్లస్టరులలో ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు, ఇటీవల మృతి చెందిన మాజీ మంత్రి అప్పలనర్సింహా రాజు చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి,పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు సిఎం చంద్రబాబు నాయుడు, లోకేష ప్రసంగాలను స్క్రీన్‌పై వీక్షించారు. టీడీపీ యాప్ ద్వారా నాయకులు హాజరు వేసుకున్నారు. అధిక సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రమణ,ట్రస్ట్ బోర్డు సభ్యులు దాము,పిఎసిఎస్ చైర్మన్లు కృష్ణంరాజు, గణేష్, బార్నాల శ్రీను, అన్నమయ్య, కాపు డైరెక్టర్ లీలావతి, ఎంపిటీసి లక్ష్మి, రమణరాజు, మాజీ ఎంపీపీ గోపిబాబు, ఎర్రిబాబు, లోకనాథం, లక్ష్మి, ప్రసాదు, ఎంఎస్ ఆర్,నాగు, విజయబాబు, మహంతి శ్రీను పాల్గొన్నారు.



## మహానాడులో 'తమ్ముళ్ల' తగాదా!

### 86వ వార్డు టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

గాజువాక,మే 27,ప్రభాతవార్త

గాజువాక నియోజకవర్గంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమం టీడీపీ అంతర్గత విభేదాలకు వేదికైంది. 86వ వార్డుకు చెందిన పార్టీ నాయకుడు చదరం తులసిరామ్ తన వర్గంతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. చంద్రబాబు, లోకేష్, పల్లా శ్రీనివాసరావులపై అభిమానంతో ఆయన కటౌట్లు, స్నాక్స్ ఏర్పాటు చేశారు. అయితే, వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు కార్యక్రమంలో కూడా తులసిరామ్ పాల్గొనడంపై ప్రత్యర్థి వర్గం తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఈ క్రమంలో, వార్డు అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో 'ఆర్ కన్వెన్షన్ హాల్'లో ఏర్పాటు చేసిన భోజన విందు వద్ద వివాదం పరాకాష్టకు చేరింది. తులసిరామ్ వర్గీయులు భోజనం చేస్తుండగా ప్రత్యర్థి వర్గీయులు వారి ప్లేట్లను లాక్కొని, కటౌట్లను చింపేసి అవమానించారని బాధితులు ఆరోపించారు. దీంతో మండిపడిన తులసిరామ్ వర్గీయులు నేరుగా గాజువాక పార్టీ ఆఫీసుకు చేరుకుని, కార్యకర్తలకు తామే స్నాక్స్, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వార్డులో పార్టీ గ్రూపులుగా విడిపోవడంపై తులసిరామ్ ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఈ అవమానకర ఘటనపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

## మాధవధారలో జూనియర్ కళాశాల ఏర్పాటుపై నోరు మెదపని నాయకులు

మాధవధార, మే 27, ప్రభాతవార్త




స్థానిక మాధవధార,మురళి నగర్ ప్రాంతంలో విద్యార్థుల సౌలభ్యం కొరకు దగ్గరలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని గతంలో ఎందరో నాయకులు హామీ ఇవ్వడం జరిగింది. అయితే విద్యా సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు నిరాశ చెందుతూ వస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ కులా లకు చెందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయ రహదారికి పై భాగంలో ఉన్న ఈ ప్రాంతంలో మాధవధారలో గాని ఉడా కాలనీలో గాని జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి తీరుతామని ఎందరో నాయకులు నోటిమాటలు చెప్పడమే తప్ప అమలులోకి తీసుకురావడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా మాధవధార, మురళి నగర్,కళింగనగర్, సాయిరాం నగర్, బర్మా కాలనీ,కైలాసపురం ప్రాంతాలలో రోజువారీ కూలీ చేసుకుంటూ జీవనం గడుపుతున్నటువంటి ఎందరో తల్లిదండ్రులు వారి పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు సుదూర ప్రాంతాలకు కళాశాలకు పంపిస్తున్నారు.ఈ ప్రాంతాలకు దగ్గరలో ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలో చేర్పించి లక్షల రూపాయల ఆర్థిక భారం పడుతున్నారు.ప్రతి ఏడాది ఈ ప్రాంతాలలో పదవ తరగతి పాసైన విద్యార్థులు జాతీయ రహదారి దాటుతూ సుదూర ప్రయాణాలు చేస్తూ చాలీచాలని బస్సులలో కళాశాల కు వెళ్లాల్సి వస్తుంది. స్థానిక వార్డు స్థాయి నాయకులు ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు పై ఉన్నత అధికారులు, జిల్లాస్థాయి నాయకులు వద్దకు వెళ్లి డిమాండ్ చేసి తీసుకురాలేకపోతున్నారని, ప్రజల వద్ద హామీలు నెరవేరుస్తానని మాట ఇచ్చి,ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి నాయకులు వద్ద మాత్రం నోరు మెదపలేకపోతున్నారని దుయ్యబడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల పూర్తవుతున్నప్పటికీ ఈ హామీ నెరవేరకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత నెలకొంటుంది.ప్రజల సమస్యలపై పోరాడి పరిష్కారం చూపే నాయకులు కరువయ్యారని, ప్రజలను నమ్మబలికేందుకు వినతి పత్రాలు అందజేసి, ఫోటోలకు ఫోజులిచ్చి సుదీర్ఘ కాలం పాటు కాలయాపన చేస్తున్నారని, నెలలు గడిచిన సంవత్సరాలు గడిచిన వినతి పత్రాలపై పరిష్కారం రాకపోయేసరికి వార్డు స్థాయి నాయకులపై స్థానిక ప్రజలు నిరుత్సాహం చెందుతున్నారు.ఇప్పటికైనా వార్డు స్థాయి నాయకులు విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మాధవధార ప్రాంతంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని, ఉన్నతాధికారులు ఈ ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేస్తున్న విద్యార్థులపై దృష్టి పెట్టి జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## బీజేపీలో చేరిన సిరికి

సీతమ్మధార, మే 27 ప్రభాతవార్త



భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తామని శ్రీనిధి అసోసియేట్స్ మేనేజింగ్ డైరెక్టర్‌లు సిరికి సంతోష్ కుమార్, సిరికి రవిరాజ్ తెలిపారు.విశాఖ ఉత్తర నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నార్త్ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, బిజెపి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరుశురామరాజు, విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పొట్నూరు వెంకట కృష్ణ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ బాబు , హిందూ హైందవ ధార్మిక చైర్మన్ బుద్ధా శివాజీ తదితర ప్రముఖుల సమక్షంలో బుధవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా సిరికి సంతోష్ కుమార్ ,సిరికి రవిరాజ్ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలు, పార్టీ విధివిధానాలు చూసి బిజెపి పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో సభ్యత్వాలు తీసుకున్నామని తెలిపారు. దేశం కోసం, ధర్మం కోసం తామందరం పనిచెయ్యడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వీరితోపాటు రాజన్న, ప్రవీణ్ కుమార్, ఐతం మధు కుమార్, పొట్నూరు సుమంత్ తదితరులు 60 మంది బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు.

## 50వ వార్డులో ఘనంగా మహానాడు

మాధవధార, మే 27 ప్రభాతవార్త



తెలుగు దేశం పార్టీ మహా నాడు సందర్భంగా గా. 50వ వార్డ్ టీడీపీ వార్డ్ అధ్యక్షులు సనపల.వర ప్రసాద్ బి టెక్ ఆధ్వర్యంలో మహానాడు ఘనంగా నిర్వహిం చారు. పార్టీ కార్య కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒక పండుగ వాతావరణం ను తలపించే విధంగా ఆనంద ఉస్తాహాల నడుమ విజయ వంతగ కొనసాగుతుంది కొనసాగించారు.

## నేడు చినగదిలి బాబా ఆలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఆరిలోవ, మే 27, ప్రభాతవార్త

చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శంకర్ ఫౌండేషన్ సంస్థ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనుంది. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా నిర్వహిస్తామని శంకర్ ఫౌండేషన్ తెలిపిశీది రాజు తెలిపారు. క్యాటరేట్ ఉన్నవారికి, కంటి సమస్యలు ఉన్నవారికి ఆపరేషన్ అవసరమైతే సింహాచలంలో ఉన్న శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆలయ చైర్మన్ వానికిల ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు.

## మే 30లోగా జీవీఎంసీ పరిధిలో ఇండ్ల గణన పూర్తి

### ఇండ్ల గణనలో నమోదు కాకపోయినా లేదా సందేహాలు ఉన్న వారు 9014218870 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించండి :జీవీఎంసీ అదనపు కమిషనర్, సిటీ సెన్సస్ అధికారి డి.వి.రమణమూర్తి

విశాఖపట్నం, మే 27, ప్రభాతవార్త



జీవీఎంసీ కమిషనర్, ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నగరంలో సెన్సెస్ 2027 కు సంబంధించి ముందస్తు ప్రక్రియలో భాగంగా చేపట్టిన తొలి విడత "ఇండ్ల గణన" (హౌస్ లిస్టింగ్) ముగింపు దశకు చేరుకుందని, మే 1న ప్రారంభమైన ఈ ప్రక్రియ మే 30 తో ముగియనున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ), సిటీ సెన్సెస్ అధికారి డి.వి. రమణమూర్తి బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఇప్పటివరకు నగర పరిధిలో 97 శాతం ఇండ్ల గణన పూర్తి అయ్యి మొత్తం 9,13,650 ఇండ్లను నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే నిర్మాణం పూర్తై ఎవరూ నివసించని 1,47,000 ఖాళీ ఇండ్లు, తాళాలు వేసి ఉన్న 37,358 ఇండ్లను అధికారులు గుర్తించినట్లు తెలిపారు. వేసవి సెలవుల కారణంగా చాలామంది ఊర్లకు వెళ్లడం వల్ల ఇండ్లు లాక్ చేసి ఉండవచ్చన్నారు. ఈ తొలి విడతలో కేవలం ఇండ్ల గుర్తింపు మాత్రమే జరుగుతుందని, అసలైన జనాభా లెక్కల సేకరణ రెండో విడతలో 2027 ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటివరకు తమ ఇంటి వివరాలు నమోదు కాలేదని భావించే వారు, ఖాళీ ఇండ్ల యజమానులు, తాళాలు వేసి ఉన్న ఇండ్ల వారు వెంటనే సమీప వార్డు సచివాలయం లేదా జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. 9014218870 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేసి తమ ప్రాంత వివరాలు తెలియజేస్తే, సెన్సెస్ సిబ్బంది నేరుగా ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. నగర ప్రజలందరూ ఇండ్ల గణన ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరించాలని అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

vsp12:vsp12.qxd 27-05-2026 23:27 Page 1



## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎంపీపీ



ఎలమంచిలి, మే 27, ప్రభాతవార్త:

మండలంలోని లేని కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజాన శేషు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజాన శేషు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ శానిటేషన్ వర్కర్లు వచ్చినప్పుడు వారికి ఆ చెత్తను అందజేయడం వల్ల పరిసరాలన్నీ పరిశుభ్రముగా ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ క్లాతురాలు లైన్ కొత్తూరు ఆర్ అండ్ బి రోడ్డు నుండి పంచాయతీ అన్ని వీధి రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి కే శ్రీనివాసరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి, జనసేన నాయకులు లాలం సోమినాయుడు, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు,పాల్గొన్నారు.

## గ్రామంలో మంచినీటి సరఫరా.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)



డియర్‌పురంలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర నీటి ఎద్దడిని తాత్కాలికంగా ఉపశమనం కలిగించుటకు చేసిన ప్రయత్నంలో భాగంగా ట్రాక్టర్ ద్వారా వాటర్ ట్యాంక్ ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. గ్రామ మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ఆధ్వర్యంలో డిఎల్ పురంలో గల జగనన్న కాలనీకి కొంతమంది దాతల సహకారంతో మంచినీటి సరఫరా నిర్విరామంగా అందిస్తున్న నేపథ్యంలో జగనన్న కాలనీ మంచినీటి సమస్యను తీర్చుటకు శాశ్వతంగా కలెక్టర్ , హోమ్ మంత్రి వంగలపూడి అనిత సహకారంతో పైప్ లైన్ ఏర్పాటు చేయటం సంతోషం అన్నారు. డిఎల్ పురం గ్రామంలో తీవ్రంగా ఉన్న మంచినీటి ఇబ్బందులను పూర్తిస్థాయిలో పరిష్కరించుటకు కూడా సహకరించాలని వారిని కోరారు. గ్రామంలో ఉన్న వనరులను వాడుకొనుటకు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కలిసి ఉమ్మడి ప్రణాళిక వేస్తే సదరు సమస్య తాత్కాలికంగా పరిష్కారం అవుతుందని ఆ విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## తెలుగుదేశం ప్రభంజనానికి 44 ఏళ్లు

### మండల మినీ మహానాడులో కౌన్సిలర్ చింతకాయల రాజేష్

### రాష్ట్ర మహానాడులో ప్రవేశపెట్టిన తీర్మానాలకు జై జై

గొలుగొండ మే 27 ప్రభాతవార్త:



రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభంజనానికి 44 ఏళ్ళు... మహానాడు ద్వారా తెలుగుదేశం పార్టీ తీసుకొచ్చిన చారిత్రక మార్పులపై మండల మినీ మహానాడులో వివరించిన కౌన్సిలర్ చింతకాయల రాజేష్. మండల మినీ మహానాడులో పాల్గొన్న ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి మహానాడువి ప్రారంభించారు. రాజేష్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి మహిళలకు పెద్దపీట వేస్తూ 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చారని అన్నారు. నాడు ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు రాజకీయాల్లో పోటీ తత్వానికి ప్రోత్సహించడం జరిగిందన్నారు. మహిళల్లో పోటీ తత్వాన్ని అలవార్చింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న మహానాడులో ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను మినీ మహానాడులో జై జైలు పలుకుతూ ఆమోదం పలికారు. ఈ మహానాడుకు స్త్రీశక్తిగా నిర్వహించడం పై మహిళల్లో హర్షం వ్యక్తం అయింది. క్లస్టర్ ఇంచార్జిలు ఆడుపురెడ్డి గోపాలకృష్ణ, కొల్లు రాంబాబు ఆధ్వర్యంలో మండలంలో ఏ ఎల్ పురం, చీడి గుమ్మల లో నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్, టిడిపి పార్టీ ఉపాధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, భీమిరెడ్డి సత్యనారాయణ, ఏ ఎల్ పురం గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు జమీలు, జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల బాబ్జి, కామిరెడ్డి గోవింద, కుచ్చర్లపాటి రవి వర్మ, గ్రామ పార్టీల అధ్యక్షులు, మండలంలో ఉన్న ప్రముఖ నాయకులు కార్యకర్తలు, మహిళలు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బుచ్చయ్యపేట ఎస్సైగా మనోజ్ కుమార్ బాధ్యతలు

బుచ్చయ్యపేట, మే 27 ప్రభాతవార్త :



అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా టీ మనోజ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కసింకోట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై బుచ్చయ్యపేటకు వచ్చారు. ఇప్పటివరకు బుచ్చయ్యపేట ఎస్సైగా పనిచేసిన ఏ శ్రీనివాసరావు విజయనగరం ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీపై వెళ్లిన నేపథ్యంలో టీ మనోజ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడతానన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా పనిచేస్తానని తెలిపారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పడాలని కోరారు.

## ఎమ్మెల్యే కొణతాల ఆదేశం

అనకాపల్లి,మే 27( ప్రభాత వార్త):



స్తానిక జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గ్రామీణ నీటి సరఫరా , పారిశుధ్యం విభాగ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి, కసింకోట మండలాలు , గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుతున్న సురక్షితమైన త్రాగునీరు , పారిశుధ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్ట్యా నిరంతరం సురక్షితమైన తాగు నీటిని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డి ఇ ప్రసాద్ , అనకాపల్లి మండల ఏఇ హిమబిందు , కసింకోట మండల ఏఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శతశాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలి



### మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి

అనకాపల్లి , మే 27, (ప్రభాత వార్త):

ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న సౌకర్యాలు, పథకాలపై విద్యార్థులు తల్లిదండ్రులకు వివరించి సతశాతం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా ఉపాధ్యాయులకు చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎన్ కె శ్రీదేవి అన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ అధ్యక్షతన ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థులను మనబడి మన భవిష్యత్తు బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సతశాతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేయాలని ప్రభుత్వం అందజేస్తున్న 22 సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి ఒక్క విద్యార్థి బడి బయట ఉండకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు సిఆర్పిఎస్ ఎస్ శంకరరావు పి నేలవేణి పీదేవి విపి శిరీష కే వెంకటాపురం, తదితరులు పాల్గొన్నారు.

## యూఎస్ఏ 250 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో

## మైక్రో ఆర్టిస్ట్ గెట్టం వెంకటేష్‌కు చోటు

(నక్కపల్లి రూరల్/ అడ్డు రోడ్డు, ప్రభాతవార్త)



మండలంలోని చిన్న దొడ్డుగల్లు గ్రామానికి చెందిన డా. గట్టెం వెంకటేష్, ప్రపంచ శిల్ప సూక్ష్మ కళాకా రుడు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు తన 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా (ఆర్ట్ ఎక్స్‌పో కోసం కళాకృతికి ఎంపిక య్యారు) ఈ సందర్భంగా వెంకటేష్ ఫోర్ బి పెన్సిల్‌తో తయారుచేసిన వివిధ కళారూపాలను ప్రదర్శించబోతున్నారు. ప్రదర్శించబోతున్న కళారూపాలుగోల్డెన్ గేట్ బ్రిడ్జ్,(4డీ గ్రాఫైట్ లెడ్)వైట్ హౌస్‌కాపిటల్ భవనం, వాషింగ్టన్ డి.సి.,స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ,టైటానిక్ ఓడ,ఒకదానితో ఒకటి పెనవేసుకున్న గొలుసు లింకులు, సెయింట్ పాట్రిక్ కేథడ్రల్ చర్చి, (న్యూయార్క్), 68 గంటలపాటు శ్రమించి వీటిని తయారు చేయడం జరిగిందని ఈ విధంగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని వెంకటేష్ తెలిపారు. 250 వ అమెరికా సంయుక్త దేశాల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వెంకటేష్ తయారు చేసిన రూపాలను ప్రదర్శనగా ఉంచేందుకు అవకాశం దొరకడం పట్ల నక్కపల్లి మండలానికి చెందిన పలువురు వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు.



## అనకాపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కొణతాల ఆకస్మిక తనిఖీ

అనకాపల్లి,మే 27( ప్రభాత వార్త):



స్తానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుదవారం ఆకస్మికంగా పరిశీలించి రోగుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో హాస్పిటల్ నందు గర్భిణీలు, బాలింతలు, చంటి పిల్లలు ఎండ తాకడికి ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని వీరందరిని 3 ఫ్లోర్ నుంచి 2 ఫ్లోర్‌కి మార్చాలని, చిన్నపిల్లల వార్డుకి నూతన ఎయిర్ కండిషన్స్ అమర్చాలని, జిల్లా హాస్పిటల్ అయినందున పేషెంట్లు తాకిడి పెరగడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయించి ఆ బ్లాకుని వినియోగంలోకి తీసుకురావాలని హాస్పిటల్ సూపర్డెంట్‌కి ఆదేశాలిచ్చారు. పేషెంట్స్‌తో ట్రీట్మెంట్ కొరకు వివరాలు , సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ మెయింటినెన్స్, హాస్పటల్లో, ఆపరేషన్ థియేటర్లో నిర్వహిస్తున్న పరిశుభ్రతను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్స్‌కి మెరుగైన వైద్యం అందించాలని, మందులు కొరత ఉండరాదని, పరిశుభ్రత పాటించాలని, ఇలాంటి విషయాలో ఉపేక్షించేది లేదని డాక్టర్లకు, కాంట్రాక్టర్లకు తెలియజేశారు.

## తెలుగు వాడి ఆత్మ గౌరవాన్ని నిలిపిన దివంగత ఎన్టీఆర్



అనకాపల్లి , మే 27 (ప్రభాత వార్త):

తెలుగు వాడి ఆత్మ గౌరవాన్ని నిలిపిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఇప్పటికి తెలుగు ప్రజల గుండెల్లో స్థిర స్థానం గా నిలిచి ఉన్నారని తెలుగుదేశం పార్టీ విశాఖ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు. దాడి రత్నాకర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మహానాడు సందర్భంగా తొలి రోజు ఎన్టీఆర్ స్టేడియం వద్ద, ఎన్టీఆర్ రింగ్ రోడ్డు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న తెలుగువారి ఆరాధ్యదైవం విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మహా పండగ మహానాడు. ఈ మహానాడు ని ఎన్టీఆర్ 44 సంవత్సరాల కిందట ప్రారంభించి నేటికీ కార్యకర్తలను, పార్టీని బలోపేతం చేయడంలో ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ మహానాడు ను ప్రతి సంవత్సరం మే 27, 28, 29 తేదీలలో రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో కార్యకర్తలు అందరూ కలిసి చేసుకునే పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపాటి చిన్న రాజారావు, మళ్ళీ రాజా, శిలపరశెట్టి బాబి, కోట్ని ఉమా, యాల్లపు శ్రీనివాస్, కర్రి చిన్న నాయుడు, వామాల కాశి, కర్రి అప్పాజీ, దాడి ఈశ్వరరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లిలో ఘనంగా మహానాడు వేడుకలు

అనకాపల్లి, మే 27( ప్రభాత వార్త):



పట్టణంలోని జీవీఎంసీ 80,81వ, 82వ, 83వ, 84వ వార్డులలో 8,9,10,11,12 క్లస్టర్‌లలో ఎంతో ఘనంగా హైబ్రిడ్ పద్దతిలో మహానాడు -2026 వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ , ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు పీలా గోవిందసత్యనారాయణ ,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , నియోజకవర్గ పరిశీలికులు సర్వసిద్ధి అనంత లక్ష్మీ ,రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ఈ వేడుకలలో పాల్గొన్నారు.ముందుగా పార్టీ జెండాను పార్టీ శ్రేణులతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వర్చువల్ పద్దతిలో పెద్ద ఎత్తున అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.అనకాపల్లి నియోజకవర్గం మొత్తం 12క్లస్టర్ లలో 12చోట్ల జరిగిన మహానాడు వేడుకలలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీలు బివిఎస్ఎంకె జోగి నాయుడు, పోలారపు త్రినాధ్,బొద్దపు ప్రసాద్, మాధంశెట్టి నీలాబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం : సీఐ

( నక్కపల్లి,ప్రభాతవార్త) :



మహిళలు, బాలల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సిఐ మురళి ఉపాధి హామీ మహిళ కూలీలకు పిలుపునిచ్చారు. మండలంలోని బుధవారం ఉదయం ఉపమాక శివారు మన బాల వాణిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి మహిళా చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు .ఎవరికైనా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే పోలీసులకు తెలియజేయాలని ఎటువంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సిఐ సూచించారు. పనులకు హాజరైన 200 మంది మహిళలకు చట్టాల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా ప్రాణం చాలా విలువైనదని, రోడ్డు ప్రమాదాలు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ,వేగవంతమైన ప్రయాణాలు మానుకోవాలని, రోడ్లు దాటేటప్పుడు ఇరువైపులు చూసుకోవాలని కూలీలకు సూచించారు. ప్రయాణాలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని వ్యవహరించాలని అలా వ్యవహరించినప్పుడు గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకుంటామని సీఐ కోరారు. ప్రస్తుతం సమాజంలో యువత డ్రగ్స్ వల్ల నష్టపోతున్నారని , దానివల్ల కలిగే ఇబ్బందులు తెలియజేస్తూ తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సైబర్ నేరాల నివారణ, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యత గురించి ఈ సందర్భంగా కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు సన్నిబాబు, సాహిబా అంజుమ్ ఉన్నారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళులు





(నక్కపల్లి, ప్రభాతవార్త ):

మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి వేంపాడు క్లస్టర్ పరిధిలో ఉన్న మత్స్యకార యువకులు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో క్లస్టర్ ఇంచార్జి గోసల శ్రీకాంత్ సారధ్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహానాడు వేదికగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా మత్స్యకారు యువకులు జై తెలుగుదేశం.. జై చంద్రబాబు.. జై లోకేష్.. జై అనితమ్మ.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి స్క్రీన్ ల ద్వారా ముఖ్యమంత్రి సందేశం విన్నారు. పార్టీ నాయకులు అయినంపూడి అప్పలరాజు, మధు, పిక్కి గంగ రాజు, కల్లేపల్లి వెంకటపతి రాజు, పళ్ళ రాంబాబు, స్కూల్ చైర్మన్ బాబురావు, డైరెక్టర్ ఏడిద సత్యనారాయణ, శివాజీ , సిరిపల్లి అప్పలరాజు , మత్స్యకార సొసైటీ చైర్మన్ పిక్కి కోదండ రావు, ఎంపీటీసీ సత్తయ్య, ఓసుపల్లి రాము, గరికిన సింహాద్రి, ఎరుపల్లి అప్పలరాజు ,సురకాసుల పెద్ద గోవిందు, తదితరులు ఉన్నారు.

## అచ్యుతాపురం ఫోర్ రోడ్డు వద్ద ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తివేత

( అచ్యుతాపురం మే 27 ప్రభాతవార్త )



అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్‌కు సంబంధించి గత నాలుగు రోజులుగా కొనసాగిన గడ్డర్ల అమరిక పనులు పూర్తయ్యాయని పోలీసులు తెలిపారు.ఈ నేపథ్యంలో రేపటి నుంచి (మే 28) ఉదయం నుండి ఫోర్‌రోడ్డు జంక్షన్‌తో పాటు ఇతర మార్గాల గుండా వాహనాల రాకపోకలకు విధించిన ట్రాఫిక్ ఆంక్షలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు అచ్యుతాపురం పోలీసులు వెల్లడించారు.

## గ్రామాల్లో స్వచ్ఛరథం కార్యక్రమాన్ని పరిశీలించిన 'దెందుకూరి'

(నక్కపల్లి, ప్రభాతవార్త):



గ్రామాల్లో ప్రతిష్టాత్మంగా స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్మూలనే ధ్యేయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్చార్జ్ ఎంపిడిఓ దెందుకూరు సీతారామరాజు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా నక్కపల్లి మండలంలోని కాగిత, జానకయ్యపేట గ్రామాల్లో కాలువల్లో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఎక్కడ కూడా చెత్త కనిపించడానికి వీలు లేదని సూచించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో స్వచ్ఛ రథం కార్యక్రమం ద్వారా జరుగుతున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించి ఎక్కడ కూడా పాడుబడిన వస్తువులు ప్రధానంగా ఎలక్ట్రికల్ వస్తువులు ఉండడానికి వీలులేదని తక్షణమే వాటిని స్వచ్ఛ రథం నకు అప్పచెప్పాలని కోరారు. ఆయనతోపాటు కార్యదర్శి చిన్నమనాయుడు, తదితరులు ఉన్నారు.

## టీడీపీలో కార్యకర్తగా గుర్తింపు పొందడమే అదృష్టం : వైబోయిన

( నక్కపల్లి /అడ్డు రోడ్డు ,ప్రభాతవార్త )



తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తగా సమాజంలో గుర్తింపు పొందడమే ఒక అదృష్టము అని మండలంలోని ఉద్దండపురం క్లస్టర్ ఇంచార్జ్ వైబోయిన రమణ అన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలో నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ సారధ్యంలో ఉద్దండ పురం గ్రామంలో బుధవారం ప్రారంభమైన మహానాడు వందలాది



మంది కార్యకర్తలు నడుమ ఘనంగా ప్రారంభమైంది. మహానా డు సందర్భంగా క్లస్టర్ పరిధిలో పెద్ద ఎత్తున పసుపుమయం అయింది. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు , పిఎసిఎస్ అధ్యక్షులు వెలగా శ్రీను , పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ , జిల్లా నాయకులు,నానేపల్లి రాఘవ , మాజీ సర్పంచ్ పొడగట్ల రమణ, తుమ్మల రమణ, గ్రామ పార్టీ అధ్యక్షులు బాబ్జి , మాజీ సర్పంచులు ఎంపీటీసీలు గ్రామ పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నక్కపల్లి మహానాడులో టిడిపి నాయకులు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

నక్కపల్లి క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి నాయకత్వంలో స్థానిక సుబ్బరామిరెడ్డి కళ్యాణమండపంలో మొదటి రోజు బుధవారం పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో వర్చువల్ మహానాడు ప్రారంభమైంది. సందర్భంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. క్లస్టర్ పరిధిలో ప్రాధాన్యత కలిగిన ఈ మహానాడుకు వందలాది మంది కార్యకర్తలు పాల్గొని జాతీయ స్థాయిలో జరుగుతున్న మహానాడు తీర్మానాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, కూరందాసు నూకరాజు ,కర్రి వెంకట సత్యనారాయణ (కె.వి), గొసల తాతారావు, పిక్కి కొర్లయ్య, సత్తిబాబు, ఎలమంచిలి బుజ్జి, దొరబాబు, జగదీష్, తోలేటి శ్రీను, పేర్ల శ్రీను, బొందు దేవుడు, కొప్పిశెట్టి వీరబాబు, మీసాల బాబులు, దేవవరపు లోవరాజు, నల్లల నరేష్, కొత్త శ్రీనివాసరావు, అద్దూరి పెద్ద, బద్రి తదితరులు ఉన్నారు.

## భోగాపురం ఎయిర్పోర్ట్ రహదారుల

## అనుసంధానం పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్



విశాఖపట్నం, మే 27, ( ప్రభాత వార్త):

భోగాపురం ఎయిర్పోర్ట్ జూలై మొదటి వారంలో ప్రారంభం జరగనున్నందున సంబంధిత శాఖల అధికారులు వేగంగా స్పందించి జూన్ 30 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ రోడ్లు, వి. ఎం. ఆర్. డి. ఏ. ల్యాండ్ పూలింగ్, లేఔట్స్ అంశాలపై వీఎమ్ఆర్డిఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బి, భోగాపురం ఎయిర్పోర్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్పోర్ట్ అనుసంధానం రోడ్ల పురోగతినీ నిశితంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం నుండి భోగాపురం ఎయిర్ పోర్టుకు అనుసంధానం చేసే ఏడు రోడ్లతోపాటు ఇతర రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని కలెక్టర్ కోరారు. అధికారులు సమన్వయంతో మిషన్ మోడ్ తో పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణం , సైన్ బోర్డులు ,విద్యుత్ దీపాలు, బస్సు టెర్మినల్, చార్జింగ్ పాయింట్లు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రాపిడో, ఊబర్, ఓలా సర్వీసుల ఏర్పాటుకు ఆ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఇకపై ప్రతివారం సమీక్ష చేస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని లేదా ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని కోరారు. వి ఎం ఆర్ డి ఎ ద్వారా చేపడుతున్న ల్యాండ్ పూలింగ్ సమగ్రంగా చేపట్టాలని, లేఅవుట్ల అభివృద్ధి వేగవంతం చేయాలని, ఆర్డీవో భూమి అప్పగించాలని, వి ఎమ్ఆర్డిఏ అధికారులు లేఔట్లకు నంబర్లు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో వీఎమ్ఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వర్చువల్ గా,భీమిలి ఆర్డిఓ సంగీత్ మాథుర్, విఎంఆర్డిఎ ఎస్ఈ వినయ్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణ రాజు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు, ఏ పీ ఈ పీ డి సీ ఎల్ ఎస్ ఈ శ్యాంబాబు, ఆర్ అండ్ బి యస్ ఈ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తుంగ్లాంలో ఆధ్యాత్మిక వైభవం

### -ఘనంగా శ్రీ విజయ రాఘవ స్వామి పుష్కర పట్టాభిషేకం - 2,500 బైక్‌లతో చినజీయర్ స్వామికి ఘన స్వాగతం -1,008 మంది మహిళలతో లక్ష్మీనారాయణ పూజ



గాజువాక,మే 27,ప్రభాతవార్త:

జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లం గ్రామ పరిధిలో శ్రీ విజయ రాఘవ స్వామి పుష్కర పట్టాభిషేక కుంభమేళా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి వారు గ్రామానికి విచ్చేసి భక్తులకు మంగళాశాసనాలు అందజేశారు. అంతకుముందు షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి తుంగ్లం వరకు సుమారు 2,500 మోటార్ బైక్‌లతో భక్తులు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించి జీయర్ స్వామి వారికి ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని రామాలయాన్ని దర్శించుకున్న స్వామి వారు భక్తులకు రామాయణ విశిష్టతను, రాముని చరిత్రను విపులంగా వివరించారు.అనంతరం చినజీయర్ స్వామి వారి పర్యవేక్షణలో, ఆయన స్వహస్తాల మీదుగా లక్ష్మీనారాయణ పూజ కార్యక్రమాన్ని అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజలో సుమారు 1,008 మంది మహిళా భక్తులు ఒకేసారి పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలతో తుంగ్లం గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. మహోత్సవంలో 69వ వార్డు మాజీ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి దంపతులు, గ్రామ యువజన సేవా సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

28skl13:28skl13.qxd 28-05-2026 00:08 Page 1



## విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



**సంతబొమ్మాళి, మే 26 ప్రభాతవార్త :** సంతబొమ్మాళి శాఖ గ్రంధాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంధాలయాధికారి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ చదరంగం, క్యారమ్స్ ఆడిపించారు.

## ఉల్లాసంగా ... ఉత్సాహంగా పసుపు పండుగ



**ఇచ్ఛాపురం, మే 27 ప్రభాతవార్త :** తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు వల్లా శ్రీనువాసరావు ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాలలో డిజిటల్ (వర్చువల్) పద్ధతిలో మహానాడు ఏర్పాటు చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధి మరియు మండలం రెండు క్లస్టర్ పరిధిలో మహానాడు విజయవంతంగా ప్రారంభమైంది. బుధవారం పట్టణ పరిధిలో పట్టణ అధ్యక్షులు పత్రి తవిటయ్య ఆధ్వర్యంలో కృష్ణతేజ ఫంక్షన్ హాల్లో, మండలం క్లస్టర్ పరిధిలో తేలుకుంచి గ్రామంలో మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, ఈదుపురంలో సెక్రటరీ దక్కత కామేష్ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగాయి. రెండు రోజుల మహానాడు కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ముందుగా పార్టీ వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. క్లస్టర్ పరిధిలోని బూత్ కన్వీనర్లు కమిటీ సభ్యులంతా విధిగా పసుపు చొక్కా ధరించి గుర్తింపు కార్డులతో సమావేశానికి హాజరయ్యారు. వచ్చిన వారంతా టీడీపీ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యనాయకులంతా ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన 1982 నుండి ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ చేసిన సేవలన్నీ పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వల చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, లోపింటి పద్మనాభం, నందిగాం కోటి, దక్కత కామేష్, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, పట్టణ మాజీ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ల దర్మారావు, నందికి జాని, తెలుగుయువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, మాజీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, సీనియర్ నాయకులు మేరుగు సూర్యనారాయణ, ఊనా సంతోష్, కొరాయి దర్మరాజు, జన్నెల సంతోష్ కృష్ణయ్య పాల్గొన్నారు.

## నౌపడలో వైభవంగా మహానాడు



**సంతబొమ్మాళి, మే 26 ప్రభాతవార్త :**

సంతబొమ్మాళి మండలం నౌపడలో మండల తెదేపా అధ్యక్షుడు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి ఆధ్వర్యంలో మహానాడు వేడుకలు వైభవంగా చేపట్టారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరణతో పాటు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నౌపడ కస్టర్ పరిధిలో వందలాది మంది కార్యకర్తలు తరలి వచ్చి దృశ్య శ్రవణం ద్వారా అమరావతిలో చేపట్టిన మహానాడు వేడుకలు ప్రత్యేక ప్రసారం ద్వారా వీక్షించారు. కార్యకర్త అధినేత, మహిళా శక్తి, యువశక్తి, తదితరులు వివిధ అంశాలపైన చర్చించారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు అట్టాడ రాం ప్రసాద్, జీరు భీమారావు, పుక్కళ్ళ శ్రీనివాస రావు, కర్రి విష్ణుమూర్తి, సూరాడ ధనరాజు, వాడరేవు కృష్ణరావు, వారధి చంటి, కర్రి రామిరెడ్డి, పరపటి రాజశేఖర్, సూరాడ దాసురాజ్, జీరు సుందరరావు, బైపల్లి మోహనరావు, బొడ్డేపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కంచిలిలో అట్టహాసంగా ..



**కంచిలి, మే 27 ప్రభాతవార్త:**

మండలంలో మహానాడు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్థానిక మార్కెట్ యార్డులో మండల పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు, బంగారు కురయ్య ఆధ్వర్యంలో ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో టీవీ ఏర్పాటు చేసి మహానాడు కార్యక్రమం తిలకించారు.

## విత్తన గుళికలపై అవగాహన



**కంచిలి, మే 27 ప్రభాతవార్త :**

కంచిలి మండలం జాడుపూడి పంచాయితీలోని జాడుపూడి గ్రామంలో విత్తన గుళికలపై అవగాహన కల్పిస్తూ రైతులు సమక్షంలో విత్తన గుళికలు తయారు చేసి కాంపక్ట్ బ్లాకు ఐదుగురు రైతులు గేదెల రుక్మిణి, గేదెల మోహిని, మునకాల మాధవరావు, గేదెల సంగీత, పిలక దొండారావు కొబ్బరి జీడీ తోటలో లైన్ షోయింగ్ పద్ధతిలో రైతులతో ఈ విత్తన గుళికలు వేయించారు. ఈ విధంగా విత్తన గుళికలు చేసి వేయడం వలన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం పడిన విత్తనం మొలకలు వస్తాయి మరియు ఈ విత్తనాలు ఎలాంటి ఎండ టైంలో వేసిన విత్తనం పాడవకుండా భూమిలో ఎటువంటి నష్టము కలగకుండా భూమిలో నిక్షేపంగా ఉంటాయి. వర్షాలు పడినప్పుడు మొలక శాతం బాగా వస్తుందని ఎటువంటి చీడ పీడలకు విత్తనాలు పాడవకుండా కాపాడడం జరుగుతుంది. భూమిలో సూక్ష్మజీవులు ఎండబారిన పడకుండా కాపాడుతుందని, తక్కువ వర్షపాతం వలన రైతుకు ఏదో ఒక పంట వలన ఆదాయం వస్తుందని నిరంతరం భూమిని పచ్చని పంటలతో కప్పి ఉంటుందని భూమిలో తేమ శాతం ఉంటుందని, భూమిలో జీవవైవిద్యం పెరుగుతుందని రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసిఆర్‌పిలు వివరించడం జరిగింది. వీఏఏ భారతి, ప్రధాన కార్య నిర్వహణ అధికారి ఈశ్వరావు గ్రామపెద్దలు, రైతులు లీడ్ ఫార్మర్స్ అంపురం యూనిట్ ఐ సి ఆర్ పి లు పుష్ప శ్రీదేవి మీనా రేవతి విజయలక్ష్మి హాజరయ్యారు.

## అట్టహాసంగా మహానాడు 2026 ప్రారంభం



**సంతకవిటి, మే 27 ప్రభాతవార్త :**

సంతకవిటి మండలంలో క్లస్టర్ 9 పరిధిలో ఉన్న గ్రామాలకు తాలాడలో గణేష్ రైస్‌మిల్లులో, క్లస్టర్ 10 పరిధిలో ఉన్న గ్రామాలకు సురవరంలో శ్రీఅన్నమ్మతల్లి కళ్యాణ మండపంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, యుగపురుషుడు నందమూరి తారక రామారావుకు ఘన నివాళులర్పించి, తాలాడ, సురవరం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభించారు.ఎమ్మెల్యే కోండ్రు సంతకవిటి మండల టీడీపీ అధ్యక్షులు గట్టి భాను, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్, టీడీపీ నాయకులు కొల్ల యశస్సు కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడంతో మహానాడు ప్రాంగణం పసు పు పండుగను తలపిస్తోంది."జై తెలుగుదేశం" అనే నినాదాలతో తాలాడ,సురవరం మార్మోగుతోంది. మండల నలుమూలల నుండి తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ సైనికులను (కార్యకర్తలను),సీనియర్ మరియు జూనియర్ నాయకులను స్వయంగా కలిసి, ఆప్యాయంగా పలకరించుకోవడం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తలే తెలు గుదేశానికి అసలైన బలం నాయకులు కార్యకర్తలు త్యాగా లు,కష్టమే మన విజయాలకు మూలాధారం. విజయనగరం జిల్లా బిసి సెల్ అధ్యక్షులు గురవాన నారా యణరావు, మండల పీఏసీఎస్ చైర్మన్ చెలికా మహేష్ బాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్, మండల సీనియర్ నాయకులు గట్టి రఘుబాబు, మొయ్య నారాయణప్పుడు, మండల సీనియర్ నాయకులు మాజీ, తాజా సర్పంచ్‌లు ఎంపిటిసిలు అన్ని విభాగాల అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కోటబొమ్మాళిలో ఘనంగా మహానాడు



**కోటబొమ్మాళి, మే 27 ప్రభాతవార్త :**

కోటబొమ్మాళి, కొత్తపల్లి, తిలారు గ్రామాలలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో కార్యకర్తలు అమితోత్సహంతో పాల్గొన్నారు. క్లస్టర్లు పరిధిలో గ్రామాల నుంచి వందల సంఖ్యలో పసుపు చొక్కలు ధరించి తెరపై వచ్చిన అధి నాయకుల ప్రసంగాలు వింటూ కేరింతలు తప్పట్లుతో మారుమ్రోగించారు. ఎన్నడూ లేని విధంగా మండలాలలోనే ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో ఎక్కువ మంది హజరయ్యారు. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రసంగ కార్యకర్తలకే అధినాయకులని ప్రసంగించటంతో కేరింతలతో ప్రాంగణమంతా మారుమ్రోగింది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు శాసన సభలో తీర్మానం పంపించటం జరుగుతుందన్నారు. పార్టీలో కింది స్థాయి మహిళలకు పార్టీ పొలిట్ బ్యూరోలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మహిళలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవనంలో ముందుగా దివంగత నందమూరి తారక రామారావు, కింజరాపు ఎర్రన్నాయుడుల విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం రాష్ట్ర కాళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రమశిక్షణకే మారు పేరు అయన తెలుగుదేశం కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఉదయం సాయంత్రం సాంకేతిక పరమైన హాజరు వేసుకున్నారు. అలాగే కొత్తపల్లిలో జరిగిన మహానాడులో వందలాది మంది కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని ఉత్సహాంగా చివరి వరకు ఉన్నారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, జిల్లా మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్, గోవిందపురం డీసీ కర్రి అప్పారావు, మాజీ మండల ఉపాధ్యాక్షుడు కల్లి నాగయ్య రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యాక్షుడు గొండు లక్ష్మణరావు, కొత్తమ్మతల్లి పాలక మండలి అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, కల్లి శివ, కోరాడ గోవిందరావు, అలాగే కొత్తపల్లిలో పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, పూజారి శైలజ, చల్ల సింహాచలం, నాళ్ళ ఆదినారాయణ (చిన్ని), మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు చింతాల సింహాచలం, జి.నర్సింగరావు, నౌపడ రామారావు, తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. తిలారుతో మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు మహానాడుతో పాల్గొన్నారు.

## వెన్నుపోటుదారులకు పదవులా..?

### ప్రజా బలమున్న నేతలను పక్కన పెట్టడం ఏంటి? ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మాజీ టిడిపి నేతలు



**వీరఘట్టం, మే 27 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడిన వారికి మొండి చేయి చూపి, కూటమి పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తులకు నేడు అందలం ఎక్కించి, పదవులను కట్టబెట్టడం ఏమిటని టిడిపి తాజా మాజీ నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు. బుధవారం మండల కేంద్రంలోని జామి కాంప్లెక్స్‌లో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు ఉదయాన ఉదయకుమార్‌ల ఆధ్వర్యంలో వారంతా ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. తాము టిడిపి పార్టీ వీరాభిమానులమని, టిడిపి పార్టీని కుటుంబ సభ్యునిగా భావించి అహర్నిశలు శ్రమించామని వారన్నారు. తామంతా టిడిపి పార్టీ సభ్యత్వంతోనే కొనసాగుతున్నామని వారు గుర్తు చేశారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థి, ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు బహిరంగంగా తిరిగి, వ్యతిరేకంగా పనిచేసి ప్రతిపక్ష పార్టీకి దగ్గరుండి ఓట్లు వేయించారని వారంతా దుయ్యబట్టారు. అయితే అటువంటి వ్యక్తులకు నేడు తెలుగుదేశం పార్టీలో సముచిత స్థానాలను కేటాయిస్తూ గుర్తించారని, ఇది ఎంతవరకు సమంజసం అని వారు ఎదురు ప్రశ్నించారు. మండలంలో పార్టీ పరిస్థితి ఏ విధంగా ఉందో అధిష్టానం ఒక్కసారి ఆలోచన చేయాలని వారు కోరారు. ముఖ్యంగా ఇప్పుడు కొత్తగా పార్టీ పదవులు ఇచ్చిన వారికి ప్రజాబలం ఎంతుందో తాము చెప్పనక్కర్లేదని, అధిష్టానమే చొరవ చూపి వారి వారి బలాబలాలను తేల్చి చెప్పి వారు ఆ పదవులకు అర్హులో, అనర్హులో తేల్చి చెప్పాలన్నారు. తాము మహానాడుకు వ్యతిరేకం కాదని తాము కష్టపడిన దానికి ఫలితం లేకపోవటంతో తాము ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వారంతా సభాముఖంగా తెలిపారు. మండలంలో పదవులు కోల్పోయిన వారితో పాటు టిడిపి అభిమానులు, నాయకులు ఈ కార్యక్రమానికి విచ్చేసి మాజీ నాయకులకు తమ సంఘీభావాన్ని తెలుపుతూ తిరిగి వారికి పదవులను అప్పజెప్పి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అధిష్టానం ఆలోచన చేయాలని వారంతా ముక్తకంఠంతో కోరారు. కార్యక్రమంలో టిడిపి మాజీ పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు పొన్నాడ నాగేశ్వరరావు, చింత ఉమామహేశ్వరరావు, గొర్లె గౌరు నాయుడు, జంపు శేఖర్, లింగాల చంటి, చుక్క శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వీరఘట్టం, మే 27 ప్రభాతవార్త:**

వీరఘట్టం ఉపకేంద్రం పరిధిలో 11కేవీ ఎస్.నర్సిపురం ఫీడర్ నందు 11 కెవి పోల్స్ ఎరెక్షన్ పనుల నిమిత్తం గురువారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి విలేకరులకు తెలిపారు. అలాగే 11కెవి ఎస్.నర్సిపురం ఫీడర్ పరిధిలో పనులు చేయుటం వలన ఎస్.గోపాలపురం, ఎస్.గోపాలపురం కాలనీ, జె.గోపాలపురం మరియు అచ్చెపువలస గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయడం జరుగుతుందన్నారు. దయచేసి విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## కార్యకర్తలు నాయకులుగా ఎదిగేందుకే మహానాడు : కూన



**ఆముదాలవలస, మే 27 ప్రభాతవార్త:**

కార్యకర్తలు నాయకులుగా ఎదిగేందుకే క్లస్టర్ విధానంలో మహానాడు దోహదపడుతుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం వర్చువల్ విధానంలో ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమైన కార్యక్రమంలో శ్రీ కామే శ్వరి కళ్యాణ మండపంలో రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన క్లస్టర్ పరిధి ఆధ్వర్యంలో జరుగుతున్న వర్చువల్ మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్త అధినేత అన్నా మహోన్నత సిద్ధాంతాన్ని దేశానికి చాటి చెప్పిన చారిత్రాత్మక వేదిక మహానాడు అని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మహిళల సాధికారతకు అండగా నిలిచిందని, ఈసారి స్త్రీ శక్తి విధానంతో మహానాడు నిర్వహించడం గర్వకారణం అన్నారు. మహిళలును రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, బలోపేతం చేసిన పార్టీ తెలుగుదేశమేనని అన్నారు. మహిళల అభ్యున్నతి రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాదని పార్టీ ఎప్పటి నుంచో నమ్ముతుందన్నారు. మహానాడు2026 కేవలం పార్టీ సమావేశం కాదని, ఏపీ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసే చారిత్రాత్మక వేదికని రవికుమార్ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో వేగంగా నడిపించే సంకల్పానికి ఇది తొలి మెట్టు అవుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, యువత కార్మికుల సహా అన్ని వర్గాలకు ప్రభుత్వం ఏం చేయబోతుందనే దానిపై స్పష్టమైన కార్యచరణ 28న గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు వెల్లడిస్తారని అన్నారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, రాష్ట్రకాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, సంపతిరావు మురళీధర్, తమ్మినేని నాని, తమ్మినేని అమ ర్నాథ్, నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు, నాగళ్ళ మురళీధర్, బి.రామ్మోహన్, బుడుమూరు సీతారాం, తాండ్ర హరి, కూన ఆంజనేయుడు, కె.వి రాజలక్ష్మి, కనితి విజయలక్ష్మి భాయి, చాపర సుధాకర్, బోయని సునీత, రెడ్డి రాంబాబు, బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, ఎండ అప్పలనాయుడు, ఎండ భీష్మ, శెట్టి పద్మావతి, బాగాది భాస్కరరావు, జీడి ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వీరఘట్టంలో ఘనంగా మహానాడు



**వీరఘట్టం, మే 27 ప్రభాతవార్త :**

జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టిడిపి పార్టీ పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పడాల భూదేవి నేతృత్వంలో వీరఘట్టం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు సాసుబిల్లి వెంకటరమణ (బుజ్జి) అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలోని స్వామి థియేటర్‌లో డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. దృశ్య శ్రవణం ద్వారా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో టిడిపి పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేసిన సందేశాన్ని వందలాదిమంది పాల్గొన్న టీడీపీ కుటుంభ సభ్యుల ఎంతో ఆసక్తిగా తిలకించారు. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఖండాపు వెంకటరమణ, గేదెల రమేష్ నాయుడు, ఉపాధ్యక్షులు గుడివాడ మహేష్, గేదెల గజేంద్ర నాయుడు, వీరఘట్టం పట్టణ శాఖ అధ్యక్షులు పప్పల మహేష్, తమరాపు అప్పలనాయుడు, సాధు నారాయణరావు, గర్భాన శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు,కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## గూనభద్రలో ఘనంగా విద్యాపురస్కారాల ప్రదానం



**కొత్తూరు, మే 27 ప్రభాతవార్త :**

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడం, అన్ని తరాల వారిని ఒకే వేదికపైకి తీసుకురావడం, విభిన్న రంగాల్లో రాణిస్తూ గ్రామానికి పేరు తెస్తున్న సాధకులను ప్రోత్సహించడమే ప్రధాన ఆశయంగా ఏర్పాటైన మన ఊరు మన వారసత్వం సంస్థ ఆధ్వర్యంలో కొత్తూరు మండలంలోని గూనభద్ర పునరావాస గ్రామంలో విద్యార్థుల సత్కార కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వివిధ విద్యా, ప్రతిభా పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రతిభా అన్వేషణ పరీక్షలో విద్యార్థివేతనం సాధించిన లండ గౌరిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పదవ తరగతి ఫలితాల్లో ఐదు వందల కంటే ఎక్కువ మార్కులు సాధించి ప్రతిభ చాటిన తలే చైతన్య, ధర్మాన తనూజ, పెద్దకోట సుప్రియ, అరిసెల్లి తనుశ్రీ, పెద్దకోట జస్వంత్‌లను, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎనిమిది వందల యాభై కంటే ఎక్కువ మార్కులు సాధించిన ముద్ద ఝాన్సీని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. వీరితో పాటు ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాలు మరియు ఆంధ్రప్రదేశ్ నివాస పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన బర్రి జస్మిత, పెద్దకోట ప్రజ్ఞశ్రీ, పెద్దకోట తన్విశ్రీలను, అలాగే విభిన్న ప్రతిభా పరీక్షలలో పాల్గొని మండల మరియు జిల్లా స్థాయిల్లో ఎంపికైన కోనారి జ్ఞానేశ్వరి, పెద్దకోట కార్తికేయలను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో గౌరవించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు గూనభద్ర గ్రామానికి ఎంతో గర్వకారణమని, రాబోయే రోజుల్లో వీరంతా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పిల్లలను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులను కూడా ఈ వేదికపై ప్రత్యేకంగా సన్మానించారు. మన ఊరు మన వారసత్వం సంస్థ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా సంక్షేమం కోసమే మహానాడు : కూన



**బూర్జ, మే 27 ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం మహానాడు కార్యక్రమాన్ని ఒక పండుగ వాతావరణంలా బూర్జ మండలం దొంకలపర్త, కొల్లివలస గ్రామాల్లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబర్‌లో స్థానిక సంస్థలు ఎన్నికలకు కార్యకర్తల సిద్ధంగా ఉండాలని కోరారు. ఐకమత్యంగా క్రమ శిక్షణతో కార్యకర్తలు కలిసి పనిచేయాలని తెలిపారు. పేదలకు కావలసింది పథకాలు.. గొడ్డలి వేట్లు కాదు, యువతకి కావలసింది ఉద్యోగాలు.. గొడ్డలి పోట్లు కాదు.. రాష్ట్రానికి కావలసింది శాంతి భద్రతలు..రక్తాభిషేకాలు కాదు.. రక్త చరిత్ర రాసే వాళ్ళు.. స్వర్ణాంధ్ర చరిత్ర లిఖించలేరని ఎమ్మెల్యే అన్నారు. మార్కెట్ ఫెడ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వప్రసాద్, క్లస్టర్ ఇంచార్జ్ పి.సీతబాబు, మండల అధ్యక్షుడు వి.రాంజీ, నగర కులం డైరెక్టర్, కన్నంనాయుడు, ప్రభాకర్ రావు, గోపి మాస్టర్, కృష్ణ, సర్పంచులు ఎంపీటీసీలు, కార్యకర్తలు హాజరయ్యారు.

# శ్రీకాకుళం వార్త



## లక్ష్మీకల్యాణ మండపంలో మహానాడు



**మెళియాపుట్టి, మే 27 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రతి ఏటా జరిగే మహానాడు కార్యక్రమం ఈ ఏడాది ఇంధన పొదుపు భాగంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో క్లస్టర్ వైజ్ హైబ్రిడ్ పర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయి కార్యకర్తలకు నాయకులకు అనుసంధానం చేయడా నికి కల్పించిన అవకాశంలో భాగంగా పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు సూచన మేరకు మెళియాపుట్టి మండలం క్లస్టర్ నెంబర్ 3 పడాల శ్రీను ఆధ్వర్యంలో లక్ష్మి కళ్యాణ మండపంలో మహానాడు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 10 గ్రామ పంచాయతీలకు సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే భోజన ఏర్పాటు సదుపాయం కల్పించారు.

## బోరుభద్రలో ఘనంగా మహానాడు



**సంతబొమ్మాళి, మే 27 ప్రభాతవార్త :**

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహనీయుడు అని తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. బుధవారం బోరుభద్ర క్లస్టర్‌లో మినీ మహానాడు కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జై తెలుగుదేశం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వినాయకుడు ఆలయం వద్ద ఉన్న మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు పిఎసిఎస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, అప్పిని వెంకటేష్, రెడ్డి అప్పన్న, చిదపాన ధర్మార్జున రెడ్డి, బాడాన వెంకటరమణమ్మ, దుపాన రమణారెడ్డి, పంగ ఆసిరినాయుడు, మెండ అప్పారావు, పట్నాన అప్పలరాజు, వజ్జ ప్రభాకర్ వివిధ పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, తెదేపా పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్ఐ



**సంతకవిటి, మే 27 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో బుధవారం ఎస్సై ఆర్.గోపాలరావు మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి గ్రామస్తులకు తెలిపారు. అలాగే అక్కడక్కడ సైబర్ మోసాలు బాగా జరుగుతున్నాయి కాబట్టి జాగ్రత్తగా ఉండండి. మొబైల్‌లో ఎటువంటి ఓటీపీలు కూడా చెప్పకండి. తెలియని లింకులపై క్లిక్ చేసి మీ డబ్బులను పోగొట్టుకోకండి. అలాగే ఎక్కడికక్కడ మహిళలపై అత్యాచారాలు, బంగారు దొంగతనాలు జరుగుతున్నాయి. కాబట్టి జాగ్రత్త వహించండి. రహదారి భద్రతా చర్యలు తప్పక పాటించండి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి వాహనాల నడిపేటప్పుడు అతివేగంగా ప్రయాణించకుండా జాగ్రత్త వహించండి. హెల్మెట్ ధరించి వాహనాలు నడపండని ఎస్ఐ సూచించారు.

## రక్తదానం అమూల్యం



**ఇచ్ఛాపురం, మే 27 ప్రభాతవార్త :**

బుధవారం బరంపురం ప్రభుత్వ హాస్పిటల్‌లో బ్లడ్ కోసం ఒక వ్యక్తికి అత్యవసర పరిస్థితుల్లో బి+ బ్లడ్ డోనర్ కావాలని సమాచారాన్ని చెప్పగా వెంటనే నరసింహ అనే యువకుడు స్పందించి ఎంకెసిజి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి తన బి+ బ్లడ్ జీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా బ్లడ్ డొనేట్ చేసి వచ్చారు. సకాలంలో రక్తదానం చేసిన నరసింహకు అందరి తరపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు



**కోటబొమ్మాళి, మే 27 ప్రభాతవార్త :**

ఈ ఖరీఫ్ సీజన్‌కు రాయితీపై వరి విత్తనాలు రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. కేజీకి రూ.10 రాయితీపై 30 కేజీలు బస్తా 300 రూపాయలకి రాయితీపై రైతులకు అందజేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎంటియు 1061 (ఇంద్ర. ఎంటియు 7029 (స్వర్ణ) ఎం టి యు 1318. ఎం టి యు 12 24. బి పి టి 5204. ఎం టి యు 1121. రకాల విత్తనాలు 930 క్వింటాళ్లు 20 రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు చేయడం జరిగిందన్నారు.

## వాటర్ షెడ్ పనులు వేగవంతం చేయాలి



**కోటబొమ్మాళి, మే 27 ప్రభాతవార్త :**

మండలంలో జరుగుతున్న తెలి నీలాపురం వాటర్ షెడ్ పనులను వేగవంతం చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పాలక సంచాలకులు బి.లవరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలో తిలారు, చిన్న బమ్మిడి, జీఎన్ పేట. కస్తూరి పాడు గ్రామాల్లో జరుగుతున్న వాటర్ షెడ్ పనుల నిర్మాణాలను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కాలం సమీపిస్తున్నందున త్వరితగతిన ఈ పనులను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈయన వెంట టెక్కలి ఏపిడి శైలజ. కోటబొమ్మాళి ఏపీవో జి.హరిప్రసాద్. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ టి రాంబాబు, సాంకేతిక సహాయకుడు ఎం రవి. రమేష్. ఇరిగేషన్ జేఈ డి.లోకేష్ తదితరులు ఉన్నారు.

## చిన్నారి గీతకను ఆదుకోండి



**రాజాం, మే 27 ప్రభాతవార్త :**

రాజాం పట్టణంలోని చిక్కాల వీధికి చెందిన శ్రీదేవి-సత్యనారాయణ దంపతుల ఆరేళ్ల కుమార్తె గీతిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది.చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలోని ఆసుపత్రిని సంప్రదించగా, శస్త్రచికిత్సకు కనీసం రూ.2 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో ఆ మొత్తాన్ని సమకూర్చలేక తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.గీతిక తండ్రి డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వచ్చే స్వల్ప ఆదాయంతో కుటుంబ పోషణే కష్టంగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో కుమార్తెకు ఆపరేషన్ ఎలా చేయించాలో అర్థం కావడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. గీతికకు ఒక తమ్ముడు కూడా ఉన్నాడు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహాయం చేస్తే మా బిడ్డ ప్రాణాలు కాపాడుకోవచ్చు అంటూ గీతిక తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. సహాయం చేసే మనసున్న వారు స్పందించి చిన్నారి జీవితంలో వెలుగు నింపాలని స్థానికులు కోరుతున్నారు.

## బీఎస్పీ పార్టీ కార్యాలయంలో రమాబాయి వర్ధంతి



**రాజాం, మే 27 ప్రభాతవార్త :**

మాతా రమాబాయి అంబేద్కర్ 90వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన రాజాం నియోజకవర్గం దళిత సంఘాల జే.ఏ.సీ విజయనగరం జిల్లా రాజాం బీఎస్పీ కార్యాలయంలో మాత రమాబాయి అంబేద్కర్ 90వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆమెను స్మరిస్తూ రమాబాయి భీమ్రావ్ అంబేద్కర్‌కు 1906లో 9 ఏళ్ల వయసులో బాబాసాహెబ్‌తో వివాహం జరిగిందని ఆమె మరణం 27 మే 1935, దాదర్ ముంబై లో మరణించారని అయితే బాబాసాహెబ్ చదువుకోసం అమెరికా, లండన్ వెళ్ళినప్పుడు రమాబాయి తిండికి కూడా లేకుండా కష్టపడ్డారని అన్నారు. నా విజయం వెనుక రమాబాయి కన్నీళ్లు, ఆకలి ఉన్నాయి. ఆమె లేకపోతే నేను ఈ స్థాయికి వచ్చేవాడిని కాదు. ఆమె నా జీవితంలో వెలిగిన దీపం అని అంబేద్కర్ అన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్మార్వో దేబారికి రామప్పుడు, బిఎస్పీ జిల్లా అధ్యక్షులు బొత్స బుద్ధుడు, గుణాపు తవిటియ్య, ఎద్దు మురళి, తేగల మోహన్, నివర్తి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ రంగంలో మహిళలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే



**పలాస, మే 27 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారని, రాజకీయ రంగంలో మహిళలను ప్రోత్స హిస్తున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహానాడులో ఆ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాజకీయాల్లో మహిళలు అనే అంశంపై మాట్లాడుతూ పార్లమెంట్‌లో ఇటీవల మహిళా బిల్లు వీగిపోయినప్పటికీ టిడిపి మాత్రం మహిళలకు 33శాతం రాజకీయాల్లో చోటు కల్పిస్తుందని ప్రకటించారు. దీంతో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆది నుంచి రాజకీయరంగంలో మహిళలకు ఎనలేని ప్రోత్సాహం అందిస్తున్నారని, ఓ మహిళను శాసనసభాపతిగా ఎన్నుకున్న ఘనత టిడిపిదని గుర్తు చేశారు.

## బొబ్బిలి నియోజకవర్గంలో ఘనంగా మహానాడు



బొబ్బిలి, మే 27, ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీకి ఎంతో కీలకమైన "మహానాడు" కార్యక్రమం హైబ్రిడ్ మోడల్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నారు.. బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న 10 క్లస్టర్లులో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని, మొదటిరోజు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బొబ్బిలి పట్టణంలో "కళింగ వైద్యభవనం" లో ఏర్పాటు చేసిన మహానాడు (బొబ్బిలి పట్టణానికి చెందిన 3 మరియు 4 క్లాస్టర్లు) వద్ద గౌరవ శాసనసభ్యులు లిఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) పాల్గొన్నారు.. అనంతరం, బొబ్బిలి రూరల్ కు సంబందించిన క్లస్టర్లు 1,2 వద్ద జరుగుతున్న మహానాడు కార్యక్రమం వద్దకు వెళ్లి, పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి లైవ్ స్క్రీన్ లో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రసంగం, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుప్రసంగం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రసంగాన్ని ఇతర రాష్ట్ర స్థాయి నాయకుల ప్రసంగాన్ని ఎమ్మెల్యే బేబీనాయన గారు వీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు తమ ఇంటి పండుగగా జరుపుకునే మహానాడు ఈ సంవత్సరం మన నియోజకవర్గంలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలుమేరకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం ప్రతి నియోజకవర్గంలో క్లస్టర్ల వారీగా నాయకులు, కార్యకర్తలతో కలిసి మహానాడు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.. క్లస్టర్ల వారీగా ఏర్పాట్లు చేసి, మహానాడు చేయడం కష్టతరం అవుతుందేమో అనుకున్నా కానీ, ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పసుపు పండుగలో పాల్గొన్నారని, వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే, మహానాడు కార్యక్రమాన్ని, మన తెలుగుదేశం కుటుంబసభ్యులు అందరితో జరుపుకునే అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధినాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. అనంతరం, మహానాడుకి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన భోజనాల వద్ద, వారితో కలిసి భోజనం చేసారు. కళింగ వైశ్య భవనంలో బంకురు బాబురావు ఆధ్వర్యంలో రూరల్ మహానాడు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలతో పాటు తీన్మార్ దప్పులు స్టెప్పులు వేశారు. కార్యకర్తలు ఉత్పత్తి ఆనందపరిచారు.

## అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటూ తొలగించం : కలెక్టర్



విజయనగరం, మే 27: ప్రభాతవార్త:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన ఏ ఒక్కరి ఓటును తొలగించే ప్రసక్తే లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. అత్యంత ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడం, అర్హులందరికీ ఓటుహక్కు కల్పించడమే ఈ ప్రత్యేక సవరణ ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో పక్కాగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, ఇఆర్ఓలతో జిల్లా కలెక్టర్ ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సర్‌లో భాగంగా చేపట్టాల్సిన విధులు, నిబంధనలను పవర్ పాయింట్ ద్వారా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల ప్రకారం జూలై 1, 2026 అర్హత తేదీగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జూన్ 15 నుండి ప్రారంభం కానుందని తెలిపారు. 18 ఏళ్లు నిండిన, అర్హులైన కొత్త వారందరికీ ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 5 నుండి 14 వరకు శిక్షణ, ఫారాల ముద్రణ వంటి సన్నాహక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) జిల్లావ్యాప్తంగా ప్రతీ ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నమోదు చెప్పారు. ఇదే సమయంలో కొత్త ఓటర్లనుంచి కూడా ధరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. ఈ సర్వే ద్వారా ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దడం, మరణించిన వారి లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపడతామన్నారు. 2001 ఓటర్ల జాబితాతో సరిపోల్చడం జరుగుతుందని చెప్పారు. సాధ్యమైనంతగా ఇకే కుటుంబం వారి ఓట్లన్నిటినీ ఒకే పోలింగ్ కేంద్రంలో వచ్చేటట్టు చూడాలని సూచించారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200కు మించి ఓట్లు ఉండకూడదని స్పష్టం చేశారు. జూలై 21న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించి, ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం అన్నింటినీ పరిశీలించి సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని షెడ్యూల్‌ను వివరింఈ సవరణ ప్రక్రియలో, తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించే ప్రక్రియలో బిఎల్ఓల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. వీరందరికీ జూన్ 5 నుండి 10 వరకు, అలాగే బూత్ లెవెల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) జూన్ 10 నుండి 13 వరకు పూర్తిస్థాయి శిక్షణా తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని చెప్పారు. మే 28 నాటికి ఈసీఐ నెట్‌లో ఎన్యుమరేషన్ ఫారాల జనరేషన్‌కు అనుమతి లభిస్తుందని, వాటిని తక్షణమే ముద్రించి జూన్ 14 లోగా బీఎల్ఓ కిట్లతో పాటు సిబ్బందికి అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితానుంచి పేరు తొలగించేటప్పుడు ముందుగా వారికి నోటీసు ఇచ్చి, వారిచ్చిన సమాధానం ఆధారంగానే తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఒకవేళ జాబితానుంచి పేరు తొలగించినప్పటికీ, వారికి అభ్యంతరం ఉన్న పక్షంలో జిల్లా ఎన్నికల అధికారికి లేదా ఎన్నికల కమిషన్ సిఈఓకు అప్పీలు చేసుకొనే అవకాశం కూడా ఓటర్లకు ఉందని స్పష్టం చేశారు. తాళం వేసి ఉన్న ఇళ్లకు మూడు సార్లు బిఎల్ ఓలు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఓటర్లనుంచి ఫోన్ ద్వారా కూడా సమాచారం అందే అవకాశం ఉందని, అందువల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా యంత్రాంగం పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్‌తో పాటు పలువురు ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఆయిల్ బాల్స్‌తో దోమల నివారణ



కురుపాం, మే 27, ప్రభాతవార్త :

వాగులున్న ప్రతీ గ్రామంలోనూ తప్పకుండా లార్వా పరిశీలన జరపాలని, స్థానిక సచివాలయ కార్యదర్శుల ద్వారా 'ఆయిల్ బాల్స్' వేయించి లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలని జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ ఆదేశించారు. కురుపాం మండలం బియ్యాల వలస పంచాయతీ పరిధిలోని గుజ్జల గండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన నిమ్మక వరుణ్ తేజ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శిం చారు. ఈ సందర్భంగా లార్వా, దోమల నివారణ పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.?వాగుల్లో లార్వా గుర్తింపు అనంతరం జిల్లా కన్సల్టెంట్ రామచంద్రతో కలిసి గ్రామానికి ఆనుకొని ఉన్న వాగులో నాలుగు చోట్ల లార్వా తనిఖీలు చేపట్టారు. అక్కడ ప్రతిచోటా పుష్కలంగా లార్వా వృద్ధి చెందడాన్ని అధికారులు గుర్తించారు. దీనిపై స్పందించిన జిల్లా అధికారివెంటనే సచివాలయ కార్యదర్శితో మాట్లాడి వాగులో ఆయిల్ బాల్స్ వేయించాలని, అప్పుడే దోమలను సమూలంగా నిర్మూలించగలమని స్పష్టం చేశారు. అనంతరం దుద్దుఖల్లు పీహెచ్‌సీ పరిధిలోని పురుష ఆరోగ్య కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మీ మీ ఏటీపీ ప్రణాళిక ప్రకారం క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి గ్రామాన్ని పది రోజులకొకసారి తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. .దుద్దుఖల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులను వైద్యాధికారి పరామర్శించారు. ఆసుపత్రికి వస్తున్న దినసరి రోగుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సేవల గురించి అక్కడి డాక్టర్ దిలీప్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సూపర్‌వైజర్ జయ, సబ్ యూనిట్ అధికారి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మహానాడు వేడుకలు



కొమరాడ మే 27 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం మండలంలో ఘనంగా జరుపుకున్నారు కేంద్ర కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మహానాడు కార్యక్రమాన్ని తెలుగు తమ్ముళ్లు వీక్షించారు. కొమరాడ మండల తెదేపా కన్వీనర్ ఉదయ శేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో కొమరాడ ,మాదలంగి, మార్కొండ పుట్టి గ్రామాలలో మహానాడు కార్యక్రమాన్ని టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేసి వీక్షించారు. మూడు క్లస్టర్ల పరిధిలో ఉండే నాయకులు, కార్యకర్తలు క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురంలో ఘనంగా మహానాడు వేడుకలు



భోగాపురం, మే 27,(ప్రభాతవార్త) :

తెలుగుదేశం పార్టీని గ్రామస్థాయిలోనే బలోపేతం చేయాలని టిడిపి మండల శాఖ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి నీలాపు అప్పలరామిరెడ్డి (ఎస్‌పిఎల్) పిలుపునిచ్చారు. భోగాపురం మండల కేంద్రంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మహానాడు వేడుకల్లో టిడిపి మండలశాఖ అధ్యక్షులు కుర్రోతు సత్యనారాయణ, విజయనగరం జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి నీలాపు అప్పలరామిరెడ్డి(ఎస్ పి ఎల్) ముఖ్య అతిథులుగా హాజరై దివంగత నేత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పార్టీని బలపేతం చేయడమే లక్ష్యంగా భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మహానాడు వేదికగా పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడుతూ, పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిడుగు తోటరావు, గరే వెంకటరమణ, పిడుగు వెంకటసత్యం, కోలా రామసూరి, పసుపులేటి లోకేష్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు



మెరకముడిదాం, మే 27 ప్రభాతవార్త :

మెరకముడిదాం మండలం బుధరాయవలస గ్రామం దాటిన తర్వాత గర్భాశీ నుండి మెరకముడిదాం వైపు వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురుకి గాయాలు అయ్యాయి. అందులో ఇద్దరు వ్యక్తులుకు స్వల్ప గాయాలు కాగా మూడవ వ్యక్తి అయిన ఉత్తరావల్లి గ్రామానికి చెందిన కూరగాయలు వ్యాపారి ఆర్ పార్వతమ్మకు తలపైన, ముఖం మీద బలమైన గాయాలు అయ్యాయి. వీరిని 108 సహాయంతో చీపురుపల్లి సీ హెచ్ సీ కి వైద్యం నిమిత్తం తలలించారు. డ్రైవర్ ఆటోని అతి వేగంగా నడపటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తుంది. సంఘటనా స్థలాన్ని బుదరాయవలస పోలీసులు సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పదవీ విరమణ పొందిన హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాది శ్రావణ్ కుమార్



పాచిపెంట, మే 27, ప్రభాత వార్త :

ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి చికాటి మానవేంద్ర రాయ్ పదవీ విరమణ అనంతరం, మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది నైదాన శ్రావణ్ కుమార్ దంపతులు మర్యాదపూర్వకంగా హైకోర్టు జడ్జి (పదవీ విరమణ చేసిన) నీ కలిశారు. పదవి వివరణ చేసిన హైకోర్టు జడ్జి మన్యం జిల్లా పార్వతీపురం కావడంతో, మరియు హైకోర్టు న్యాయవాది శ్రావణ్ కుమార్ పార్వతిపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కావడం విశేషం. ఆయన సేవలు కొనియాడుతూ ఆయన్ని కుటుంబ నా సభ్యుల కలిసి దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. ఆయన సేవలు ఇచ్చిన తీర్పులు న్యాయరంగానికి మార్గదర్శకమని, న్యాయ దేవతకు ఆయన అందించిన సేవలు మరువలేనివని న్యాయవాది అభిప్రాయపడ్డారు."

## అదృశ్యమైన వృద్ధురాలిని కుటుంబీకులకి అప్పగించిన ఎస్ఐ




గరివిడి, మే27, ప్రభాత వార్త :

కుటుంబీకులతోతిరుపతి ప్రయాణం చేస్తూ మార్గమధ్యలో తప్పి పోయిన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం నెలవంక గ్రామానికి చెందిన బుగత జేజమ్మ అనే వృద్ధు రాలిని గరివిడి ఎస్ ఐ బి.లోకేశ్వర రావు కుటుంబీకులు కి అప్పగించారు. తిరుపతి రైలు లో వెళ్తున్న ఆమె చీపురుపల్లి రైల్వే స్టేషన్ లో అర్ధరాత్రి సమయంలో కుటుంబీకులు కి తెలియకుండా దిగి పోయారు. గరివిడి మండలం అప్పన్న వలస గ్రామ శివారున అచేతనంగా కనిపించిన ఆమె సమాచారాన్ని అప్పన్న వలస గ్రామస్థులు గరివిడి పోలీసులు కి అందించారు. ఎస్ ఐ బి.లోకేశ్వర రావు కుటుంబీకులు సమాచారాన్ని సేకరించి వృద్ధురాలి జేజమ్మ ను వారికి అప్పగించారు. తొలుత చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమెకు మెరుగైన వైద్యాన్ని అందించారు. వృద్ధురాలు కుటుంబీకులు ఎస్ఐ లోకేశ్వర రావు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పసుపుమయంగా రామభద్రపురం .. వర్చువల్‌లో మహానాడు



రామభద్రపురం, మే 27, ప్రభాత వార్త :

తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ గా నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ రామభద్రపురం క్లస్టర్లో బుధవారం లభించింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీకార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో మహానాడు వర్చువల్ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేశారు. విశాలమైన లేఅవుట్ ప్రాంగణంలో తెదేపా జెండాలతో పాటు బ్యానర్లు పసుపు మయంగా మారిపోయాయి. వర్చువల్‌గా నిర్వహించే భారీ తెరను ఏర్పాటు చేయడమే కాకుండా ఈ కార్యక్రమానికి అధికమంది తెలుగు తమ్ముళ్లు హాజరవడంతో వారంతా తిలకించేందుకు ఎక్కడకక్కడ స్పీకర్లను ఏర్పాటు చేశారు. మహానాడు వర్చువల్ గా నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ బాబు ఉపన్యాసాలను తెలుగు తమ్ముళ్లు ఆసక్తికరంగా తిలకించడమే కాకుండా, విధాన నిర్ణయిక మండలి సభ్యులతోపాటు మంత్రులు నిర్వహించే ఉపన్యాసాలను తెలుగు తమ్ముళ్లు క్రమశిక్షణతో ఆసక్తికరంగా తిలకించారు. పరిధిలోతెలుగు తమ్ముళ్లు విచ్చేయడంతో వారందరికీ అల్పాహారంతో పాటు భోజన సదుపాయలు ఏర్పాటు చేయడంతో తెలుగు తమ్ముళ్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వర్చువల్ మహానాడు సమావేశానికి తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కరుణ విజయభాస్కర్ రావు క్లస్టర్ మాజీ ఇన్చార్జి వసంతలసన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల సంక్షేమమే టిడిపి ధ్యేయం



నెల్లిమర్ల, మే 27, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. మండల కేంద్రం నెల్లిమర్లలోని పార్టీ కార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. తొలిత పార్టీ జెండాన్ని ఆవిష్కరించారు. స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు, పార్టీ నగర పంచాయతీ కమిటీ అధ్యక్షుడు లెంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ అట్టాడ శ్రీధర్ (బుజ్జి )ల ఆధ్వర్యంలో జరిగిన సభా కార్యక్రమంలో రవి శేఖర్ మాట్లాడారు. ప్రధానంగా పేదల సంక్షేమం కోసం ఎన్టీ రామారావు 43 సంవత్సరాల క్రితం ఈ పార్టీని ప్రారంభించారని. అప్పటినుంచి తొలి జపాలు రాష్ట్ర అధికారాన్ని చేపట్టి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తాయని అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ప్రధాన లక్ష్యాలైన కూడు, గూడు, గుడ్డ సాధన కోసం పార్టీ పాలకులు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం దేశవ్యాప్తంగా ఆదర్శప్రాయం అయిందని రవిశేఖర్ వివరించారు. ప్రస్తుత కూటమి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు సమర్థవం తంగా అమలు జరుగుతున్నాయన్నారు. మండలంలోని రామతీర్థం, కొండ వెలగాడ క్లస్టర్లలో జరిగిన కార్యక్రమాల్లో కూడా రవిశేఖర్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ నాయకులు కడగల ఆనంద్ కుమార్, లెంక అప్పలనాయుడు, గేదెల రాజా రావు,అట్టాడ శ్రీధర్, అవనాపు సత్యనారాయణ, తాడి సత్యనారాయణ, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాస రావు, దంతులూరి అజయ్ బాబు, మొయిద సత్యనారాయణ (శ్రీను), లెంక హైమావతి, చందక గౌరీ, కింతాడ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## పార్టీ జెండా మోసిన వారికే గుర్తింపు : ఎమ్మెల్యే



బలిజిపేట మే 27 ప్రభాతవార్త :

బలిజిపేట మండలంలో బలిజిపేట, బర్లి మినీ మహానాడు సభలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పార్వతిపురం నియోజకవర్గం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పిలుపు బలిజిపేట: తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే పార్టీ అధిష్టానం ఉన్నత పదవులు ఇచ్చి గౌరవిస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. బుధవారం బలిజిపేట, బర్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించిన మినీ మహానాడు సభల్లో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడుతున్న కార్యకర్తలే నేడు కీలక పదవుల్లో కొనసాగుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలు, అంకితభావమే తెలుగుదేశం పార్టీ బలమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమానికి అంబాసిడర్‌గా నిలుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించి అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పచ్చ జెండా రెపరెపలాడేలా గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన "స్త్రీ శక్తి" పథకం మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం డ్వాక్రా వంటి పథకాలను తీసుకువచ్చిన ఘనత పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకే దక్కుతుందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ఆశయాలనే మార్గదర్శకంగా తీసుకుని చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ రాష్ట్ర పురోగతికి బాటలు వేస్తున్నారని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరుకు పార్లమెంటు ఉపాధ్యక్షులు బోరాడ రామ్మోహన్ నాయుడు క్లస్టర్ ఇంచార్జ్ రాంబాబు తెలుగుదేశం నాయకులు పాపి నాయుడు పాపారావు పెద అంకలం ఆయకట్టు చైర్మన్ గౌరు నాయుడు గులిపల్లి మురళి శ్రీకాంత్ పింకీ రామ్మోహన్ నాయుడు వివిధ గ్రామాల నుండి వచ్చిన నాయకులు అభిమానులు బర్లి మినీ మహానాడులో పాల్గొన్న క్లస్టర్ ఇంచార్జ్ గుల్ల బాబ్జి గులిపల్లి నాని అప్పలనాయుడు సత్యం నాయుడు గుల్ల సింహాచలం నాయుడు రెడ్డి సత్యనారాయణ దూది భాస్కరరావు గణేష్ కురుటు గోవిందా తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మా పాపకు ప్రాణభిక్ష పెట్టండి.. మొరపెట్టుకున్న తల్లిదండ్రులు

దత్తిరాజేరు, మే 27, ప్రభాతవార్త :

గుచ్చిమి గ్రామానికి చెందిన సొంగల రామనాయుడు రూప దంపతులకు 6 నెలల కూతురు మోహిష జన్మించింది ఆ పాపకు పుట్టుకతోనే అరుదైన వ్యాధి ఎస్ఎంఏ లాంటి అరుదైన జెనెటిక్ వ్యాధి సోకొనట్లు వైద్యుల నిర్ధారించారు ఈ వ్యాధి పూర్తిగా నయం కావాలంటే 16 కోట్లు ఖరీదైన ఇంజక్షన్ విదేశాల నుంచి తెప్పించి వేస్తే కానీ మీ పాప బ్రతకదని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు ప్రభుత్వమే మా పాపను ఆదుకోవాలని కోరారు మొదటి సంతానంలో బాబు మోహన వంశీ 8 నెలలు ఉండి అరుదైన వ్యాధితో మరణించాడని రెండోసారి బాబు హర్షవర్ధన్ పుట్టాడు ఆరోగ్యంగా ఉన్నా డని మూడోసారి పాప మోహిష ఉంటుందని పాప పుట్టి రెండు నెలలు అవుతున్న పెరగలేదని హైదరాబాద్ మల్లారెడ్డి హాస్పిటల్ కి తీసుకువెళ్లి డాక్టర్ కి చూపించగా ఆయన వైద్య పరీక్షలు చేయడంతో పాపకి ఎస్ఎంఏ లాంటి అరుదైన జెనెటిక్ వ్యాధి ఉందని 16 కోట్ల ఖరీదైన ఇంజక్షన్ వేస్తే గాని మీ పాప బ్రతకదని వైద్యులు చెప్పారన్నారు అక్కడ నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి వెళ్ళామని అక్కడి ఇదే పరిస్థితి 18 నెలల్లోపు ఇంజక్షన్ వేయకపోతే బ్రతకదని వైద్యులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని ప్రభుత్వం 20 లక్షల వరకు ప్రభుత్వం భరిస్తుందని ఆయన అన్నారు ప్రస్తుతం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స చేస్తున్నారన్నారు.

## ఘనంగా ప్రారంభమైన మహానాడు వేడుకలు



కొత్తవలస , మే 27 , (ప్రభాతవార్త ):

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో కేంద్ర కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మహానాడు కార్యక్రమాన్ని తెలుగు తమ్ముళ్లు వీక్షించారు. కొత్తవలస మండల తెదేపా కార్యకర్తలు మహానాడు కార్యక్రమాన్ని టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేసి వీక్షించారు. క్లస్టర్ల పరిధిలో ఉండే నాయకులు, కార్యకర్తలు క్లస్టర్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల అభ్యున్నతే టిడిపి లక్ష్యం : కర్రోతు



భోగాపురం, మే 27, ప్రభాతవార్త :

"తెలుగుజాతి ప్రగతి , తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం ఏర్పడిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లి లో బుధవారం నిర్వహించిన మహానాడు కార్యక్రమాన్ని బంగారురాజు లాంచనంగా ప్రారంభోత్సవం చేశారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బంగార్రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఏడాదికి ఒక్కసారి అంగరంగ వైభవంగా ఆత్మీయ వాతావరణంలో మహానాడు ను జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. తెలుగుదేశం పార్టీ అంటే కార్యకర్తలకు అండ, ఓ క్రమశిక్షణ, త్యాగం, బలం సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబమన్నారు.. నియోజకవర్గంలో ఉన్నటు వంటి 10 క్లస్టర్ల లో ఘనంగా మొదటిరోజు మహానాడు వేడుకలను నిర్వహించడం జరిగిందని అన్నారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి అప్పలస్వామి , కో ఇంచార్జి కోరాడ తాతారావు , తెలుగు యువత నాయకుడు కర్రోతు రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పసుపు జెండాలతో దద్దరిల్లిన మహానాడు



దత్తిరాజేరు మే 27 ప్రభాత వార్త :

మండలంలోని దత్తి కోమటిపల్లి పెదమానాపురం కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూడు కళ్యాణ మండపంలో కార్యకర్తలు పసుపు జెండాలతో మహానాడును క్లస్టర్ ఇంచార్జిలు పెద్దింటి మోహన్ మిత్తి రెడ్డి ఈశ్వరరావు బోడ సింగ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమం విజయవంతంగా జరిగిందన్నారు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి అతి పెద్ద పండుగ మహానాడుని కార్యకర్త పార్టీకిఅధినేత అని గొప్పగా చాటి చెప్పేది మహానాడు అని తెలిపారు ఈ రెండేళ్లు ప్రభుత్వం విజయాలను మహానాడు వేదికల మీద నుంచి కార్యకర్తలు నాయకులు ద్వారా ప్రజలకు వివరించారు అన్నారు మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీకి ఎంతో ప్రతిష్టాత్మకమైనదని గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీలు యూనిట్ ఇన్చార్జీలు బూత్ కన్వీనర్లు మండల స్థాయి గ్రామస్థాయి తెలుగుదేశం వివిధ కమిటీల్లో ఉన్న సభ్యులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి శ్రామికులతో ఎస్ఐ సమావేశం



డెంకాడ, మే 27 ప్రభాతవార్త :

మండలంలోని సింగవరం పంచాయతీలో ఉపాధి పనులు చేస్తున్న మహిళలతో డెంకాడ ఎస్సై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత పట్ల పలు అంశాలపై అవగాహన చేశారు. అలాగే ఉమెన్ సేఫ్టీ మహిళల రక్షణ పై పోలీస్ సేవలపై ఆయన వివరించారు. మహిళను శక్తి యాప్ వినియోగించుకోవాలన్నారు. రహ రహదారి భద్రత ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్త లపై ఆయన అవగాహన పరిచారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

28-5pg10.qxd:28-5pg10.qxd 1/1/02 6:43 AM Page 1



### ఆసియా ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్ ఫ్రీస్టైల్ రెజ్లర్లకు 9 పతకాలు



**న్యూఢిల్లీ:** అండర్23 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత ఫ్రీస్టైల్ రెజ్లర్లు తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించారు. వియత్నాంలోని నాంగ్‌లో జరుగుతున్న ఈ పోటీల నాలుగో రోజున ఈ బృందం పలు పతకాలను కైవసం చేసుకుంది. కుమార్ మోహిత్, చందర్‌మోహన్ తమతమ వెయిట్ కేటగిరీలలో స్వర్ణ పతకాలు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. కాగా భారత్ రజత, కాంస్య పతకాలను కూడా గెలుచుకుని తన మొత్తం పతకాల సంఖ్యను పటిష్టం చేసుకుంది. 65 కేజీల విభాగంలో పోటీపడిన మోహిత్, ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఓస్మోన్‌బాయ్ అబ్దిసమాటోవ్‌ను 12-4 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత, హోరాహోరీగా జరిగిన 79 కేజీల ఫైనల్‌లో కజకిస్థాన్‌కు చెందిన యెర్ఖాన్ అబిల్‌పై 7-6 తేడాతో చందర్‌మోహన్ విజయం సాధించి, భారత్‌కు మరో టైటిల్‌ను అందించాడు. 61 కేజీల విభాగంలో, కజకిస్తాన్‌కు చెందిన నూర్దానాత్ ఐతానోవ్‌తో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో 4-4తో డ్రా చేసుకున్న దీపక్ రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. 74 కేజీల విభాగంలో, తుర్క్‌మెనిస్తాన్‌కు చెందిన వతన్ అన్నెరజోవ్‌పై 10-0 తేడాతో తిరుగులేని విజయం సాధించిన దీపక్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫైనల్‌లో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఉలుక్‌బెక్ సూరోంబేకోవ్ చేతిలో ఓడిపోయిన తర్వాత, 92 కేజీల విభాగంలో కుమార్ పునిత్ రజత పతకం సాధించడంతో భారతదేశ పతకాల సంఖ్య మరింత పెరిగింది.

# సింగపూర్ ఓపెన్‌లో ప్రణయ్ విజయం

## మహిళల విభాగంలో మాళ్విక నిష్క్రమణ






**న్యూఢిల్లీ:** భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 2026 సింగపూర్ ఓపెన్ సూపర్750 టోర్నమెంట్ ప్రారంభ రౌండ్‌లో భారీ విజయాన్ని నమోదు చేయగా, మహిళల సింగిల్స్‌లో మాళ్విక బన్సోద్ ఓటమి చెందింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో అతను వెనుకబడి ఉన్నప్పటికీ ఇండోనేషియాకు చెందిన ప్రపంచ 5వ ర్యాంకర్ జోనాటన్ క్రిస్టీని మూడు గేమ్‌లలో 10-21, 21-12, 21-18 తేడాతో ఓడించి సంచలనం సృష్టించి రౌండ్ ఆఫ్ 16కు చేరుకున్నాడు. మొదటి గేమ్‌లో వైఫల్యం చెందినా రెండవ గేమ్‌లో అద్భుతంగా పుంజుకుని ఆధిపత్యం చెలాయించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. మూడవ గేమ్‌లో, ఇద్దరి మధ్య పోరు జరిగినా చివరికి ప్రణయ్ చివరి మూడు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్ గెలిచాడు. వీరిద్దరి మధ్య జరిగిన ముఖాముఖి పోరులో క్రిస్టీ 7-2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, ఐదేళ్ల తర్వాత ప్రణయ్ ఎట్టకేలకు అతనిపై విజయం సాధించాడు. మరోవైపు, భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టో కూడా మూడు గేమ్‌ల విజయంతో రెండో రౌండ్‌కు చేరుకున్నారు. వారు మలేషియాకు చెందిన వాంగ్ టియెన్ సి మరియు సీన్ లిమ్ చీవ్ జోడీని 21-14, 20-22, 21-13 తేడాతో ఓడించి, జపాన్ జోడీతో రెండో రౌండ్ పోరుకు సిద్ధమయ్యారు. ఇక మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి మాళ్విక బన్సోద్ చైనీస్ తైపీకి చెందిన హ్సు యాంగ్ టి లిన్ చేతిలో 11-21, 21-19, 12-21 తేడాతో ఓడిపోయి మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది.



### అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

# జావెలిన్‌లో సుమిత్ వరల్డ్ రికార్డ్

**న్యూఢిల్లీ:** పారాలింపిక్ ఛాంపియన్ సుమిత్ అంటిల్ పురుషుల జావెలిన్‌లో కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. బెంగళూరులో బుధవారం జరిగిన ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల ఎఫ్64 జావెలిన్ త్రో ఈవెంట్‌లో తన సొంత ప్రపంచ రికార్డును మెరుగుపరిచాడు. అతను తన ఐదవ ప్రయత్నంలో 74.82 మీటర్ల భారీ త్రోవిసిరి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన, మునుపటి ప్రపంచ రికార్డు అయిన 73.29 మీటర్లను మెరుగుపరిచి టైటిల్ గెలుచుకున్నాడు. సుమిత్ చివరిసారిగా చైనాలో జరిగిన 2023 ఆసియా పారా గేమ్స్‌లో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. మూడేళ్ల తర్వాత, అతను ఇప్పుడు 1.5 మీటర్ల భారీ మెరుగుదలతో తన సొంత ప్రపంచ రికార్డును ఏడవసారి మెరుగుపరిచాడు. అలాగే గతేడాది న్యూఢిల్లీలో జరిగిన స్వదేశీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తన ప్రపంచ రికార్డును మెరుగుపరచుకోవాలని సుమిత్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ భుజం గాయం నుంచి కోలుకుంటున్నందున అతను వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన సాధించలేకపోయాడు. అయితే, అతను 71.37 మీటర్ల కొత్త ఛాంపియన్‌షిప్ రికార్డుతో తన మూడవ ప్రపంచ టైటిల్‌ను గెలుచుకున్నప్పటికీ, తాను ఆశించిన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను అందుకోలేకపోయాడు. తాజాగా మరోసారి తన సత్తాను చాటాడు.

# క్లైమాక్స్‌కు ఆరెంజ్ క్యాప్ రేస్

## హీటెక్కుతున్న పరుగుల వేట!



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగిసి, ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ప్రారంభమవడంతో టోర్నమెంట్ అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. ఈ 19వ ఎడిషన్‌లో భారీ స్కోర్లు, సిక్సర్లు, ఫోర్ల వర్షం కురుస్తున్నాయి.

ఒకవైపు జట్లు ట్రోఫీ కోసం పోటీ పడుతుంటే మరోవైపు ప్రతిష్టాత్మక ఆరెంజ్ క్యాప్ కోసం బ్యాటర్ల మధ్య పోరు క్లైమాక్స్‌కు చేరింది. ఈ సీజన్‌లో ఇప్పటికే బ్యాటర్లు ఏకంగా 9 సెంచరీలు బాదడం విశేషం. ఈ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ 652 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. లీగ్ దశ ముగిసే సమయానికి 14 మ్యాచ్‌ల్లో 46.57 సగటుతో, 157.86 స్ట్రైక్ రేట్‌తో 638 రన్స్ చేసిన సుదర్శన్, క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌లో మరో 14 పరుగులు జోడించి మొత్తం 652 పరుగులతో టాప్‌లో కొనసాగుతున్నాడు. 2025 సీజన్‌లో కూడా ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతను ఈసారి కూడా దాన్ని నిలబెట్టుకుని బ్యాక్‌టుబ్యాక్ టైటిల్స్ సాధించాలని కసితో ఉన్నాడు. ఇక గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సీజన్‌లో కెప్టెన్సీ బాధ్యతలను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తూనే, బ్యాటింగ్‌లోనూ దుమ్మురేపుతున్నాడు. గిల్ ఇప్పటివరకు 159.27 స్ట్రైక్ రేట్‌తో 6 హాఫ్ సెంచరీలు బాది 618 పరుగులతో 2వ స్థానంలో నిలిచాడు. మిగిలిన మ్యాచ్‌ల్లో గిల్ భారీ స్కోర్లు సాధిస్తే ఆరెంజ్ క్యాప్ అందుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అలాగే సన్‌రైజర్స్ హైదరాబాద్ మిడిల్ ఆర్డర్ వెన్నుముక, సౌతాఫ్రికా క్లాస్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ 3వ ప్లేస్‌లో ఉన్నాడు.

ఈ సీజన్‌లో 159.47 స్ట్రైక్ రేట్‌తో, 6 హాఫ్ సెంచరీల సాయంతో 606 పరుగులు చేశాడు. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుకు బ్యాక్‌టుబ్యాక్ ట్రోఫీలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 600 పరుగులు పూర్తి చేశాడు. అతని ఐపీఎల్ కెరీర్‌లోనే బెస్ట్ అనదగ్గ రీతిలో 164.38 స్ట్రైక్ రేట్‌తో ఈ పరుగులు సాధించాడు. లీగ్ దశ ముగిసేసరికి రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 583 పరుగులు సాధించాడు. టాప్5ని బ్యాటర్ల కంటే ఇతని స్ట్రైక్ రేట్ (232.27) అత్యధికంగా ఉంది.

# భారత్ హాకీ మహిళా జట్టు ఓటమి

## 2-1 తేడాతో ఆస్ట్రేలియా విజయం

**న్యూఢిల్లీ:** భారత, ఆస్ట్రేలియా మహిళల హాకీ జట్ల మధ్య నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రోజు హోరాహోరీగా జరిగిన పోరులో హాకీ రూస్ (ఆస్ట్రేలియా) జట్టు 2-1 తేడాతో అతిథి జట్టుపై స్వల్ప విజయం సాధించింది. పెర్త్‌లో జరిగిన తొలి క్వార్టర్‌లో భారత్ మొదట గోల్ చేసింది. నవనీత్ కౌర్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి తన జట్టుకు ఆరంభంలోనే ఆధిక్యం అందించింది. తొలి అర్ధభాగంలో భారత జట్టు పటిష్టంగా నిలబడి, రెండవ క్వార్టర్ అంతటా తమ ఆధిక్యాన్ని విజయవంతంగా కొనసాగించింది. అయితే, రెండవ అర్ధభాగంలో ఆట గమనం మారింది. ఆస్ట్రేలియాకు చెందిన అబ్బీ విల్సన్ 2 పెనాల్టీకార్నర్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, 3, 4 క్వార్టర్లలో స్కోర్ చేసి, ఆతిథ్య జట్టుకు పునరాగమన విజయాన్ని అందించింది. ఈ ఏడాది ఆరంభంలో అర్జెంటీనాలో జరిగిన 4 మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత, ప్రపంచ నంబర్ 2 జట్టుతో జరిగిన సిరీస్‌ను 2-2తో సమం చేసి ప్రోత్సాహకరమైన ప్రదర్శన కనబరిచిన భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడుతోంది. 22 మంది సభ్యులున్న భారత జట్టులో వర్ధమాన ప్రతిభావంతులైన సోనమ్, హినా బానో, లల్తాంత్లువాంగి తమ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్న భారత జట్టు, 8వ ర్యాంక్‌లో ఉన్న తమ ప్రత్యర్థులకు సవాలు విసరడానికి సర్వశక్తులు ఒడ్డడానికి సిద్ధంగా ఉంది.



# స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, మే 27:** దేశీయ ఈక్విటీసూచీలు బుధవారం స్వల్పనష్టాలు ఎదుర్కొన్నాయి. అమెరికా ఇరాన్ టెన్షన్లతోపాటు విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు విత్‌డ్రాలు పెరగడంతో ఎంపికచేసిన సూచీల్లో ఒత్తిళ్లు పెరిగాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 141.90 పాయింట్లు క్షీణించి 75,867.80 నపాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిస్తే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీకూడా 6.55 పాయింట్లు క్షీణించి 23,907,15 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేసింది. కీలక కంపెనీల్లో ఓఎన్‌జిసి 4.94శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.54శాతం, ఐటిసి 0.48శాతం క్షీణించి నిఫ్టీపై ఒత్తిడిని పెంచాయి. మార్కెట్లలో బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.83శాతంపెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.49శాతం పెరిగింది. బిఎస్‌ఇలో మొత్తం 2275 కంపెనీల షేర్లుపెరిగి 1945 కంపెనీలు క్షీణించాయి. 182 మాత్రం యధాతథంగా కొనసాగాయి. దేశీయ మార్కెట్లు గురువారం బక్రిద్‌కారణంగా మార్కెట్లకు సెలవు. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి డాలరుతో చెలామణి 95.70గా నడిచింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు కూడా రూ.1,56,194గా కొనసాగింది. అమెరికా పదేళ్ల బాండ్లు 4.464శాతం రిటార్నులు నమోదుచేస్తే కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై నెల సెటిల్‌మెంట్లకుగాను 3.34శాతం క్షీణించి 96.24 డాలర్లుగా కొనసాగింది. అమెరికా డౌజోన్స్ 224 పాయింట్లుపెరిగింది. యూరోపియన్ షేర్లు బుధవారం ఎగువస్థాయిలోనే ముగిసాయి. ఇరాన్ వివాదంపైనే అప్రమత్తంగా వ్యవహరిస్తూ ట్రేడింగ్ కొనసాగించారు. ఇక అమెరికాలో రాత్రికిరాత్రే వాల్‌స్ట్రీట్‌షేర్లు పెరిగాయి. ఎస్‌అండ్‌పి 500, నాస్‌డాక్ కాంపోజిట్ ఇంట్రాడేల్లో రికార్డు గరిష్టాలకు చేరాయి. ఎస్‌అండ్‌పి500 0.61శాతం, నాస్‌డాక్ 1.19శాతంచొప్పున పెరిగాయి. డౌజోన్స్ పార్శ్విఆమిక సగటు మాత్రం 118.02 పాయింట్లుక్షీణించింది. ఇక షేర్లపరంగాచూస్తే జీ ఎంటర్‌టైన్‌మెంట్ 10.49శాతం, టైమెక్స్‌గ్రూప్ ఇండియా13.07శాతం, ప్రాక్టర్ అండ్ గాంబుల్ హెల్త్ 10.53శాతం, జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ 4.86శశాతం, గిల్లెట్ ఇండియా 4.85శాతం, ఫినోలెక్స్ 7.74శాతం, గాంధార్ ఆయిల్‌రిఫైనరీ0.22శాతం అద్వైత్ ఎనర్జీ 0.54శాతం, కిల్బుమ్ ఇంజినీరింగ్ 3.61శాతంపెరిగాయి.

## నాలుగో త్రైమాసికంలో ఈక్విటీ సంపద

# రూ.12.6 లక్షల కోట్లు ఆవిరి



**ముంబయి, మే 27:** భారతీయ కుటుంబాల ఈక్విటీ సంపదకు మార్చి త్రైమాసికంలో భారీ దెబ్బ తగిలింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడిదారుల నిరంతర అమ్మకాల ఒత్తిడి కారణంగా సుమారు రూ.12.6 లక్షల కోట్ల సంపద ఆవిరైందని తాజా ఎన్‌ఎస్‌ఇ మార్కెట్ పల్స్ నివేదిక వెల్లడించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నిఫ్టీ 10 శాతానికి పైగా పతనమైంది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల ఎఫ్‌పిఐలు భారీ నిధుల ఉపసంహరణలు, ప్రపంచ పెట్టుబడులు తైవాన్, దక్షిణ కొరియా వంటి కృత్రిమ మేధస్సు ఆధారిత మార్కెట్ల వైపు మళ్లడం కూడా భారత మార్కెట్లపై ఒత్తిడిని పెంచినట్లు పల్స్‌నివేదిక స్పష్టంచేసింది. నష్టాలు ఎదురయినా 2020 ఏప్రిల్ నుంచి భారతీయ కుటుంబాల ఈక్విటీ సంపద సృష్టి మొత్తం రూ.44 లక్షల కోట్లకు చేరింది. 2026 ఆర్థిక సంవత్సరంలో నాల్గవ త్రైమాసిక పతనం కారణంగా రూ.2.5 లక్షల కోట్ల తగ్గుదల నమోదైంది. మార్చి 2026 నాటికి కుటుంబాల మొత్తం ఈక్విటీ సంపద .రూ.76.5 లక్షల కోట్లకు చేరగా మార్చి 2020 నుంచి ఇది వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు29.6 శాతంగా ఉంది. ఇక వ్యక్తిగత పెట్టుబడిదారుల కలిపిన వాటాలు ఆరు వరుస త్రైమాసికాలుగా విదేశీ పెట్టుబడిదారుల వాటాలను అధిగమించడం విశేషం. అయితే వ్యక్తిగత పెట్టుబడిదారుల ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు ఐదేళ్ల కనిష్ఠం అంటే 9.1 శాతానికి పడిపోయాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో ద్వితీయ మార్కెట్లలో నికర అమ్మకాలు నమోదవడం గత ఏడు సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. ఇక విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు 2026 ఆర్థిక సంవత్సరంలో 19.6 బిలియన్ డాలర్లమేరవిత్‌డ్రాచేసారు. వారి వాటా ఎన్‌ఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల్లో 17 ఏళ్ల కనిష్ఠ స్థాయి 15.8 శాతానికి పడిపోయింది. దేశీయ మ్యూచువల్ ఫండ్ల వాటా రికార్డు స్థాయి 11.4 శాతానికి పెరిగింది. నిరంతర సిప్‌పెట్టుబడులు, రిటైల్ పెట్టుబడిదారుల స్థిరమైన భాగస్వామ్యం దీనికి ప్రధాన కారణాలుగా నివేదిక తెలిపింది. మొత్తంగా చూస్తే, భారతీయ కుటుంబాల పెట్టుబడి ధోరణిలో నిర్మాణాత్మక మార్పు చోటుచేసుకుంటోందని, ప్రత్యక్ష ఈక్విటీల కంటే మ్యూచువల్ ఫండ్ల ద్వారా పరోక్ష పెట్టుబడులు మరింత స్థిరత్వాన్ని చూపుతున్నాయని ఎన్‌ఎస్‌ఇ మార్కెట్ పల్స్ స్పష్టంచేసింది.

# దేశీయ రూట్లలో సర్వీసులు కుదిస్తున్న ఎయిరిండియా




**ముంబయి, మే 27:** పశ్చిమాసియా ఉద్రిక్తతల పుణ్యమా అని ఎయిరిండియా ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులను తగ్గించాలని సంస్థ నిర్ణయించింది. దీనికితోడు విమాన ఇంధన ధరలు భారీగా పెరగడం కూడా ఒక కారణమే. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో ఎయిరిండియా జులై, ఆగస్టు నెలల్లో తన దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే రూట్లను పూర్తిగా రద్దు చేయకుండా కేవలం విమానాల ఫ్రీక్వెన్సీని మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తోంది. ఈ మార్పులపై ఎయిరిండియా అధికారిక ప్రతినిధి స్పందించారు. ఇంధన ధరల ప్రభావం వల్లే కొన్ని దేశీయ రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా క్రమబద్ధీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ పాత షెడ్యూల్ ప్రకారం అన్ని విమానాలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రయాణికుల డిమాండ్, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తామని ఎయిరిండియా వెల్లడించింది. షెడ్యూల్ మార్పుల వల్ల ఇబ్బంది పడే ప్రయాణికులకు పూర్తి సాయం అందిస్తామని విమానయాన సంస్థ హామీ ఇచ్చింది. టికెట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో సీట్లు కేటాయించడం, ఎలాంటి అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే అవకాశం కల్పించడం లేదా పూర్తి డబ్బును రిఫండ్ చేయడం వంటి ఆప్షన్లను అందిస్తామని తెలిపింది. రాబోయే రెండు నెలల్లో ప్రయాణించే వారు ముందే ఫ్లైట్ షెడ్యూల్స్ తనిఖీ చేసుకోవాలని సూచించింది.

# ఆసియా-పసిఫిక్ డేటా హబ్‌గా భారత్

## టాప్ సెకండరీ మార్కెట్‌గా హైదరాబాద్!

**ముంబయి, మే 27:** భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌ సదుపాయాల రంగంలో హబ్‌గా మారుతోంది. ఆసియాపసిఫిక్ ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థం ఉండగా మరో 3.1 గిగావాట్ల సామర్థం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈ వివరాలు వెల్లడించింది. దేశంలో కృత్రిమ మేధ వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీఎన్‌సిఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఈ మార్పుపై కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థం అత్యంత కీలకంగా మారాయని వివరించారు. భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలిచింది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు వృద్ధిలో ఉన్నాయి. హైదరాబాద్ ఆసియాపసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది.

## చిప్ డివిజన్ లాభాలతో ఉద్యోగులకు

# శాంసంగ్ భారీ బోనస్




**సియోల్, మే 27:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తమ ఉద్యోగులకు భారీ కానుక ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నెలకొన్న అనూహ్యమైన వృద్ధి కారణంగా కంపెనీ చిప్ విభాగం లాభాల ర్యాలీ తీయడంతో ఉద్యోగులకు భారీ నజరానా ప్రకటించింది. చిప్ డివిజన్‌లోని ప్రతి ఉద్యోగికి సగటున 3.40 లక్షల డాలర్లు (దాదాపు రూ. 3.25 కోట్లు) బోనస్‌గా అందనుంది. ఈ మేరకు కంపెనీ యాజమాన్యానికి, కార్మిక సంఘానికి మధ్య కుదిరిన ఒప్పందానికి ఉద్యోగుల నుంచి ఆమోదం లభించింది. తాజాగా జరిగిన ఓటింగ్‌లో కంపెనీ అతిపెద్ద కార్మిక సంఘం ఈ భారీ బోనస్ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఈ ఓటింగ్‌లో 95 శాతానికి పైగా అర్హులైన సభ్యులు పాల్గొనగా, వారిలో 73.7 శాతం మంది ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేశారు. ప్రస్తుతం ఎఐ డేటా సెంటర్ల కోసం మెమరీ చిప్‌లకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెమరీ చిప్ తయారీదారుల్లో ఒకటైన శాంసంగ్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. దీంతో గడిచిన త్రైమాసికంలో కంపెనీ చిప్ విభాగం ఆదాయం ఏకంగా 49 రెట్లు పెరిగింది.

ఈ నేపథ్యంలోనే ఉద్యోగులకు లాభాల్లో వాటా ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ బోనస్ శాంసంగ్ ఉద్యోగులందరికీ కాకుండా కేవలం ప్రాసెసర్లు, మెమరీ చిప్‌లను తయారు చేసే చిప్ విభాగానికే వర్తింపచేసింది. ఈ డివిజన్‌లో సుమారు 78,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఒప్పందం ప్రకారం సెమీకండక్టర్ విభాగం ఆపరేటింగ్ ప్రాఫిట్‌లో 10.5 శాతాన్ని ఉద్యోగులకు షేర్ల రూపంలో, మరో 1.5 శాతాన్ని నగదు రూపంలో చెల్లిస్తారు. ఈ బోనస్ చెల్లింపుల కోసం కంపెనీ సుమారు 26.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనుందని అంచనా. తైవాన్‌కు చెందిన టిఎస్‌ఎంసి తర్వాత ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను దాటిన రెండో ఆసియా కంపెనీగా శాంసంగ్ నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.